




## టెన్త్ టాపర్లకు స్పీకర్ అయ్యన్న విందు

- ఇంటికి ఆహ్వానించి సత్కారం
- హెచ్‌ఎంలు, ఎంఈవోలకు ప్రశంసలు

- వివరాలు 8 లో..




# గ్లోబల్ బ్రాండ్లుగా స్థానిక ఉత్పత్తులు

- పారిశ్రామిక క్లస్టర్లకు లాజిస్టిక్స్ కనెక్టివిటీ
- రవాణా వ్యయం తగ్గించటమే కీలకాంశం
- ఇండస్ట్రీ- ఇన్ఫ్రా- టూరిజంపై ప్రత్యేక దృష్టి
- ఏపీలో ప్రొడెక్టు పర్ఫెక్షన్ క్లస్టర్లపై సీఎం సమీక్ష

2

ఏపీ ఉత్పత్తులు గ్లోబల్ బ్రాండ్లస్థాయికి చేరేలా చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని పారిశ్రామిక క్లస్టర్లకు రోడ్డు, రైల్, పోర్టు కనెక్టివిటీ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రొడెక్టు పర్ఫెక్షన్ క్లస్టర్లపై సమీక్ష నిర్వహించిన సీఎం.. విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్లలో అభివృద్ధి చేయనున్న పారిశ్రామిక క్లస్టర్లపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన పథకం (భవ్య పథకం) కింద చేపట్టనున్న పారిశ్రామిక పార్కులు, కెమికల్ పార్కుల అభివృద్ధిపై సీఎం చర్చించారు.

## తాగునీటికి జిల్లాకు రూ.కోటి



- వాహన రిజిస్ట్రేషన్లు ఇక సులభతరం
- వాహన రిజిస్ట్రేషన్ అదనపు అథార్టీగా డీలర్లు
- ప్రభుత్వ సేవల్లో ఏఐ వినియోగంపై సలహా మండలి
- వివిధ శాఖలపై ఆర్టీజీఎస్‌నుంచి సీఎం చంద్రబాబు సమీక్ష

3

### మోదీపై విశ్వాసానికి ఫలితాలే నిదర్శనం: సీఎం చంద్రబాబు

3

### ఎన్డీయేకు మంత్రి లోకేష్ అభినందనలు





## పోషకాహారంగా రాగిజావ

- మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు పంపిణీ
- మరో మూడేళ్ల పొడిగింపునకు ప్రభుత్వం నిర్ణయం
- మంత్రి లోకేష్ సమక్షంలో సత్యసాయి సేవా ట్రస్ట్‌తో విద్యాశాఖ ఎంవోయూ

2



3

## అరంగేట్రంలోనే అదరగొట్టారు

టీవీకే అధినేత విజయ్‌కి మంత్రి లోకేష్ అభినందనలు

## ప్రతిష్టాత్మకంగా మహానాడు



- నెల్లూరు ఇఫ్కో సెజ్‌లో నిర్వహణ
- రేపటినుంచే ఆ ప్రాంతంలో పనులు
- పురపాలక మంత్రి పొంగూరు నారాయణ

7

### జూన్ 21న 'యోగా డే'

సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి: సత్యకుమార్

8



## పుష్కర సంరంభం!

- ప్రాధాన్యతా క్రమంలో గోదావరి పుష్కరాల పనులు
- అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలి
- పురపాలక మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాలు
- పుష్కరాల ఏర్పాట్లు, నిధుల అంచనాలపై సమీక్ష
- పాల్గొన్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు, మున్సిపల్ సిబ్బంది

8

## టీచర్లు.. సింగపూర్ బాట!

- 37మంది ఉత్తమ టీచర్లకు అంతర్జాతీయ వేదికపై శిక్షణ
- నేడు ప్రపంచ విద్యార్థులు... రేపటి తరానికి మార్గదర్శకులు
- ఆంధ్రప్రదేశ్ విద్యారంగంలో నవశకం
- గ్లోబల్ స్టాండర్డ్స్ దిశగా వేగంగా అడుగులు..

4



# గ్లోబల్ బ్రాండ్లుగా స్థానిక ఉత్పత్తులు

- పారిశ్రామిక క్లస్టర్లకు లాజిస్టిక్స్ కనెక్టివిటీ
- రవాణా వ్యయం తగ్గించటమే కీలకాంశం
- ఇండస్ట్రీ- ఇన్ఫ్రా- టూరిజంపై ప్రత్యేక దృష్టి
- ఏపీలో ప్రొడెక్టు పర్ఫెక్షన్ క్లస్టర్లపై సీఎం సమీక్ష



అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తయారయ్యే ఉత్పత్తులు గ్లోబల్ బ్రాండ్లుగా ఎదిగేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని పారిశ్రామిక క్లస్టర్లకు రోడ్డు, రైల్, పోర్టు కనెక్టివిటీ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏపీ సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో సోమవారం ప్రొడెక్టు పర్ఫెక్షన్ క్లస్టర్లపై సీఎం సమీక్ష నిర్వహించారు. సమీక్షలో భాగంగా విశాఖ ఎకనామిక్ రీజియన్, అమరావతి ఎకనామిక్ రీజియన్, తిరుపతి ఎకనామిక్ రీజియన్ ప్రాంతాల్లో అభివృద్ధి చేయనున్న పారిశ్రామిక క్లస్టర్లపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన పథకం (భవ్య పథకం) కింద చేపట్టనున్న పారిశ్రామిక పార్కులు, కెమికల్ పార్కుల అభివృద్ధిపై సీఎం చర్చించారు. 2026-27లో ఏర్పాటు కానున్న రేర్ ఎర్త్ మినరల్ పార్క్ ఈస్ట్ కోస్ట్ ఇండస్ట్రియల్ కారిడార్, కంటైనర్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ సహా 175 ఎంఎస్ఎంఈ పార్కులను క్లస్టర్ల వారీగా అభివృద్ధి చేసే అంశంపై సమీక్షలో చర్చించారు. పారిశ్రామిక పార్కుల్లో ప్రొడెక్టు పర్ఫెక్షన్‌తోపాటు లాజిస్టిక్స్‌ను కూడా అనుసంధానం చేయాలని సీఎం సూచించారు. నీరు, విద్యుత్, కోల్డ్ చైన్, వేర్ హౌసింగ్‌లాంటి మౌలిక సదుపాయాలు ఈ లాజిస్టిక్స్ పార్కులకు అనుసంధానమయ్యేలా చూడాలన్నారు. ప్రత్యేకించి రవాణా వ్యయం తగ్గితే ప్రయోజనం కలుగుతుందని స్పష్టం చేశారు. పారిశ్రామిక క్లస్టర్లకు రైల్, రోడ్, పోర్టు కనెక్టివిటీ జరిగేలా లాజిస్టిక్స్ ఇంటిగ్రేషన్ మ్యాపింగ్ జరగాలని సీఎం చంద్రబాబు సూచనలు చేశారు.

## ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌ల అభివృద్ధి

స్థానికంగా తయారయ్యే ఉత్పత్తులకు నాణ్యత పెరిగితేనే గ్లోబల్‌స్థాయికి చేరతాయని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉత్పత్తులకు స్థానికంగా, ప్రాంతీయంగా, దేశ విదేశీ మార్కెట్లకు చేరేలా చూడాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎంఎస్ఎంఈల్లోని ఉత్పత్తులు అంతర్జాతీయ ప్రమాణాలతో తయారయ్యేలా ప్రోత్సాహం కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు. పారిశ్రామిక క్లస్టర్లలో ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లను ఏర్పాటు చేయటం ద్వారా రైతులకూ ప్రయోజనం కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన భవ్య పథకం ద్వారా రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో రసాయనాల తయారీ పార్కులను ఏర్పాటు చేయాలని సూచించారు. పరిశ్రమలు- మౌలిక సదుపాయాలు- పర్యాటకం అనే విధానంలో ప్రణాళికలు చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ప్రతీ జిల్లాలోనూ ఓ మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు ద్వారా స్థానిక యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెద్దఎత్తున కలుగుతాయన్నారు. ప్రతీ పారిశ్రామిక క్లస్టర్ వద్దా ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌ల అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు.

వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూర్ కార్యక్రమం ద్వారా ఏపీ ఎంఎస్ఎంఈల స్థాపనలో అగ్రస్థానంలో ఉండాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా స్కిల్ డెవలప్మెంట్ జరగాలన్నారు. నైపుణ్యాభివృద్ధికి వర్సిటీల్లోనూ కోర్సులను హైబ్రీడ్ విధానంలో అందించే ఆలోచన చేయాలన్నారు. సమీక్షకు పరిశ్రమల మంత్రి టీజీ భరత్, సీఎస్ సాయిప్రసాద్, పరిశ్రమలు, పెట్టుబడులు మౌలిక సదుపాయాలు, అటవీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఆర్టీజీఎస్ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ఉప రాష్ట్రపతికి జన్మదిన శుభాకాంక్షలు: సీఎం చంద్రబాబు



అమరావతి (చైతన్య రథం): భారత ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఎక్స్ వేదికపై పోస్టు పెడుతూ.. "మీరు మంచి ఆరోగ్యం, దీర్ఘాయువుతో దేశ సేవలో నిరంతర అంకితభావంతో ఉండాలని కోరుకుంటూ హృదయపూర్వక శుభాకాంక్షలు. వివేకం, నిజాయితీ, స్థిరమైన నాయకత్వం ద్వారా మన దేశ పురోగతికి, పార్లమెంటరీ కార్యకలాపాల పటిష్టతకు మీరు చేపట్టే ప్రయత్నాలలో మరింత విజయం సాధించాలని ఆశిస్తున్నాను" అని చంద్రబాబు పేర్కొన్నారు.

## మీ మార్గదర్శకత్వం నాకెంతో విలువైనది
## ఉప రాష్ట్రపతికి లోకేష్ జన్మదిన శుభాకాంక్షలు



అమరావతి (చైతన్య రథం): భారత ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్‌కు విద్యా మంత్రి నారా లోకేష్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఎక్స్‌లో పోస్టు చేస్తూ.. "మీరు మంచి ఆరోగ్యం, దీర్ఘాయువుతో దేశానికి నిరంతర సేవ చేయాలని ప్రార్థిస్తున్నాను. మీతో ఎన్నో స్ఫూర్తిదాయకమైన సంభాషణలు జరిపే అదృష్టం నాకు కలిగింది.

మీ మార్గదర్శకత్వం, వివేకం, నాయకత్వాన్ని నేను ఎంతో విలువైనవిగా భావిస్తాను. మన పార్లమెంటరీ సంప్రదాయాలను బలోపేతం చేయడానికి, భారతదేశ ప్రగతిపథంలో మన సమష్టి ప్రయాణంలో మమ్ములను ప్రేరేపించడానికి మీరు చేస్తున్న ప్రయత్నాలు నిజంగా ప్రశంసనీయం" అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

# పోషకాహారంగా రాగిజావ

- మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు పంపిణీ
- మరో మూడేళ్ల పొడిగింపునకు ప్రభుత్వం నిర్ణయం
- మంత్రి లోకేష్ సమక్షంలో సత్యసాయి సేవా ట్రస్ట్‌తో విద్యాశాఖ ఎంవోయూ



ఉండవల్లి (చైతన్య రథం): ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతినుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు సన్నబియ్యంతోపాటు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా కూటమి ప్రభుత్వం అందిస్తోంది. మెనూలో మార్పులతో ఎక్కువమంది భోజనం చేస్తున్నారు. భోజనం మరింత రుచి, శుచిగా వడ్డించేలా విద్య, ఐటీ మంత్రిగా నారా లోకేష్ ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు అదనపు పోషకాహారం అందించేందుకు శ్రీ సత్యసాయి సేవా ట్రస్ట్ సహకారంతో ప్రస్తుతం అమలులో ఉన్న రాగిజావ పంపిణీ కార్యక్రమం మరో మూడేళ్లు కొనసాగింపునకు ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు మంత్రి నారా లోకేష్ సమక్షంలో 2026-29 కాలానికి విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమం కొనసాగించేందుకు శ్రీ సత్యసాయి సేవా ట్రస్ట్‌తో విద్యాశాఖ ఎంవోయూ కుదుర్చుకుంది. శ్రీ సత్యసాయి సేవా ట్రస్ట్ సహకారంతో రాగిజావ పంపిణీ కార్యక్రమం మార్చి 2023లో ప్రారంభం కాగా.. ఈ ఏడాది ఏప్రిల్‌తో కాలపరిమితి ముగిసింది. దీంతో పొడిగింపునకు విద్యాశాఖ ఎంవోయూ కుదుర్చుకుంది. ప్రస్తుతం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో జోనల్‌వారీగా విద్యార్థులకు మెనూ అమలు చేస్తున్నారు. ఈ మెనూలో ఫోర్టిఫైడ్ ఫైన్ రైస్, వారానికి 5సార్లు గుడ్డు, వారానికి మూడుసార్లు చిక్కీ, అలాగే పోషకాహారపు పదార్థాలుగా చిక్కీలేని రోజుల్లో రాగిజావను వారానికి మూడుసార్లు అందిస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకంపై ప్రభుత్వం ఏడాదికి సుమారు రూ.1,850 కోట్లు ఖర్చుచేస్తోంది. తద్వారా విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, అటెండెన్స్, డ్రాప్‌అవుట్స్ నివారణ, పోషకస్థాయిలు మెరుగుపరచడమే లక్ష్యంగా పెట్టుకుంది. విద్యార్థులకు హెల్త్ సప్లిమెంట్‌గా రాగిజావను పంపిణీ చేస్తున్నారు. 10 గ్రాముల రాగి పిండి, 10 గ్రాముల బెల్లం పొడిని 150 మిల్లీలీటర్ల వేడినీటిలో కలిపి విద్యార్థులకు అందించడం జరుగుతోంది. తద్వారా కాల్షియం, ఐరన్‌తో సమృద్ధిగా ఉండి పోషకాహారాన్ని మెరుగుపరుస్తుంది. రాగిపిండి, బెల్లంపొడిని శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఉచితంగా అందిస్తుంది. ట్రస్ట్ ద్వారా జిల్లా కేంద్రాల వరకు సరఫరా చేస్తారు. అక్కడినుంచి పౌరసరఫరాల శాఖ ద్వారా పాఠశాలలకు పంపిణీ చేస్తారు. ఇందుకోసం మూడేళ్లలో రూ.80 కోట్ల వరకు వెచ్చించనున్నారు. కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జే రత్నాకర్, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ అడ్మిన్ కోఆర్డినేటర్ ఎస్‌జి చలం, శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభాగం అధ్యక్షులు ఆర్ లక్ష్మణరావుతోపాటు మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్ బి శ్రీనివాసరావు, అడిషనల్ డైరెక్టర్ ఆర్‌ఎస్ గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

చైతన్యరథం

# తాగునీటికి జిల్లాకు రూ.కోటి

- వాహన రిజిస్ట్రేషన్లు ఇక సులభతరం
- వాహన రిజిస్ట్రేషన్ అదనపు అథార్టీగా డీలర్లు
- ప్రభుత్వ సేవల్లో ఏఐ వినియోగంపై సలహా మండలి
- వివిధ శాఖలపై ఆర్టీజీఎస్‌నుంచి సీఎం చంద్రబాబు సమీక్ష



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో ఎక్కడా మంచినీటి సరఫరా సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. నీటి సరఫరా కోసం జిల్లా కలెక్టర్లకు రూ.కోటి చొప్పున నిధులు విడుదల చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. కొరత ఉన్నచోట ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలన్నారు. బోర్లు కూడా మరమ్మతులు చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేసేలా వాహన డీలర్లను అదనపు రిజిస్ట్రేషన్ అథారిటీగా గుర్తించేందుకు సీఎం ఆమోదాన్ని తెలియచేశారు. వాహన రిజిస్ట్రేషన్ ప్రక్రియ 24 గంటల్లో పూర్తయ్యేలా చూడాలని సీఎం సూచించారు. రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంనుంచి వివిధ శాఖల పనితీరుపై సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం అందించే పౌరసేవల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం మరింత పెంచేందుకు, సమర్ధంగా వినియోగించేందుకు వీలుగా నిపుణులతో కూడిన సలహా మండలి ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రంలో డ్రోన్ల వినియోగం పెంచేలా వర్క్‌షాప్ నిర్వహించాలని సీఎం సూచించారు. మైనింగ్ కార్యకలాపాలను సమర్ధంగా నిర్వహించేందుకు మధ్యప్రదేశ్ డ్రోన్ వ్యవస్థను వినియోగిస్తున్న తీరును అధ్యయనం చేసి ఏపీలోనూ అమలు చేసేలా చూడాలన్నారు. అవేర్ సాంకేతికతను వినియోగించుకుని వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదవుతున్న ప్రాంతాల్లో వడదెబ్బకు గురికాకుండా ప్రజలకు ఉపశమనం కలిగేలా మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్‌ను పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. స్వచ్ఛంధ సంస్థల సహకారాన్ని తీసుకోవాలని స్పష్టం చేశారు.

### అత్యవసర సేవలు వినా అన్నీ ఆన్‌లైన్‌లోనే..


ప్రభుత్వ శాఖలు ప్రజలకు అందించే వివిధ పౌర సేవలు మెరుగ్గా అందించేందుకు ఎప్పటికప్పుడు వినూత్న ఆలోచనలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ సేవల్లో మెరుగైన ప్రజాభిప్రాయం కోసం పబ్లిక్ కనెక్ట్ అనేది కీలకమని సీఎం స్పష్టం చేశారు. ప్రజల్లో విశ్వాసాన్ని, క్రెడిబిలిటీని పెంచేలా ప్రభుత్వ శాఖలు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రతీ ప్రభుత్వ శాఖ నిర్దేశిత ప్రమాణాలకు తగినట్టుగా పనిచేయాల్సిందేనని ముఖ్యమంత్రి సూచించారు. పంటలకు ధర విషయంలోనూ రైతులకు ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు మార్కెట్‌ను విశ్లేషించి తగిన చర్యలు చేపట్టాల్సిందిగా ఆర్టీజీఎస్ అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు తీరును పర్యవేక్షించేలా సీనియర్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. కార్యదర్శులస్థాయి అధికారులు నెలలో 3 రోజులపాటు, హెచ్ఓడీలు 6 రోజులపాటు, జిల్లా కలెక్టర్లు 8 రోజులపాటు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలతో మమేకం కావాలని నిర్దేశించారు. ప్రజాభిప్రాయ సేకరణ కోసం కాల్ సెంటర్ ద్వారా వివరాలను సేకరించాలని సీఎం సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా ఉత్తమ విధానాలు అనుసరించాలన్నారు. అధికారులు ఏ అంశంలో ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారో అక్కడ మంచి ఫలితాలు వస్తున్నాయని.. మిగిలినచోట్ల కూడా ఇదే చొరవ చూపాలన్నారు.

అత్యవసర సేవలు మినహా ప్రభుత్వ శాఖలు అందించే మిగతా అన్ని సేవల్ని ఆన్‌లైన్‌లో అందించాలని స్పష్టం చేశారు. చేపల వేట నిషేధం ముగిసిన తర్వాత అవేర్ ద్వారా వచ్చే డేటా ఆధారంగా చేపలు సమృద్ధిగా లభించే ప్రాంతాలను మత్స్యకారులకు అందజేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఈ సమీక్షకు సమాచార పౌరసంబంధాల మంత్రి కొలుసు పార్ధసారథి, సీఎస్ జి సాయిప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## మోదీపై విశ్వాసానికి ఫలితాలే నిదర్శనం: సీఎం చంద్రబాబు

అమరావతి (చైతన్య రథం): పశ్చిమబెంగాల్, అస్సాంలో ఎన్డీయే కూటమి విజయం దిశగా దూసుకెళ్తోంది. ఈ



నేపథ్యంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. ప్రధాని మోదీ నాయకత్వంపై విశ్వాసానికి ఈ ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. ఎన్డీయే మరింత బలపడిందని ఫలితాలు చాటి చెబుతున్నాయన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌కు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఎన్డీయే విజేతలు, అంకితభావం తో పనిచేసిన కార్యకర్తలకు శుభాకాంక్షలు చెప్పారు. ఈమేరకు సీఎం చంద్రబాబు ఎక్స్‌లో పోస్టు చేశారు.

## ఎన్డీయేకు మంత్రి లోకేష్ అభినందనలు

ఉండవల్లి (చైతన్య రథం) అసోం, పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాల సందర్భంగా ఎన్డీఏకు విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.



ఈమేరకు ఎక్స్‌లో పోస్టు పెడుతూ.. "ఈ ప్రజా తీర్పు.. అభివృద్ధి, స్థిరత్వం, నిర్ణయాత్మక నాయకత్వంపై ప్రజలలో పెరుగుతున్న ప్రగాఢ విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది. నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో, వేగం, విస్తృతి, సమగ్రతతో కూడిన పాలనపై దేశానికి ఉన్న విశ్వాసాన్ని తీర్పు మరింత బలపరుస్తుంది. ఇది అభివృద్ధి, అవకాశాలు, సమ్మిళిత ప్రగతిని ఆకాంక్షించే పురోగమన భారతదేశానికి లభించిన బలమైన ఆమోదం" అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

## ఓమన్‌లో చిక్కుకున్న తెలుగు మహిళకు సీఎం చంద్రబాబు భరోసా



అమరావతి (చైతన్య రథం): ఒమన్‌లో చిక్కుకున్న అన్నమయ్య జిల్లాకు చెందిన మహిళకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. ఉద్యోగం కోసం వయలపాడు గ్రామానికి చెందిన దూదేకుల షహ్నాజ్ గతేడాది నవంబర్‌లో మస్కట్ వెళ్లారు. ఉద్యోగం నచ్చక తిరిగి స్వదేశానికి రావాలనుకున్నారు. అయితే, షహ్నాజ్ ఫోన్ స్వాధీనం చేసుకొన్న ఏజెంట్లు.. ఖర్చుల పేరిట రూ.2 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమాచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తూ.. ఏపీఎస్ఆర్టీకి ఫిర్యాదు చేశారు. ఏపీ ప్రభుత్వం, ఏపీఎన్ఆర్టీ సొసైటీ వెంటనే స్పందించి ఒమన్‌లోని భారత ఎంబసీకి లేఖ రాశాయి. ఏపీ పోలీసులు కూడా జోక్యం చేసుకొని ఏజెంట్లతో చర్చలు జరిపారు. ఖర్చులు భరించి షహ్నాజ్‌ను తిరిగి ఏపీకి పంపేందుకు ఏజెంట్లు అంగీకరించారు. మే 7న ఆమె స్వదేశానికి చేరుకోనున్నట్టు సమాచారం. ఈ సందర్భంగా చంద్రబాబు స్పందిస్తూ.. వలస కార్మికుల భద్రతకు ఏపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఏపీఎస్ఆర్టీ సొసైటీ చొరవను ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు అభినందించారు.



## మంత్రి లోకేష్‌తో మంతెన మర్యాదపూర్వక భేటీ

ఉండవల్లి (చైతన్య రథం): ఏపీ యోగా, నేచురోపతి విభాగం సలహాదారు, ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణులు మంతెన సత్యనారాయణ రాజు సోమవారం ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఇటీవల కేబినెట్ హోదాలో గౌరవ సలహాదారుగా ఆయనను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దశాబ్దాలుగా ప్రకృతి వైద్యం ద్వారా మంతెన సత్యనారాయణ రాజు అందిస్తోన్న సేవలను ఈ సందర్భంగా మంత్రి లోకేష్ కొనియాడారు.

## టీవీకె విజయ్‌కి సీఎం చంద్రబాబు అభినందనలు

అమరావతి (చైతన్య రథం): తమిళనాడు శాసనసభ ఎన్నికలలో అద్భుత విజయం సాధించిన టీవీకె పార్టీ అధినేత విజయ్‌కు సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. ఈమేరకు ఎక్స్‌లో పోస్టు పెడుతూ.. "తమిళనాడు ప్రజలకు సేవ చేయడానికి, వారి పురోగతి, శ్రేయస్సుకు అర్థవంతంగా దోహదపడటానికి విజయ్ చేసే ప్రయత్నాలలో సంపూర్ణ విజయం చేకూరాలని ఆకాంక్షిస్తున్నాను" అంటూ చంద్రబాబు అభినందనలు తెలిపారు.

## టీవీకే అధినేత విజయ్‌కి మంత్రి లోకేష్ అభినందనలు



అమరావతి (చైతన్య రథం): తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఆధిక్యంలో దూసు కెళ్తోన్న టీవీకే పార్టీ అధినేత విజయ్‌కు ఏపీ మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలిపారు. రాజకీయ అరంగేట్రం లోనే అదరగొట్టారని ప్రశంసించారు. "ఈ విజయం ఓటర్ల ఆకాంక్షలను ప్రతిబింబిస్తోంది. రాజకీయ యవనికపై సరికొత్త కోణాన్ని ఆవిష్కరించింది. ప్రజా జీవితంలోకి అడుగు పెట్టి, బాధ్యత, నిబద్ధతతో ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే దిశగా అడుగులు వేయనున్న విజయ్‌కి శుభాభినందనలు" అని నారా లోకేశ్ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు.

# టీచర్లు.. సింగపూర్ బాట!

- 37మంది ఉత్తమ టీచర్లకు అంతర్జాతీయ వేదికపై శిక్షణ
- నేడు ప్రపంచ విద్యార్థులు... రేపటి తరానికి మార్గదర్శకులు
- ఆంధ్రప్రదేశ్ విద్యారంగంలో నవశకం
- గ్లోబల్ స్టాండర్డ్స్ దిశగా వేగంగా అడుగులు..




అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాఠశాల విద్యారంగంలో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు, బోధనా నాణ్యతను ప్రపంచస్థాయి ప్రమాణాలకు తీసుకెళ్లే అద్భుతమైన యజ్ఞానికి శ్రీకారం చుట్టింది. దేశ చరిత్రలోనే వినూత్న ప్రయోగంగా, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు ఇప్పుడు అంతర్జాతీయ వేదికలపై శిక్షణ పొందుతూ, గ్లోబల్ లీడర్లుగా ఎదుగుతున్నారు. దీనిలోభాగంగా, 2025లో 'రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు' పొందిన 37మందికి అంతర్జాతీయస్థాయిలో విజ్ఞానాన్ని అందించేందుకు అంతర్జాతీయ ఎక్స్‌పోజర్ విజిట్ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఈ బృహత్తర కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు, సీఎం నారా చంద్రబాబు 'ఫ్యూచర్ రెడీ' సంకల్పం, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవ ప్రశంసనీయం.

## ముఖ్యమంత్రి 'ఫ్యూచర్ రెడీ' సంకల్పం

రాష్ట్రంలోని ప్రతి విద్యార్థి ప్రపంచంలోని ఏ మూలన ఉన్న విద్యార్థితోనైనా పోటీ పడాలన్నది ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ఆకాంక్ష. దానికి పునాది పాఠశాలనుంచే పడాలని, కేవలం మౌలిక సదుపాయాలకే పరిమితం కాకుండా బోధనా నాణ్యతను పెంచేందుకు ఆయన ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

## నారా లోకేష్ ప్రత్యేక చొరవ:

## 'డిజైనింగ్ లెర్నింగ్ - ఇన్‌స్పైరింగ్ థింకింగ్'

ఈ దిశగా విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి నారా లోకేష్ ప్రతి నిర్ణయంలోనూ 'అంతర్జాతీయ ప్రమాణాల'ను జోడిస్తున్నారు. సింగపూర్‌లోని ప్రతిష్టాత్మక నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్, ఫిన్లాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ తుర్కులతో ఒప్పందాలు కుదుర్చుకోవడం వంటి గ్లోబల్ నెట్‌వర్కింగ్‌లో ఆయన కీలక పాత్ర పోషించారు. ఉపాధ్యాయులు కేవలం సమాచారాన్ని అందించే వారిగాకాకుండా, పిల్లల్లో ఆలోచనలను ప్రేరేపించే 'లెర్నింగ్ ఫెసిలిటేటర్స్'గా మారాలని లోకేష్ ఈ శిక్షణా కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

## సింగపూర్‌బాటలో 'లెర్నింగ్ ఫెసిలిటేటర్స్'

తొలుత సింగపూర్‌లోని ప్రతిష్టాత్మక నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో మే 4నుంచి 8 వరకు జరుగుతున్న 5 రోజుల శిక్షణా కార్యక్రమం ఒక మైలురాయి. "డిజైనింగ్ లెర్నింగ్, ఇన్‌స్పైరింగ్ థింకింగ్" అనే నినాదంతో సాగుతున్న పర్యటనలో 37మంది ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

## పారదర్శకతకు నిదర్శనం

బృందంలో కేవలం ఒక విభాగానికే పరిమితం కాకుండా, విద్యా వ్యవస్థలోని అన్ని స్థాయిలకు ప్రాతినిధ్యం కల్పించడం ప్రభుత్వ చిత్తశుద్ధిని చాటుతోంది. మంత్రి లోకేష్ ఆదేశాల మేరకు, రాజకీయాలకు తావులేకుండా కేవలం ప్రతిభ ఆధారంగా 10మంది హెడ్‌మాస్టర్లు,18మంది స్కూల్ అసిస్టెంట్లు, నలుగురు ప్రిన్సిపాళ్లు, ఐదుగురు ఫిజికల్ డైరెక్టర్లను విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఉన్నతాధికారులు పర్యటనకు ఎంపిక చేశారు. వీరిలో 17మంది మహిళలు ఉండటం కొసమెరుపు.

## శిక్షణలో ఇవీ...

ఎన్ఐఈలో మే 4 నుంచి 8 వరకు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటలవరకు జరిగే శిక్షణా తరగతుల్లో పాల్గొంటారు. 'అనిశ్చిత కాలంలో విద్య -ఎదుర్కొంటున్న సవాళ్లు', సింగపూర్ విద్యా విధానంపై అవగాహన, బోధనా ప్రణాళిక రూపకల్పన, యిషున్ సెకండరీ స్కూల్ సందర్శన, విశ్లేషణాత్మక ఆలోచన బోధనపై చర్చ, అధ్యాపకులకు అవసరమైన సమన్వయ నైపుణ్యాలపై అవగాహన, ఆంధ్రప్రదేశ్‌లోని తరగతి గదులను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సిద్ధం చేయడం, అర్థవంతమైన అభ్యసన రూపకల్పనవంటి కీలక అంశాలపై ప్రత్యేక శిక్షణతో ఈ కార్యక్రమం ముగుస్తుంది.

## కేవలం పాఠాలు కావు.. సరికొత్త పాఠాలు!

ఉపాధ్యాయుడు అంటే కేవలం పాఠాలు చెప్పేవాడు మాత్రమే కాదు.. విద్యార్థిలోని ఆలోచనలను తట్టిలేపే ఒక మార్గదర్శి అని నిరూపించడమే ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశం. విద్యార్థులు ప్రశ్నలు అడిగేలా, విమర్శనాత్మక దృక్పథంతో ఆలోచించేలా (క్రిటికల్ థింకింగ్) చేసే మెళకువలు, మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా పాఠ్య ప్రణాళికలను ఆకర్షణీయంగా రూపొందించడం, సింగపూర్‌లోని 'యిషున్ సెకండరీ స్కూల్'వంటి పాఠశాలలను సందర్శించి, అక్కడి తరగతి గది నిర్వహణను, డిజిటల్ బోధనా పద్ధతులను మన టీచర్లు ప్రత్యక్షంగా అధ్యయనం చేస్తున్నారు.

## ఫిన్లాండ్‌వైపు మరో అడుగు!

సింగపూర్ పర్యటనతోపాటు, విద్యా ప్రమాణాల్లో ప్రపంచానికే పాఠాలు నేర్పే ఫిన్లాండ్‌లోని 'యూనివర్సిటీ ఆఫ్ తుర్కు'కి మరో 29మంది ఉపాధ్యాయులను ప్రభుత్వం పంపేందుకు ప్రణాళిక వేస్తోంది. ఏపీ విద్యారంగం గ్లోబల్ మ్యాప్‌లో ఎంత వేగంగా దూసుకుపోతుందో అనడానికి ఇది ఒక నిదర్శనం.

## అంతర్జాతీయ మెళకువలను క్షేత్రస్థాయికి...

కేవలం పర్యటనలతోనే సరిపెట్టకుండా, ఈ ఉపాధ్యాయులు తిరిగి వచ్చాక తమ పాఠశాలల్లో 'పోస్ట్ ట్రైనింగ్ యాక్షన్ ప్లాన్' అమలు చేసేలా ప్రభుత్వం ఒక స్పష్టమైన ప్రణాళికను రూపొందించింది. వీరు రాష్ట్రంలోని ఇతర ఉపాధ్యాయులకు మెంటార్లుగా వ్యవహరిస్తూ, తాము నేర్చుకున్న అంతర్జాతీయ మెళకువలను క్షేత్రస్థాయికి చేరుస్తారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ లక్ష్యాలకు అనుగుణంగా, మన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రపంచ పౌరులుగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ తపన అభినందనీయం. ఉపాధ్యాయుల నైపుణ్యమే విద్యార్థుల భవిష్యత్తుకు పునాది అని నమ్మిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఈ శిక్షణ ద్వారా రేపటి తరానికి ఒక సువర్ణ అధ్యాయాన్ని లిఖిస్తోంది. ఉపాధ్యాయుల నైపుణ్యాన్ని మెరుగుపరచడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తును బంగారుమయం చేస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం విద్యారంగంలో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది.

## విద్యా వ్యవస్థలో గుణాత్మక మార్పునకు నాంది

"ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, విద్యా మంత్రి పర్యవేక్షణలో అత్యంత పారదర్శకంగా ఉపాధ్యాయులను ఎంపిక చేశాం. ఈ శిక్షణ కేవలం పర్యటన మాత్రమే కాదు; మన విద్యా వ్యవస్థలో గుణాత్మక మార్పునకు నాంది. సింగపూర్‌లోని 'యిషున్ సెకండరీ స్కూల్'వంటిచోట్ల వారు నేర్చుకుంటున్న 'ఇన్‌స్ట్రక్షనల్ డిజైన్', 'క్రిటికల్ థింకింగ్' మెళకువలు మన రాష్ట్రంలోని తరగతి గదులను 'ఫ్యూచర్ రెడీ'గా మారుస్తాయనడంలో సందేహం లేదు. అక్కడి నుండి తిరిగి వచ్చిన ఉపాధ్యాయులు ఇతర టీచర్లకు మెంటర్లుగా మారి, ఈ అంతర్జాతీయ జ్ఞానాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లేలా పక్కా యాక్షన్ ప్లాన్ రూపొందించాం."

**- బి శ్రీనివాసరావు,**
**సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్**




*గన్నవరం విమానాశ్రయంలో సింగపూర్ బయలుదేరిన టీచర్ల బృందం*

# చేనేత లోగిళ్లలో వెలిగిన నమ్మకం

## ఉచిత విద్యుత్‌తో నేతన్న కుటుంబాలకు కూటమి ప్రభుత్వ ఆర్థిక భరోసా

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం తర్వాత అత్యధిక కుటుంబాలకు ఉపాధి కల్పించే రంగాలలో చేనేత ఒకటి. ఇది కేవలం వృత్తి మాత్రమే కాదు, తెలుగు సంస్కృతికి ప్రతీక. తరతరాలుగా మగ్గం చప్పుళ్లతో జీవనాన్ని నెట్టుకొస్తున్న నేతన్న కుటుంబాలు ఎన్నో దశాబ్దాలుగా అనేక కష్టాలను ఎదుర్కొంటూనే ఉన్నాయి. మార్కెట్ సమస్యలు, మధ్యవర్తుల దోపిడీ, పెరుగుతున్న ముడిసరుకు ధరలు, తగ్గుతున్న ఆదాయం, విద్యుత్ భారంవంటి సమస్యలతో చేనేత రంగం క్రమంగా సంక్షోభంలోకి వెళ్లిన సందర్భాలు రాష్ట్రం చూసింది. అలాంటి పరిస్థితుల్లో నేతన్న కుటుంబాలకు ఊరటనిచ్చే నిర్ణయంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత విద్యుత్ పథకం ఇప్పుడు చేనేత లోగిళ్లలో కొత్త వెలుగులు నింపుతోంది. గత నెల ఒకటో తేదీనుంచి అమల్లోకి వచ్చిన ఈ పథకం కేవలం ఒక సంక్షేమ కార్యక్రమం మాత్రమే కాదు; చేనేత రంగాన్ని నిలబెట్టే ఆర్థిక జోక్యం కూడా. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ మగ్గం నేతన్నలకు నెలకు 200 యూనిట్లు, మరమగ్గం నేతన్నలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడం ప్రారంభించడంతో రాష్ట్రవ్యాప్తంగా వేలాది కుటుంబాలు ఉపశమనం పొందుతున్నాయి. విద్యుత్ బిల్లులు సున్నా చార్జీలతో ఇంటికి చేరుతుండటంతో నేతన్నల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. నెలాఖరులో విద్యుత్ బిల్లు ఎలా చెల్లించాలన్న ఆందోళన నుంచి బయటపడటం వారికి నిజమైన ఆర్థిక భరోసా కలిగిస్తోంది.

### మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

రాజకీయాల్లో హామీలు మామూలే. కానీ వాటిని సమయానికి అమలు చేయడం అరుదు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ సరైన సమయంలో అమలు నిర్ణయం నేతన్నలలో విశ్వాసాన్ని పెంచింది. అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత రంగాన్ని కేవలం ఎన్నికల హామీల కోణంలో కాకుండా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక భాగంగా ప్రభుత్వం పరిగణిస్తున్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో ఇప్పటికే 50,252 మగ్గం నేతన్నల కుటుంబాలు, 6,995 మరమగ్గం కుటుంబాలు ఈ పథకం కింద అర్హులుగా గుర్తించారు. ఇంకా అర్హులైన వారందరికీ పథకం వర్తించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. చేనేత శాఖ, విద్యుత్ శాఖ సమన్వయంతో ఈ కార్యక్రమం అమలవుతుండటం గమనార్హం. ప్రభుత్వ పథకాలు ప్రకటించడం ఒక దశ అయితే, వాటిని గ్రామస్థాయిలో విజయవంతంగా అమలు చేయడం మరో దశ. ఈ విషయంలో యంత్రాంగం సమర్థంగా పని చేయడంవల్లే నేతన్న కుటుంబాలకు నిజమైన లబ్ధి అందుతోంది.

### జీరో బిల్లులో కనిపించిన ఉపశమనం

చేనేత కార్మికుడి ఆదాయం స్థిరంగా ఉండదు. మగ్గం నడిస్తేనే ఆదాయం ఉంటుంది. మార్కెట్ మందగిస్తే పనిలేక రోజులు గడిచిపోతాయి. అలాంటి కుటుంబాల్లో ప్రతి నెల విద్యుత్ బిల్లు ఒక అదనపు భారం. ముఖ్యంగా మరమగ్గాలపై పనిచేసే కుటుంబాలకు విద్యుత్ ఖర్చు మరింత ఎక్కువ. ఇప్పుడు ఆ భారాన్ని ప్రభుత్వం తీసుకోవడంతో నేతన్నల ఆర్థిక స్థితిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది.

మగ్గం నేతన్నలకు నెలకు సుమారు రూ.720 వరకు, సంవత్సరానికి రూ.8,640 వరకు ఆదా అవుతుండగా, మరమగ్గం కుటుంబాలకు నెలకు రూ.1,800 వరకు, ఏడాదికి రూ.21,600 వరకు ప్రయోజనం కలుగుతోంది. గ్రామీణ ఆర్థిక పరిస్థితుల్లో ఇది చిన్న మొత్తం కాదు. ఈ డబ్బుతో పిల్లల చదువులు, ఆరోగ్య ఖర్చులు, నూలు కొనుగోలు లేదా కుటుంబ అవసరాలను తీర్చుకునే అవకాశం నేతన్నలకు లభిస్తోంది. విద్యుత్ బిల్లు జీరోగా రావడం నేతన్నలలో కేవలం ఆర్థిక ఉపశమనం మాత్రమే కాదు, ప్రభుత్వం తమ గురించి ఆలోచిస్తోందన్న మానసిక భరోసా కూడా. చాలా గ్రామాల్లో నేతన్నలు ట్రాన్స్‌కో సిబ్బందికి కృతజ్ఞతలు తెలుపుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. “ఇంతకాలం మేము బిల్లు కోసం ఎదురుచూశాం... ఇప్పుడు జీరో బిల్లు కోసం ఎదురుచూస్తున్నాం” అని పలువురు నేతన్నలు చెప్పడం పథకం ప్రభావాన్ని ప్రతిబింబిస్తోంది.




### చేనేతకు పూర్వవైభవం తీసుకురావాలన్న లక్ష్యం

చేనేత రంగం సమస్య కేవలం విద్యుత్ ఖర్చుతో ముగిసేది కాదు. మార్కెటింగ్, ముడిసరుకు, ఆధునికీకరణ, ఉపాధి నిరంతరతవంటి అనేక అంశాలు దీనికి సంబంధించినవే. అందుకే కూటమి ప్రభుత్వం బహుముఖ దృష్టితో ముందుకు సాగుతోంది.

ఉచిత విద్యుత్‌తోపాటు నూలుపై 15 శాతం సబ్సిడీ, త్రిఫ్ట్ ఫండ్‌కు ఏటా నిధుల కేటాయింపు, 50 ఏళ్లు దాటిన నేతన్నలకు రూ.4 వేల పెన్షన్, ముద్ర రుణాల ద్వారా ఆర్థిక సహాయంవంటి చర్యలు చేనేత కుటుంబాలకు మద్దతుగా నిలుస్తున్నాయి.

ఇప్పటికే 2,640 మంది చేనేత కార్మికులకు ముద్ర పథకం కింద రూ.24.43 కోట్ల రుణాలు అందించడం ద్వారా చిన్న స్థాయి నేతన్నలకు ఆర్థిక ఊతం కల్పించారు. మరోవైపు 90శాతం సబ్సిడీతో ఆధునిక పరికరాల పంపిణీ కూడా ఉత్పాదకత పెంచే దిశగా కీలక చర్యగా మారింది.

### మార్కెట్ లేకుంటే మగ్గం ఆగిపోతుంది

చేనేత రంగానికి అతిపెద్ద సమస్య మార్కెట్. ఎంత నాణ్యమైన వస్త్రం నేసినా అమ్ముడుపోకపోతే నేతన్నకు ప్రయోజనం ఉండదు. గతంలో చాలామంది నేతన్నలు ఇదే కారణంగా వృత్తిని వదిలేయాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మార్కెటింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టడం చేనేత రంగానికి కొత్త ఆశలు కలిగిస్తోంది. ఆప్కో ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శనలు నిర్వహించడం, చేనేత ఉత్పత్తులను ఆన్‌లైన్ ద్వారా వినియోగదారుల ఇళ్లకే డోర్ డెలివరీ చేయడంవంటి చర్యలు మార్కెట్ విస్తరణకు దోహదపడుతున్నాయి. ప్రస్తుతం డిజిటల్ మార్కెటింగ్ యుగంలో చేనేత ఉత్పత్తులను ఈ-కామర్స్‌కు అనుసంధానం చేయడం అత్యవసరం. ఈ దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు భవిష్యత్తులో మంచి ఫలితాలు ఇవ్వగలవు. అదేవిధంగా మెగా టెక్స్‌టైల్స్ పార్కులు, చేనేత క్లస్టర్లు ఏర్పాటు చేయాలన్న ప్రణాళిక కూడా ఉపాధి అవకాశాలను పెంచే అవకాశం ఉంది. ఒకవైపు సంప్రదాయ చేనేతను కాపాడుతూనే, మరోవైపు ఆధునిక మార్కెట్ అవసరాలకు అనుగుణంగా రంగాన్ని తీర్చిదిద్దాలన్న ప్రయత్నం కనిపిస్తోంది.

### ఎన్టీఆర్ ఆలోచనలనుంచి చంద్రబాబు దిశగా

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి చేనేత రంగానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉన్నదనే అంశాన్ని నేతన్నలు తరచూ గుర్తుచేసుకుంటారు. “సగం ధరకే చీర, దోవతి” వంటి పథకాలతో దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చేనేత రంగానికి కొత్త ఊపు తీసుకొచ్చారు. ఇప్పుడు అదే భావజాలాన్ని కొనసాగిస్తూ సీఎం చంద్రబాబు నేతన్నలకు ఆర్థిక భరోసా కల్పించే కార్యక్రమాలను అమలు చేస్తున్నారనే అభిప్రాయం చేనేత వర్గాల్లో వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల్లో ఒక స్పష్టమైన ఆలోచన కనిపిస్తోంది. కేవలం సబ్సిడీలు ఇవ్వడం కాకుండా, చేనేత కుటుంబం ఏడాది పొడవునా ఉపాధితో నిలదొక్కుకునేలా చేయాలన్న లక్ష్యంతో అడుగులు వేస్తోంది. “నేతన్నలకు 365 రోజులూ ఉపాధి” అనే లక్ష్యాన్ని ప్రభుత్వం ప్రకటించడం కూడా అందుకే.

### గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊపిరి

చేనేత రంగం బలపడటం అంటే కేవలం ఒక వృత్తి నిలబడటమే కాదు. దానికి అనుబంధంగా ఉన్న నూలు వ్యాపారులు, రంగుపనివారు, డిజైన్ కార్మికులు, చిన్న వ్యాపారులువంటి అనేక వర్గాలకు ఉపాధి లభిస్తుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో చేనేత ఒక ముఖ్యమైన చక్రం. ఆ చక్రం తిరిగితే గ్రామాల్లో కొనుగోలు శక్తి పెరుగుతుంది. ఉపాధి నిలుస్తుంది. వలసలు తగ్గుతాయి. ఈ కోణంలో చూస్తే ఉచిత విద్యుత్ పథకం సామాజిక, ఆర్థికపరంగా పెద్ద ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది. చేనేత కుటుంబాలపై పడుతున్న నెలవారీ భారం తగ్గడంవల్ల వారు మళ్లీ మగ్గంవైపు ఆకర్షితులయ్యే పరిస్థితి ఏర్పడుతోంది.

### సంక్షేమం నుంచి సాధికారత వైపు

సంక్షేమ పథకాలపై తరచూ విమర్శలు వస్తుంటాయి. కానీ ఉత్పాదక రంగాలకు మద్దతిచ్చే సంక్షేమం మాత్రం పెట్టుబడిగా మారుతుంది. చేనేత రంగానికి ఉచిత విద్యుత్ కూడా అలాంటి పెట్టుబడిగానే కనిపిస్తోంది. ఇది కేవలం బిల్లులు మాఫీ చేయడం కాదు; గ్రామీణ ఉపాధిని కాపాడే ప్రయత్నం. సంప్రదాయ వృత్తిని నిలబెట్టే బాధ్యత. చేనేత కుటుంబాల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచే చర్య. ప్రస్తుతం నేతన్నల ఇళ్లలో వెలుగుతున్న ఉచిత విద్యుత్ బల్బులు కేవలం కాంతినే ఇవ్వడం లేదు. ప్రభుత్వంపై పెరిగిన నమ్మకాన్ని, మగ్గం మళ్లీ మోగుతుందన్న ఆశను, చేనేత కుటుంబాల్లో పుట్టుకొస్తున్న భరోసాను కూడా ప్రతిబింబిస్తున్నాయి.

- జమ్ము సాయి కల్యాణ్,
అనలిస్టు, తెలుగుదేశం పార్టీ నాలెడ్జ్ సెంటర్

# చంద్రబాబు విజన్‌తో సాంకేతికత ఆధారిత ఆదాయ విప్లవం

## గతానికి చెక్ -కొత్త ఆంధ్రప్రదేశ్‌కు కొత్త దశ

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం కనిపిస్తున్న మార్పులు యాదృచ్ఛికం కావు. అవి స్పష్టమైన నాయకత్వం, ప్రణాళికాబద్ధమైన విధానాలు, సాంకేతికత ఆధారిత పరిపాలన ఫలితాలు. ఏప్రిల్ 2026లో వాణిజ్య పన్నుల శాఖ రూ.5,542.70 కోట్ల వసూళ్లు నమోదు చేయడం పెద్ద మైలురాయి. గత ఏడాదితో పోలిస్తే రూ.598.78 కోట్లు (12.08శాతం) అధిక వృద్ధి సాధించడం మార్పుస్థాయిని సూచిస్తోంది. గత ప్రభుత్వ కాలంలో పన్నుల వసూళ్లలో స్థిరత్వం లోపించడం, ఎగవేతపై నియంత్రణ సడలించడం, వ్యవస్థల మధ్య అనుసంధానం లేకపోవడంవంటి సమస్యలు స్పష్టంగా కనిపించాయి. పన్ను చెల్లింపుదారులపై పూర్తి సమాచారం లేకపోవడంవల్ల ఆదాయంలో పెద్దఎత్తున లీకేజీలు జరిగాయి. విధానాలు ఉన్నప్పటికీ, అమలులో లోపాలు కారణంగా ఆశించిన ఫలితాలు రాలేదు. ఇదే సమయంలో చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పరిస్థితిని పూర్తిగా మార్చింది. జీఎస్టీ అమలుతో సుమారు రూ.8,000 కోట్ల లోటు వస్తుందని అంచనాలు ఉన్నప్పటికీ, ఆ లోటును భర్తీ చేయడమే కాకుండా కొత్త వృద్ధి మార్గాలను సృష్టించడం సాధ్యమైంది. పెట్రోలియం వ్యాట్‌లో 26.72శాతం వృద్ధి, నిర్మాణ మరియు రియల్ ఎస్టేట్ రంగాలకు ఇచ్చిన ఊతం ద్వారా ఆదాయ వనరులు విస్తరించాయి.

### డేటా ఆధారిత పాలన - చంద్రబాబు శైలి

చంద్రబాబు పాలనలో ప్రధాన బలం సాంకేతికత వినియోగం. జీఎస్టీ, ఐటీఆర్, కస్టమ్స్, బ్యాంకింగ్‌వంటి విభిన్న డేటాను అనుసంధానం చేసి ప్రతి పన్ను చెల్లింపుదారునిపై సమగ్ర అవగాహన తీసుకురావడం జరిగింది. “360–డిగ్రీ ప్రొఫైల్” విధానం ద్వారా ఎగవేతకు తావులేకుండా చేశారు. కృత్రిమ మేధ వినియోగంతో జీఎస్టీఆర్–1, జీఎస్టీఆర్–3బీ మధ్య వ్యత్యాసాలను తక్షణం గుర్తించడంవల్ల అనర్హమైన క్లెయిమ్‌లు అడ్డుపడుతున్నాయి. మాన్యువల్ తనిఖీలు 70శాతం తగ్గడం, యూపీఐ లావాదేవీల విశ్లేషణ ద్వారా 20,391 హైవాల్యూ పాన్ కార్డులను పన్ను పరిధిలోకి తీసుకురావడం వంటి చర్యలు ఈ ప్రభుత్వ దృఢ సంకల్పాన్ని చూపిస్తున్నాయి.

### గతం: అనిశ్చితి- వర్తమానం: స్పష్టత

గతంలోనూ విధానాలున్నా, అమలు బలహీనంగా ఉండేది. ప్రస్తుతం మాత్రం వ్యవస్థలు బలంగా ఉన్నాయి. పర్యవేక్షణ కచ్చితంగా ఉంది. గతంలో ఆదాయం అంచనాలకు పరిమితమైతే, ఇప్పుడు ఆదాయ లక్ష్యాలను మించిపోతోంది. ఇదే అసలు తేడా.

### భవిష్యత్తు దిశ- మరింత దృఢంగా

2026–27లో వృత్తి పన్నుల్లో రూ.751 కోట్లు లక్ష్యంగా పెట్టుకుని (45శాతం వృద్ధి) ముందుకు సాగుతున్న ప్రభుత్వం, పూర్తి ఆటోమేషన్ మరియు దూర తనిఖీ విధానాలతో మరింత పారదర్శకతను తీసుకువస్తోంది. ఇది కేవలం తాత్కాలిక వృద్ధి కాదు.. దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వానికి బలమైన పునాది. మొత్తానికి ఈ ఆర్థిక గణాంకాలు ఏం చెబుతున్నాయంటే.. సరైన నాయకత్వముంటే వ్యవస్థలు మారుతాయి. వ్యవస్థలు మారితే ఫలితాలు వస్తాయి. చంద్రబాబు విజన్‌తో ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు ఆర్థికంగా కొత్త దశలోకి ప్రవేశించింది. కాబట్టి గతంలోని లోపాలనుదాటి, భవిష్యత్తుకు దారిచూపే ఈ మార్గం రాష్ట్రానికి నిజమైన ఆశాకిరణమని చెప్పొచ్చు.

- శాంతి జలసూత్రం,
అనలిస్ట్, తెలుగుదేశం పార్టీ నాలెడ్జ్ సెంటర్

# లోకేష్ విద్యా సంస్కరణల విజయ దుందుభి




ఏ దేశ భవిష్యత్ అయినా ఆ దేశ తరగతి గదుల్లోనే నిర్మించ బడుతుందన్న కొఠారియా కమిషన్ అన్న మాటకు నిలువెత్తు రూపంగా నేడు ఆంధ్రప్రదేశ్ విద్యా వ్యవస్థ నిలిచింది. కేవలం అక్షరాస్యతను పెంచడమే కాకుండా, విద్యార్థులను ప్రపంచస్థాయి సవాళ్లను ఎదుర్కొనేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా విద్యా మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారు. సంప్రదాయ బోధనా పద్ధతులకు స్వస్తి పలికి.. సాంకేతికతను జోడించి మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా సాగిన ఈ ప్రస్థానం ఏపీ విద్యారంగంలో సరికొత్త విజయ దుందుభి మోగించింది. ప్రభుత్వ పాఠశాలలను, ప్రయివేట్ పాఠశాలలకు ప్రత్యామ్నాయంగా మార్చాలని, విద్యలో నాణ్యత పెంచాలని లక్ష్యంగా పెట్టుకొని లోకేష్ చేపట్టిన మార్పులు రాష్ట్ర విద్యారంగాన్ని దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిపాయి. ఆయన సంస్కరణల ప్రభావం 2026 పదవ తరగతి ఫలితాల్లో స్పష్టంగా కనిపించింది. ఉత్తీర్ణతా శాతాన్ని పెంచడమే కాకుండా, విద్యార్థుల్లో నైపుణ్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం ద్వారా ఏపీ విద్యాశాఖ సరికొత్త రికార్డులు నెలకొల్పింది. అత్యుత్తమ ఫలితాలకు దోహదపడిన కీలక సంస్కరణలు ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చాయి. ఏపీ ప్రభుత్వం విద్యారంగంలో తీసుకొచ్చిన ఈ మార్పులు కేవలం తాత్కాలిక విజయాలు కావు. ఇవి రాబోయే తరాల ఉజ్వల భవిష్యత్‌కు బలమైన పునాదులని చెప్పాలి. ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటడం వెనుక ప్రభుత్వ పట్టుదల, ఉపాధ్యాయుల కృషి ఉంది. 2022లో అత్యంత కనిష్టస్థాయి 67.26 శాతానికి పడిపోయిన పరిస్థితి నుంచి కేవలం నాలుగేళ్లలో 85.25 శాతానికి పైగా ఫలితాలు సాధించడం గమనార్హం. గతంలో ప్రయివేట్ పాఠశాలల ఫలితాల హవా ఎక్కువగా ఉండేది. కానీ 2025–2026 ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూళ్లు దాదాపు 85శాతంపైగా ఉత్తీర్ణత సాధించి ప్రయివేట్ సంస్థలతో పోటీ పడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా 2,161 ప్రభుత్వ పాఠశాలలు 100శాతం ఉత్తీర్ణత సాధించడం ఒక రికార్డు. ప్రభుత్వ పాఠశాలలు సాధించిన ఫలితాల వెనుక కేవలం అంకెలు మాత్రమే కాదు.. పక్కా ప్రణాళిక, అధునాతన సాంకేతికత, విద్యార్థుల భవిష్యత్తుపట్ల దృఢ సంకల్పం దాగి ఉంది.

### 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక!

టెన్త్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థుల ఫొటోలతో పత్రికలలో మొదటి పేజీలో విద్యా శాఖ గర్వంగా యాడ్స్ ఇవ్వడం రాష్ట్ర చరిత్రలో మొదటిసారి. ఈ అద్భుత ఫలితాలకు ప్రధాన కారణం ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక. డిసెంబరు 6, 2025 నుంచి మార్చి 15, 2026 వరకు ప్రతి రోజూ ఒక లక్ష్యంమేరకు 7,000కు పైగా పాఠశాలల్లోని దాదాపు 3.77 లక్షలమంది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. కేవలం పరీక్షలు రాసి వదిలేయకుండా ఏకంగా 46 స్లిప్ టెస్టులద్వారా ప్రతి సబ్జెక్టులో విద్యార్థి పట్టును పరీక్షించారు. విద్యార్థులందరినీ ఒకే కోణంలో చూడకుండా వారి అభ్యాస సామర్థ్యాన్ని బట్టి షైనింగ్ స్టార్స్, రైజింగ్ స్టార్స్‌గా వర్గీకరించడం సంస్కరణల్లోనే అత్యంత కీలకమైన అంశం. ఏ, బీ గ్రేడ్లు సాధించే విద్యార్థులకు మరింత సృజనాత్మకమైన ప్రశ్నలతో శిక్షణనిచ్చి, వారు 10–10 జీపీఏ సాధించేలా ప్రోత్సహించారు. సీ, డీ గ్రేడ్లలో ఉన్న విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. వారికి క్లిష్టమైన అంశాలను సులభతరంగా బోధించడం, రెమెడియల్ క్లాసులు నిర్వహించడం ద్వారా వారిని ఉత్తీర్ణత దిశగా విజయవంతంగా నడిపించారు. ఈ విధానంవల్ల ప్రభుత్వ పాఠశాలల్లో గతంలో ఎన్నడూ లేనివిధంగా అత్యధిక ఉత్తీర్ణత శాతం నమొదైంది.

### ప్రపంచంలోనే అతి పెద్ద తల్లిదండ్రుల సమావేశం!

పాఠశాలల పనితీరు, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల అభ్యాస పురోగతి, తల్లిదండ్రులతో సమావేశాలు, ప్రతి స్కూల్ వివరాలను డిజిటల్ డాష్‌బోర్డ్‌లో నమోదు చేసి సమీక్షలు చేశారు. విద్యార్థుల పురోగతిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం కీలకమని భావించి, ప్రతి ప్రభుత్వ పాఠశాలలో పేరెంట్–టీచర్ మీటింగ్స్ తప్పనిసరి చేశారు విద్యా మంత్రి లోకేష్. ప్రభుత్వ పాఠశాల అంటేనే నాణ్యత అన్న నమ్మకాన్ని ప్రతిష్టించాలన్న లక్ష్యంతో నూతన అధ్యాయానికి నాంది పలికింది ప్రభుత్వం. తల్లిదండ్రుల మద్దతు లేకుండా విద్యార్థుల అభివృద్ధి సాధ్యంకాదని, అందుకే పీటీఎంలను సజావుగా నిర్వహించి, తల్లిదండ్రులను విద్యావ్యవస్థలో భాగస్వాములను చేశారు. వారి అభిప్రాయాల ఆధారంగా పాఠశాలల్లో మార్పులు తీసుకువచ్చి, పిల్లలు పాఠశాలలో చదువుతోపాటు తల్లిదండ్రుల సహకారంతో మెరుగైన విద్యార్థులుగా ఎదగాలన్న దృఢసంకల్పంతో తల్లిదండ్రులతో సమాలోచన నిర్వహించడం చరిత్రాత్మక ముందడుగు. ప్రపంచంలోనే అతి పెద్ద తల్లిదండ్రుల సమావేశం 2025 జూన్‌లో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన 2.0 కార్యక్రమంలో దాదాపు 2.3 కోట్లమంది తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఆంధ్రప్రదేశ్ గర్వంగా గిన్నిస్ ప్రపంచ రికార్డు సృష్టించింది. ఇది ఒక కొత్తతరం విద్యా అభివృద్ధికి తల్లిదండ్రుల భాగస్వామ్య సంకేతం. ప్రతి విద్యార్థి అభ్యాసస్థాయిని, ప్రగతిని తల్లిదండ్రులు ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి వేదికైంది. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకాన్ని కలిగి ఉండేలా చేయడం, తల్లిదండ్రులను పాలనలో భాగస్వాములుగా మార్చడం, పాఠశాలల్లో మెరుగుదల కోసం ప్రత్యక్ష పరస్పర సమాచారం ద్వారా ప్రభుత్వం పబ్లిక్ స్కూళ్లపై విశ్వాసాన్ని పెంచడానికి ఇది ఒక వేదికగా మారింది.

### ఏపీ విద్యారంగం పునరుత్తేజానికి మార్గదర్శి లోకేష్

అంతే కాదు పాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థికి పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందించడం ద్వారా వారిలో శారీరక శక్తిని, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించారు. దీంతోపాటు ఉచితంగా అందించిన యూనిఫాంలు, నాణ్యమైన పాఠ్యపుస్తకాలు, అభ్యాస సామగ్రి విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారాన్ని తగ్గించాయి. ముఖ్యంగా డ్రాపౌట్స్‌ను అరికట్టేందుకు ప్రభుత్వం నేరుగా కుటుంబాలకు అందించిన ఆర్థిక సాయం, గ్రామీణ ప్రాంతాల్లో 100 శాతం హాజరు నమోదయ్యేలా చేసింది. ఈ సమగ్ర వ్యూహం కారణంగా ప్రభుత్వ పాఠశాలలు కేవలం ఉత్తీర్ణతలోనే కాకుండా క్వాలిటీ మార్కులలో కూడా ప్రయివేట్ విద్యా సంస్థలను అధిగమించాయి. ఉపాధ్యాయుల నిరంతర శ్రమ, ప్రభుత్వ పర్యవేక్షణ, సాంకేతికత మేళవింపుతో ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ ఒక నూతన ఒరవడి సృష్టించింది. ఈ ఫలితాలు కేవలం ఒక్క విద్యా సంవత్సరపు విజయం మాత్రమే కాదు. రాబోయేతరాల ఉజ్వల భవిష్యత్‌కు బలమైన పునాదిగా నిలవాలి. ఏపీ విద్యారంగం పునరుత్తేజానికి విద్యా మంత్రి లోకేష్ మార్గదర్శిగా నిలుస్తున్నారు. ఆయన నాయకత్వంలో అమలు జరుగుతున్న విద్యా సంస్కరణలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, ప్రతి ప్రభుత్వ పాఠశాలలోనూ స్పష్టమైన మార్పును చూపుతున్నాయి. రాబోయే రోజుల్లో ఏపీ విద్యార్థులు గ్లోబల్ లీడర్లుగా ఎదగడమే లక్ష్యంగా సాగుతున్న ఈ ప్రయాణం రాష్ట్ర విద్యా చరిత్రలో స్వర్ణయుగంగా నిలిచిపోనున్నది. నిబద్ధతతో కూడిన నాయకత్వం, స్పష్టమైన విజన్‌తో సాగుతున్న విద్యామంత్రి లోకేష్ విద్యాయజ్ఞం రేపటితరం బంగారు భవిష్యత్‌కు భరోసానిస్తూ విజయవంతంగా ముందుకు సాగాలని విద్యావేత్తలు ఆకాంక్షిస్తున్నారు.

- నీరుకొండ ప్రసాద్

చైతన్యరథం

# టీడీపీతోనే కురుబలకు రాజకీయ ప్రాధాన్యం

- స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సీట్ల కేటాయింపు
- దేవస్థాన పాలక మండళ్లలో సభ్యులుగా అవకాశం
- త్వరలో గుడికట్ల పూజారులకు గౌరవ వేతనాలు
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- కుప్పం కోడెల్ల రాయస్వామి ఉత్సవానికి హాజరు



కుప్పం/చిత్తూరు (చైతన్యరథం): టీడీపీతోనే కురుబలకు రాజకీయ ప్రాధాన్యం లభిస్తోందని మంత్రి ఎస్.సవిత తెలిపారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు పలు దేవస్థాన బోర్డు సభ్యులగానూ కురుబలకు అవకాశమివ్వనున్నట్లు తెలిపారు. చిత్తూరు జిల్లా కుప్పం మండలం కేంద్రంలో జరుగుతున్న కోడెళ్ల రాయస్వామి ఉత్సవంలో మంత్రి పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ కోడెళ్ల రాయస్వామి ఉత్సవంలో పాల్గొనడం తన అదృష్టమన్నారు. గతేడాది జరిగిన ఉత్సవాల్లో సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పాల్గొన్న విషయాన్ని ఆమె గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు నిధులు మంజూరు చేసి ఆలయ అభివృద్ధితో పాటు మౌలిక సదుపాయలు కల్పించారని తెలిపారు. కురుబల తరపున సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కురుబల అధికంగా ఉన్న చోట్ల టీడీపీ తరపున ఎన్నికల బరిలో దింపనున్నట్లు తెలిపారు. పలు దేవస్థాన బోర్డుల్లోనూ కురుబలకు సభ్యులుగా అవకాశమివ్వను న్నట్లు సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారని వివరించారు. గుడికట్ల పూజారులకు త్వరలోనే గౌరవ వేతనాలు అందించనున్నట్లు చెప్పారు. గుడి కట్ల దేవాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటు న్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సవిత వెంట ఎమ్మెల్సీ శ్రీకాంత్, కురబ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున. ఇతర కురుబ సామాజిక ప్రతినిధులు, వర్గీయులు అదిక సంఖ్యలో ఉన్నారు.



## అత్యంత ప్రతిష్టాత్మకంగా మహానాడు

- నెల్లూరు ఇఫ్కో సెజ్‌లో నిర్వహిస్తున్నాం
- రేపటి నుంచే ఆ ప్రాంతంలో పనులు
- పురపాలక మంత్రి పొంగూరు నారాయణ

*నెల్లూరు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ ప్రతి ఏడాది నిర్వ హించే మహానాడును ఈ సారి నెల్లూరు జిల్లాలో నిర్వహిస్తున్నా మని ఏపీ మంత్రి నారాయణ తెలిపారు. మహానాడును అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతున్నామని పేర్కొన్నారు. నెల్లూరు జిల్లాలో మంత్రి నారాయణ పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొ న్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మహానాడును ఇఫ్కో సెజ్‌లో నిర్వహించాలని నిర్ణయించామని చెప్పుకొచ్చారు. అక్కడ రెండు వేల ఎకరాల భూములు అందుబాటులో ఉన్నాయని తెలి పారు. ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయిస్తున్నామని.. ఈ నెల 6వ తేదీ న పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. రాష్ట్రం, ప్రజల భవిష్య త్తుకు సంబంధించి కీలక నిర్ణయాలను మహానాడులో తీసుకుం టామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది మహానాడుకు రానున్నారని చెప్పు కొచ్చారు. ట్రాఫిక్, ఇతర సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు.*

# బనగానపల్లిలో షైనింగ్ స్టార్స్

- పాల్గొన్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన



బనగానపల్లి(చైతన్యరథం): మంత్రి క్యాంప్ కార్యాలయంలో 10వ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అభినందన కార్యక్రమం జరిగింది. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఇందిరారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్ర మంలో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరి చిన విద్యార్థులకు ఒక్కొక్కరికి మంత్రి సొంత నిధులతో రూ.10 వేల నగదు పురస్కారం, మెమెంటో, సర్టిఫికెట్లను అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం విద్యార్థులతో నిర్వహిం చిన ముఖాముఖి కార్యక్రమంలో వారు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. విద్యాశాఖ మంత్రిగా లోకేష్ విద్యా రంగంలో ఎన్నో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. '100 రోజుల విద్యా ప్రణాళిక' పదో తరగతి ఫలితాల్లో అద్భుత మార్పుకు కారణం. గత ఏడాది 81.1% గా ఉన్న ఉత్తీ ర్ణత, ఈ ప్రణాళిక అమలుతో ఈ ఏడాది 85.25% కి పెరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత 72.8% నుంచి 78.39%కి పెరిగి, ప్రైవేటు పాఠశాలలతో ఉన్న అంతరం తగ్గిందని తెలిపారు. వెనుకబడిన విద్యార్థుల కోసం పరీక్షలకు ముందు 30 రోజుల ప్రత్యేక రెసిడె న్షియల్ శిక్షణ ఇచ్చి పరీక్షల భయం పోగొట్టేందుకు పలుమార్లు గ్రాండ్ టెస్టులు, ప్రీ-ఫైనల్ పరీక్షలను నిర్వహించి పర్యవేక్షించినట్లు తెలిపారు.

# అమర్నాథ్, ఎంపీపీ అనుచరుల భూదందా

- డీ-పట్టా భూమిపై వైసీపీ నేతల కన్ను
- ఆ పార్టీ నాయకుడు నాగేశ్వరరావు భూదాహం
- అక్రమంగా చొరబడి వారసత్వ భూమి ఆక్రమణ
- దివ్యాంగురాలైన కుమార్తె పెన్షన్‌ను ఆపేయించారు
- ప్రజావినతుల కార్యక్రమంలో బాధితుడి ఫిర్యాదు
- అర్జీలు స్వీకరించిన మంత్రి కొల్లు రవీంద్ర, ఆలపాటి



మంగళగిరి (చైతన్యరథం): వైసీపీ నేతల భూదందాపై టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ప్రజావినతుల్లో బాధితుడు గోడు వెళ్లబోసుకున్నాడు. అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం నీలకంఠపురం గ్రామానికి చెందిన రామకృష్ణంరాజు సమ స్యను వివరిస్తూ 1983 నుంచి టీడీపీ కార్యకర్తను. ఆ కక్షతో గత ప్రభుత్వం రీ-సర్వే సమయంలో ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా రికార్డులు లేకుండా తనకు చెందిన 15.80 సెంట్ల భూమిని అనకాపల్లి ఎంపీపీ గొర్రెల సూరిబాబు, మాజీ మంత్రి అమర్నాథ్ అనుచరులు ఆక్రమించుకున్నారని ఫిర్యాదు చేశాడు. ఎంపీపీ గొర్రెల సూరిబాబు తన బంధువైన సర్వేయర్ మోహన్ రావును, సచివాలయ సర్వేయర్లను, వీఆర్వోను భయపెట్టి అధికార బలంతో ఈ దురాగతానికి పాల్పడ్డారని వివరించారు. తన కుమార్తె దివ్యాంగురాలు అని కూడా చూడకుండా ఆమెకు వచ్చే ప్రభుత్వ పింఛన్‌ను కూడా నిలిపివేయించి కక్షసాధింపు చర్యల కు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశాడు. వారిపై చర్యలు తీసుకు ని తమ సమస్యను పరిష్కరించాలని ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లకు అర్జీ ఇచ్చి అభ్యర్థించాడు.

### భూకబ్జాలపైనే ఎక్కువగా ఫిర్యాదులు

విజయనగరం జిల్లా గుర్ల మండలం కెల్లి గ్రామానికి చెందిన రాజారావు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ సర్వే నంబర్ 140.3లో ప్రభుత్వం 1.24 ఎకరాల (డి-పట్టా) భూమిని స్థానిక వైకాపా నేత శ్రీను, రేకపేట సర్పంచ్ మద్దతుతో రామకృష్ణ, బంగారి ఆక్రమించుకున్నారు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

తిరుపతి జిల్లా వాకాడు మండలం రాజ్యలక్ష్మీపురం గ్రామానికి చెందిన రామయ్య గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ తమకు సర్వే నంబర్లు 1442-2, 838-1, 834-3లో ప్లాట్ నెంబర్ 11 (27 అంకణాలు)లో ఇల్లు, స్థలం ఉంది. స్థానిక వైసీపీ నాయకుడు యర్రమత్తి నాగేశ్వరరావు, అతని కుమారులు దౌర్జన్యంగా ఆ స్థలాన్ని కబ్జా చేశారని ఫిర్యాదు చేశారు. వారిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరాడు.

తిరుపతి జిల్లా వాకాడు మండలం రాజ్యలక్ష్మీపురం గ్రామానికి చెందిన రమణయ్య, శోభన్‌బాబు, పొలమ్మ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ తమ గ్రామంలో సుమారు 130 దళిత కుటుం బాలు గత 30 ఏళ్లుగా నివసిస్తున్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం తమ గ్రామ విస్తీర్ణంలోని సర్వే నెంబర్ 1లో ఉన్న 10.15 ఎకరాల భూమిని తమ నివాసాల కోసం కేటాయించగా ఇళ్లు నిర్మించుకుని ఉంటున్నాం. వాకాటి మురళీరెడ్డి, వాకాటి లక్ష్మమ్మ అనే వ్యక్తులు స్థానిక వైసీపీ నాయకుల అండతో అక్రమంగా ఈ భూమికి దొంగ పాస్ పుస్తకాలు సృష్టించి అక్రమ రిజిస్ట్రేషన్లు/పాస్ పుస్తకాల ప్రక్రియ నిర్వహించారు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

సత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామానికి చెందిన నాగరాజు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ తమ గ్రామంలో 94.00 ఎకరాల భూమి ఉంది. తమ గ్రామానికి చెందిన వెంకటేసు, కిరణ్, నరసింహమూర్తి, శేఖర్, కుళ్ళాయప్ప, సత్యం, సల్లప్ప, నాగరాజు, గోపాలు, నరసింహులు, రాజ, సూరి, పోతులయ్య, చిన్న నరసింహులు, తలారి అక్కమ్మ అనే వ్యక్తులు భూమిని ఆక్రమించుకుని తనను గెంటివేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

### ఫోర్జరీతో దొంగ పాస్ పుస్తకాలు

పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం ఎమ్మాజిగూడెం గ్రామాని కి చెందిన వెంకటేశ్వర్లు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామ పరిధిలో 14 ఎకరాల భూమి ఉంది. అదే గ్రామానికి చెందిన తమ్మిశెట్టి అంకారావు, తమ్మిశెట్టి గోపిరాజు అనే వ్యక్తులు ఫోర్జరీ పత్రాలతో దొంగ పాస్ పుస్తకాలు సృష్టించి ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులను సైతం బురిడీ కొట్టించారు. మొత్తం కలిపి సుమారు 65 లక్షల లోన్ పొందారు. ప్రస్తుతం ఆ భూమిలో తానే స్వయంగా పత్తి, మిర్చి, ఆముదం పంటలు సాగు చేస్తున్నాను. వారిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరాడు.

### ఎస్ఐ నమ్మించి మోసగించారు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలికి చెందిన ఏలూరి కవిత గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ ముగ్గురు ఆడపిల్లల తల్లిని. తన భర్త వేధింపుల వల్ల పుట్టింటికి వచ్చి ఉంటున్నా. కావ లి వన్‌టౌన్ ఎస్ఐ వెంకట్రావుతో తనకు పరిచయం ఏర్పడింది. పిల్లలకు తండ్రిగా ఉంటానని నమ్మించి 8 ఏళ్ల పాటు తనతో కలిసి సంసారం చేశారు. మే 10, 2025న కారులో తుమ్మలపెంట సముద్రం వద్దకు తీసుకెళ్లి మరో నలుగురితో కలిసి తనని వివస్త్రను చేసి ఫొటోలు తీశారు. ఎస్ఐ తనను కొట్టి చంపుతానని బెదిరిం చారు. ఆయనపై కేసు నమోదైన తర్వాత ఉద్యోగం పోతుందని ప్రాధేయపడి అత్తమామలతో కలిసి తనని నమ్మించి కోర్టులో రాజీ పడేలా చేశారు. తనతో మళ్లీ కలిసి ఉంటానని చెప్పి.. కేసు కొట్టివేసిన వెంటనే అసలు స్వరూపం బయటపెట్టారు. పక్కా పథకం ప్రకారం తనపైనే తప్పుడు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టించి ప్రాణహాని తలపెడుతున్నారు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

# టెన్త్ టాపర్లకు స్పీకర్ అయ్యన్న విందు

### ఇంటికి ఆహ్వానించి సత్కారం - హెచ్‌ఎంలు, ఎంఈవోలకు ప్రశంసలు





నర్సీపట్నం(చైతన్యరథం): పట్టణంలోని తన నివాసంలో సోమవారం ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఘనంగా సత్కరించారు. నియోజకవర్గంలోని 11 మంది టాపర్లను వారి పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులతో (ఎంఈవో) కలిసి తన ఇంటికి ఆహ్వానించి విందు భోజనం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు స్పీకర్ సతీమణి పద్మావతి, కుమారుడు రాజేష్, కోడళ్లు డాక్టర్ సువర్ణ, దివ్యశ్రీలు స్వయంగా ఆత్మీయంగా భోజనం వడ్డించారు. అనంతరం విద్యార్థులకు ఏటికొప్పాక సరస్వతి దేవి ప్రతిమలను బహూకరించారు.

ఉపాధ్యాయులను, ఎంఈవోలను కూడా సన్మానించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు అత్యధిక శాతం ఉత్తీర్ణత సాధించడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. ఆ సంతోషాన్ని పంచుకునేందుకే వారితో కలిసి భోజనం చేయాలని కార్యక్రమం ఏర్పాటు చేశాం. ఉపాధ్యాయులు, అధికారుల పట్టుదల, విద్యార్థుల శ్రద్ధ వల్లే ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయి. అనకాపల్లి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో నర్సీపట్నం నియోజకవర్గం నుంచే అత్యధికంగా 54 మంది విద్యార్థులు 570కి పైగా మార్కులు సాధించడం జిల్లాలోనే రికార్డు అని ప్రశంసించారు.

ఎన్ని కోట్ల ఆస్తులు ఉన్నా చదువే గొప్ప సంపద..విద్యాబలంతోనే తెలుగు వారు లండన్, అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో అత్యున్నత స్థాయిల్లో స్థిరప డ్డారని గుర్తుచేశారు. గతంలో నర్సీపట్నంలో డిగ్రీ కాలేజీ కూడా ఉండేది కాదు. ఇప్పుడు ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ, నర్సింగ్ వంటి ఎన్నో విద్యాసంస్థలు అందుబాటులోకి వచ్చాయి. నర్సీపట్నాన్ని ఒక ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ఆకాంక్షించారు.

పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులు నిరాశపడవద్దని సూచించారు. ప్రభుత్వం ఈ నెల 25 నుంచి 4వ తేదీ ప్రత్యేక కోచింగ్‌ను సద్వినియోగం చేసుకుని విజయం సాధించాలని భరోసా ఇచ్చారు. ప్రతిభావంతులైన విద్యార్థులతో కలిసి భోజనం చేయడం తనకు దక్కిన అదృష్టంగా భావిస్తున్నానని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఎంఈవో 1 సిహెచ్.తలుపులు, ఎంఈవో 2 నాగేంద్ర, మాకవరపాలెం ఎంఈ వో అచ్యుత్‌రావు, ప్రధాన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# హజ్‌కు 185 మంది ఏపీ యాత్రికులు

### ప్రారంభించిన మంత్రి ఫరూక్ - ప్రభుత్వానికి హాజీల కృతజ్ఞతలు



అమరావతి (చైతన్యరథం): హైదరాబాద్ ఎంబార్కేషన్ కేంద్రం శంషాబాద్ విమానాశ్రయం నుంచి 185 మంది ఏపీకి చెందిన యాత్రికులు హజ్ యాత్రకు సోమవారం బయలుదేరి వెళ్లారు. విడిది కేంద్రం నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి బయలు దేరిన హాజీల తరలింపు వాహనాలను మైనారిటీ మంత్రి ఫరూక్, మైనారిటీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుడు ఎం.ఎ.షరీఫ్, మైనారిటీ శాఖ కార్యదర్శి శ్రీధర్, హజ్ కమిటీ చైర్మన్ హసన్ భాష, సభ్యులు, సీఈవో గౌస్ పీర్ తదితరులు జెండా ఊపి ప్రారం భించారు. సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు మొదటి విమానం, ఆ తర్వాత రెండు విమానాల్లో మొత్తం 185 మంది యాత్రికులు హజ్‌కు బయలుదేరి వెళ్లినట్లు మంత్రి ఫరూక్ తెలిపారు. శంషాబాద్ విమానాశ్రయం సమీపంలో ఏర్పాటు చేసిన వసతి విడిది కేంద్రంలో ఆధునిక సౌకర్యాలతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యాత్రికులకు కూటమి ప్రభుత్వం నేతృత్వంలో మైనారిటీ మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో భారీగా ఏర్పాట్లు జరిగాయి. ఏపీ నుంచి 1202 మంది యాత్రికులు హజ్‌కు వెళ్లేందుకు హైదరాబా ద్ ఎంబార్కేషన్ కేంద్రం ఎంపిక చేసుకోవడం జరిగిందని మంత్రి తెలిపారు. వీరందరూ ఈనెల 21వ తేదీ వరకు దశలు వారిగా శంషాబాద్ విమానాశ్రయం నుంచి బయలుదేరి వెళ్లడం జరుగు తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర హజ్ యాత్రికులకు ఇతర రాష్ట్రాలలోని ఎంబా ర్కేషన్ కేంద్రాల వద్ద ప్రత్యేకంగా వసతి, భోజన, ప్రార్థన సౌకర్యా లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వైద్యశిబిరాలు, కరెన్సీ మార్పిడి, వీసా పత్రాల పరిశీలన, బోర్డింగ్ పాసుల జారీ తదితర అంశాలపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సౌకర్యాలు కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి హజ్ యాత్రకు వెళుతున్న హాజీలు కృతజ్ఞతలు తెలిపారు.

# జూన్ 21న "యోగా డే" ప్రత్యేక కార్యక్రమాలు

- సీఎం చంద్రబాబు అధ్వర్యంలో నిర్వహణ
- అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- సమీక్షలో మంత్రి సత్యకుమార్ ఆదేశం



విజయవాడ (చైతన్యరథం): అంతర్జాతీయ యోగా డేని పురస్కరించుకుని జూన్ 21న రాష్ట్రంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్యక్రమానికి సంబంధించి తొలి సన్నాహక సమావేశం వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ అధ్యక్షతన సోమవారం విజయవాడ ఆయుష్ ప్రధాన కార్యాలయంలో జరిగింది. మంత్రి మాట్లాడుతూ యోగాసనాల ప్రాధాన్యంపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాలని, ఇందుకు సంబంధించిన కార్యక్రమాల్లో విద్యార్థులు, ఉద్యోగులు, యోగా, రోటరీ, లయన్స్ క్లబ్, ఇతర సమాజ సేవా సంస్థల వారిని భాగస్వాములను చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఉన్న యోగా ట్రైనర్లతో ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించి కార్యక్రమాల నిర్వహణపై వారి అభిప్రాయాలు తెలుసుకోవాలని సూచించారు. గతేడాది నిర్వహించిన కార్యక్రమాలకు కొనసాగింపుగా తదుపరి చర్యలు ఉండాలని పేర్కొన్నారు. అమరావతి పరిధిలో రాష్ట్రస్థాయిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించే లా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. దీనికి అనుగుణంగా జిల్లా కేంద్రాల్లో కలెక్టర్ల నేతృత్వంలో యోగా డే కార్యక్రమాలు ఉండాలన్నారు. వేసవి సెలవుల అనంతరం జూన్ రెండో వారం నుంచి విద్యా సంస్థలు పునః ప్రారంభమవుతాయని తెలిపారు. వీరిలో యోగాసనాలపై అవగాహన పెంచడం వల్ల విస్తృత ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు. మండల స్థాయి నుంచి యోగాసన కార్యక్రమాలు జరపాలని పేర్కొన్నారు. గత ఏడాది అంతర్జాతీయ యోగా డే భారీస్థాయిలో కార్యక్రమాలు, వాటి ప్రభావంపై నివేదిక కూడా సిద్ధం చేయాలని ఆయుష్ ఇంచార్జ్ కమిషనర్ రోణంకి గోపాలకృష్ణను ఆదేశించారు. ప్రకృతి రంగ నిపుణులు, యోగా అండ్ నేచురోపతి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ మంతెన సత్యనారాయణరాజు ముఖ్యమైన సూచనలు చేశారు. యోగా డే కార్యక్రమాల నిర్వహణపై మంత్రి త్వరలోనే మరో మారు అధికారులతో సమావేశం కానున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో కూడా యోగా డే కార్యక్రమాల నిర్వహణపై చర్చించనున్నారు.

# ప్రాధాన్యతా క్రమంలో గోదావరి పుష్కరాల పనులు

- అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలి
- పురపాలక మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాలు
- పుష్కరాల ఏర్పాట్లు, నిధుల అంచనాలపై సమీక్ష
- పాల్గొన్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు, మున్సిపల్ సిబ్బంది



*అమరావతి (చైతన్యరథం): గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. వచ్చే ఏడాది జరిగే పుష్కరాల కోసం సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేస్తామని చెప్పారు. పుష్కరాల్లో మున్సిపల్ శాఖ తరపున చేపట్టాల్సిన పనులు, నిధుల అంచనాలపై అధికారులతో సమీక్ష చేశారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులతో ఈ సమావేశం జరిగింది. 2015లో జరిగిన గోదావరి పుష్కరా లకు కేవలం 3 నెలల ముందే పనులు చేపట్టామని...ఈసారి సుమారు ఏడాది ముందుగా పనులు ప్రారంభించి పక్కగా పూర్తి చేస్తామని చెప్పారు.*


*రాజహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు కొవ్వూరు, నిడదవోలు, మండపేట మున్సిపాలిటీల పరిధిలో చేపట్టాల్సిన పనులు, వాటికి అవసరమయ్యే నిధుల వివరాలతో అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా మంత్రికి వివ రించారు. ఆయా పట్టణాల్లో ప్రయారిటీ ప్రకారం పనులు చేపట్టాలని మంత్రి సూచించారు. ముందుగా రోడ్లు,డ్రైన్లతో పాటు తాగునీరు, పార్కుల పనులు చేపట్టాలని చెప్పారు. నిధుల అంచ నాలపై పూర్తి స్పష్టత వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు అనుమ తితో పనులు ప్రారంభిస్తామని తెలిపారు.*

*మరోవైపు ఇరిగేషన్, దేవదాయ శాఖ కూడా ఇప్పటికే పనులు ప్రారంభించినట్లు చెప్పారు. త్వరలో పుష్కరాలకు సంబంధం ఉన్న అన్ని శాఖలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశానికి టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు బుచ్చయ్య చౌదరి, జోగేశ్వరరావు, బత్తుల బాలరామకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వరరావు, మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్, డైరెక్టర్ సంపత్‌కుమార్, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ ఇన్ చీఫ్ ప్రభాకర్, రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు, మండపే ట, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు హాజరయ్యారు.*

చైతన్యరథం

# నక్ష ప్రాజెక్టు ప్రారంభానికి యోచన

- ప్రతి ఇంటికీ ప్రాపర్టీ కార్డు జారీ
- గత వైసీపీ ప్రభుత్వంలో నిలిపివేత



అమరావతి (చైతన్యరథం): పట్టణాలు, నగరాల్లో ప్రజల ఇళ్లు, ఇతర ఆస్తులు, భూములకు ప్రాపర్టీ కార్డులు జారీ చేసే నక్ష ప్రాజె క్టు పనులు తిరిగి ప్రారంభం కానున్నాయి. ఎంపిక చేసిన పుర, నగరపాలక సంస్థల్లో పెండింగ్ పనులను పూర్తి చేయించాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. గత ప్రభుత్వంలో ఈ ప్రాజెక్టు పనులను పక్కన పెట్టడంతో గతేడాది ఫిబ్రవరిలో గడువు ముగిసింది. కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి ప్రాజెక్టును తిరిగి గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం యత్నిస్తోంది. గ్రామాల్లో స్వామిత్వ తరహాలో పట్టణాల్లోనూ ప్రజల ఆస్తులను డ్రోన్లు, జీఐఎస్ టెక్నాలజీ ఆధా రంగా సర్వే చేసి ప్రాపర్టీ కార్డులు జారీ చేయాలని కేంద్ర ప్రభు త్వం నిర్ణయించింది. ఇందుకోసం 2024లో జాతీయ భౌగోళి క ప్రాదేశిక విజ్ఞాన ఆధారిత భూ సర్వే (నక్ష) ప్రాజెక్టుని ప్రారంభించింది. దేశ వ్యాప్తంగా 152 నగరాలు, పట్టణాల్లో తొలిదశలో అమలు చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలో ఒంగోలు, అనంత పురం, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, కాకినాడ, తిరుపతి, ఏలూరు, మంగళగిరి–తాడేపల్లి, కుప్పం పుర, నగరపాలక సంస్థలను అప్పట్లో ఎంపిక చేశారు. ఎంపిక చేసిన నగరాలు, పట్టణాల్లో గత ప్రభుత్వంలో డ్రోన్ సర్వే పూర్తి చేశాక కీలకమైన క్షేత్రస్థాయి పరిశీలన, రికార్డుల క్రోడీకరణ, మ్యాపింగ్ వంటివి చేయలేదు. దేశంలో పలు రాష్ట్రాలు పట్టణ ప్రజలకు ప్రాపర్టీ కార్డులు జారీ చేసేందుకు సిద్ధమవుతున్నాయి. రాష్ట్రంలో 2027 మార్చిలోగా ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని ప్రభుత్వం యోచి స్తోంది. ఈ ప్రాపర్టీ కార్డుల వల్ల ప్రజలకు పలు ప్రయోజనాలు చేకూరనున్నాయి. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆస్తుల వివరాలు తెలుస్తాయి. యాజమా న్యం, ఇళ్లు, భవనాలు, భూములు, స్థలాలు, విస్తీర్ణం వివరాలు కార్డులో నిక్షిప్తమై ఉంటాయి. ఆస్తుల క్రయ విక్రయాలపై రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ సులువవుతుంది. ఈ కార్డుల ఆధారంగా బ్యాంకు లు రుణాలు ఇవ్వనున్నాయి. సర్వే ద్వారా పట్టణ సమగ్రాభివృద్ధికి అధికారులు ప్రణాళికలు రూపొందించవచ్చు.

# పాత ధరకే పత్తి విత్తనాలు

- 450 గ్రాముల ప్యాకెట్ ధర రూ. 901
- ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం
- ఈ ఖరీఫ్‌కు అన్నదాతలకు తీపి కబురు



కర్నూలు(చైతన్యరథం): పత్తి రైతులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాష్ట్రంలోనే అత్యధిక విస్తీర్ణంలో పత్తిని సాగు చేస్తున్న ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఊరట ఇచ్చింది. ప్రతి ఏటా పత్తి విత్తన ఉత్పత్తి చేస్తున్న కంపెనీల యాజమాన్యాలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పత్తి విత్తన ప్యాకెట్ ధరను పెంచుకోవడం పరిపాటిగా మారింది. అయితే.. ఈసారి పత్తి విత్తన కంపెనీల ఒత్తిళ్లను కేంద్ర ప్రభుత్వం ఏ మాత్రం ఖాతరు చేయలేదు. గత సంవత్సరం ఒక ప్యాకెట్ (450 గ్రాములు) పత్తి విత్తనాలను రూ.901గా నిర్ణయించారు. ఈ సంవత్సరం కూడా అధే ధరను ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పత్తి రైతులు ఈసారి కూడా విత్తనాల ధరలు పెంచుతారేమోనని ఆందోళన చెందారు. అయితే. గతేడాది పత్తి విత్తనాల ధర ఎంత ఉందో అదే ధరను నిర్ణయిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై పత్తి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఐదేళ్ల నుంచి వాతావరణ పరిస్థితులు ఏ విధంగా ఉన్నా పత్తి పంట సాగునే రైతులు ఎంచు కుంటున్నారు. గత సంవత్సరం ఖరీఫ్‌లో 6 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. ఇంత పెద్ద విస్తీర్ణంలో పత్తి పంటను సాగు చేస్తున్న జిల్లాలో ఉమ్మడి కర్నూలు జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికార వర్గాలు తెలిపాయి.

# ఓటర్లు మార్పును కోరుకున్నారు

## బెంగాల్ విజయం బీజేపీ కృషికి నిదర్శనం: ఫలితాలపై ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్



అమరావతి (చైతన్యరథం): ఓటర్ల చైతన్యం నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం ఎన్నికల ఫలితాలలో మరోసారి స్పష్టంగా కనిపిస్తోందని ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పేర్కొన్నారు. పాలన నచ్చితే మళ్ళీ మళ్ళీ గెలిపిస్తారు. నచ్చకపోతే నిర్దాక్షిణ్యంగా ఓడిస్తారనడానికి ఈ ఫలితాలే చక్కటి ఉదాహరణ అన్నారు. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ ప్రజలు ఈసారి మార్పును బలంగా కోరుకున్నారు. ఆ మార్పును తమ తీర్పు ద్వారా బలంగా చెప్పారు. అసోమ్, పుదుచ్చేరిలో తమ ప్రాభవాన్ని నిలబెట్టుకుని పశ్చిమబెంగాల్ ప్రజల మనసును గెలుచుకున్న బీజేపీని, ఆ పార్టీ అగ్రనాయకత్వం అకుంఠిత దీక్ష సర్వదా శ్లాఘనీయమని ప్రశంసించారు. పశ్చిమబెంగాల్ వాసుల నమ్మకాన్ని ప్రోది చేసుకోడానికి మోదీ, అమిత్ షా గత కొన్ని సంవత్సరాలుగా చేసిన కృషి ఇప్పుడు ఫలితాన్ని ఇచ్చింది. డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే పశ్చిమబెంగాల్ సురక్షితంగా ఉంటుందన్న గట్టి విశ్వాసంతో ఆ రాష్ట్ర ప్రజలు బీజేపీకి పట్టం కట్టారు. అసోమ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్లి మరోమారు విజయాన్ని దక్కించుకున్న బీజేపీ నేత, అసోమ్ ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వశర్మకు, పుదుచ్చేరిలో కూటమికి విజయాన్ని మళ్లీ అందించిన ఎన్.ఆర్.కాంగ్రెస్ నేత, ముఖ్యమంత్రి రంగసామికి అభినందనలు తెలిపారు. తమిళనాడు, కేరళ రాష్ట్ర ప్రజలు మార్పును స్పష్టంగా కోరుకున్నారు. విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీని స్థాపించిన అనతి కాలంలోనే చక్కటి విజయాన్ని సాధించినందుకు మనసారా అభినందిస్తున్నట్లు తెలిపారు.

### నటులు చరిత్ర తిరగరాయగలరు: బాలకృష్ణ

నటుడు తలచుకుంటే చరిత్రను తిరగరాయగలడని తమిళనాట ఎంజీఆర్, తెలుగునాట ఎన్టీఆర్ నిరూపించారని నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై ఆయన స్పందించారు. మళ్లీ ఆ ప్రభంజనాన్ని స్ఫురణకి తెచ్చిన సోదరుడు విజయ్‌ని అభినందించారు. తమిళ ప్రజలు తనపై పెట్టుకున్న ఆశలు నెరవేర్చటమే ఆశయంగా సాగాలని అభిలషించారు. పశ్చిమ బెంగాల్, అసోం, పుదుచ్చేరిలలో విజయం సాధించిన బీజేపీ, ఎన్డీయే కూటమి పార్టీలకు శుభాకాంక్షలు తెలిపారు. మోదీజీ, అమిత్‌షా జీల సారధ్యంలోనే నూతన భారత నిర్మాణం సాధ్యమని విజయాభినందనలు తెలిపారు.

# మిర్చి రైతులకు లాభాలు

- ఆశించిన దిగుబడి.. గిట్టుబాటు ధర
- క్వింటా రూ.25 వేలు పైనే ధర
- గోదావరి తీర ప్రాంత రైతులకు ఉపశమనం



తూర్పుగోదావరి (చైతన్యరథం): మిర్చి సాగు ఈ ఏడాది రైతుల కు లాభాల పంట పండించింది. ఆశించిన దిగుబడి, గిట్టుబాటు ధరల లభించడంతో ఆర్థికంగా కలిసొచ్చింది. ప్రస్తుతం క్వింటా మిర్చి ధర రూ.21 వేల నుంచి రూ.25 వేల వరకు పలుకుతోంది. దీంతో రైతాంగం మిర్చి సాగు వైపు ఆసక్తి చూపుతున్నారు. భూములు కౌలుకు తీసుకోవడానికి రైతులు పోటీ పడుతుండ డంతో కౌలు ధరలు పెరిగాయి. కాగా రాబోయే సీజన్‌లో మిర్చి విస్తీర్ణం పెరగనుంది. గోదావరి తీర ప్రాంతాలైన కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని నల్లరేగడి భూముల్లో మిర్చి, పత్తి నాణ్యమైన పంటలకు ప్రసిద్ధి. రైతాంగం పండించిన మిర్చిని ఆంధ్రాలోని గుంటూరు, తెలంగాణలోని ఖమ్మం, వరంగల్, ఛత్తీస్‌ఘడ్‌లోని జగదల్‌పూర్ నుంచి వ్యాపారస్తులు వచ్చి మిర్చి కొనుగోలు చేసి ఎగుమతులు చేస్తుంటారు.

***ఈ ఏడాది కలిసొచ్చిన కాలం***

ఈ ఏడాది కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో దాదాపు ఆరు వేల ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. గతంతో పోలిస్తే విస్తీర్ణం తగ్గింది. దీనికి ప్రధాన కారణం గత మూడేళ్లుగా రైతులు నష్ట పోవడమే. 2023లో క్వింటా మిర్చి ధర క్వింటా రూ.20 వేలు పలికినప్పటికి పంటపై నల్లి ప్రభావంతో దిగుబడిరాక నష్టపోయా రు. 2024లో క్వింటా మిర్చి ధర రూ.12 వేలు పలకగా, 2025లో క్వింటా మిర్చి రూ.6 వేల నుంచి రూ.7 వేలు పలికింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ క్రమంలో మిర్చి సాగు వైపు ఆసక్తి తగ్గింది. అయితే ఈ ఏడాది వాతావరణం మిర్చి సాగుకు అనుకూలంగా మారింది. గోదావరి పరివాహక ప్రాంతం లో గోదావరి ముంపు కారణంగా పంట వేయడం ఆలస్యమైంది. అయినప్పటికి ఎకరానికి 20 - 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. లావులు మిర్చిరకం క్వింటా రూ.22 వేలు - రూ.25 వేలు, సన్నాలు రకం రూ.21 వేలు - రూ.22 వేలు ధర పలుకుతోంది. దీంతో ఎకరం మిర్చిసాగు చేస్తే రూ.లక్ష నుంచి రూ. రెండు లక్షల వరకు లాభాలు వచ్చాయి. ఎక్కువ శాతం మంది రైతులు ఈ ఏడాది మిర్చి పంటపై లాభాలు ఆర్జించారు. ఈ క్రమంలో మళ్లీ అందరి చూపు మిర్చి సాగుపై పడింది. వచ్చే సీజన్‌కు భూములు కౌలుకు తీసుకోవడానికి రైతులు పోటీ పడుతున్నారు. దామరచర్ల, గొమ్ము గూడెం ప్రాంతాల్లో ఎకరం కౌలు ధర రూ.40 వేలు, రూ.50 వేలు పలుకుతోంది. దీంతో రాబోయే సీజన్‌లో కుక్కునూ రు, వేలేరుపాడు మండలాల్లో మిర్చి విస్తీర్ణం పెరగనుంది.

# పేరుపాలెం బీచ్‌కు బ్లూ ఫ్లాగ్

- కలెక్టర్ చొరవతో దరఖాస్తు
- గుర్తిస్తే పర్యాటకంగా మరింత అభివృద్ధి



నరసాపురం(చైతన్యరథం): ఉమ్మడి పశ్చిమలో పేరుపాలెం బీచ్‌కు ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. నరసాపురం, మొగల్తూరు మండలాల్లో 19 కిలోమీటర్ల మేర విస్తరించిన సముద్ర తీరం పర్యాటకంగా ఎంతో ప్రసిద్ధి గాంచింది. కార్తీకమాసం వచ్చిందంటే లక్షల్లో సందర్శకులు ఇక్కడికి వస్తుంటారు. సెలవు రోజుల్లో బీచ్ ఖాళీ ఉండదు. ఈ బీచ్‌ను మరింత ఆభివృద్ధి చేసేందుకు జిల్లా కలెక్టర్ నాగరాణి ప్రత్యేక దృష్టి సారించారు. బీచ్‌కు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చేందుకు బ్లూ ప్లాగ్‌కు దరఖాస్తు చేశారు. ఇప్పటికే ఈ బ్లూ ఫ్లాగ్ సంస్థకు చెందిన కొంతమంది ప్రతినిధులు పేరుపాలెం బీచ్‌ను సందర్శించి చేపట్టాల్సిన పనులపై కొన్ని సూచ నలు, సలహాలు ఇచ్చారు. వాటిని పూర్తి చేసేందుకు జిల్లా టూరిజం శాఖ చర్యలు చేపట్టింది. పేరుపాలెం బీచ్‌లో ప్రస్తుతం రెండు రిసార్ట్స్ మాత్రమే ఉన్నాయి. ఒకటి కేంద్ర పర్యాటక మంత్రిగా చిరంజీవి ఉన్న సమయంలో హంస రిసార్ట్స్‌ను మంజూ రు చేశారు. తరువాత ప్రైవేట్ భాగస్వామ్యంతో సీబే రిసార్ట్సులు మాత్రమే ఉన్నాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు ఇవే ఆధారం.. గతంలో బీచ్‌లో బోట్ షికారు కూడా ఉండేది. త్వరలో దీన్ని తిరిగి ప్రారంభించే దశగా చర్యలు చేపట్టారు. మరో సంస్థ ఈ ప్రాంతంలో రిసార్ట్స్ అభివృద్ధికి ముందుకొచ్చింది. భూమి కేటాయిస్తే రిసార్ట్స్ నిర్మించి అభివృద్ధి పరుస్తామంది. దీనిపై జిల్లా టూరిజం అధికారి వెంకట అప్పారావు మాట్లాడుతూ కలెక్టర్ చొరవతో బ్లూ ఫ్లాగ్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేశాం. బీచ్‌లో పరిశుభ్రతకు చర్యలు తీసుకుంటున్నాం. గుర్తింపు వస్తే పర్యాట కంగా బీచ్ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.

### బ్లూ ఫ్లాగ్ గుర్తింపు అంటే..

బ్లూఫ్లాగ్ అనేది ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన ఒక ఆర్గనైజేషన్. బీచ్‌లు, టూరిజం ప్రాంతాల్లో ఈ సంస్థ పర్యటించి పర్యావరణ నాణ్యత సర్టిఫికెట్‌ను జారీ చేస్తుంది. ఈ గుర్తింపు ఉంటే ఆ బీచ్ చాలా పరిశుభ్రంగా , సురక్షితంగా, పర్యావరణానికి ఆనుకూలంగా ఉందని అర్థం. ప్రస్తుతం రాష్ట్రంలో విశాఖలోని రుషికొండ బీచ్‌కు మాత్రమే ఈ గుర్తింపు ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో మరికొన్ని బీచ్‌లకు ఈ గుర్తింపు కోసం దరఖాస్తు చేశారు. వాటిలో మచిలీ పట్నం, కాకినాడ, చీరాల, శ్రీకాకుళం, విశాఖలోని మరో రెండు బీచ్‌లు కూడా ఉన్నాయి. బ్లూ ఫ్లాగ్ గుర్తింపు వస్తే ప్రపంచ వ్యాప్తం గా ఆ బీచ్‌ల పేర్లు సంస్థ వెబ్‌సైట్‌లో కనిపిస్తాయి. దీనివల్ల పర్యాటకంగా అభివృద్ధి సాధిస్తుంది. అక్కడ రిస్టార్ట్స్, రెస్టా రెంట్లు పెట్టేందుకు ముందుకొస్తారు. గుర్తింపు రావాలంటే చాలా ప్రమాణాలు పాటించాల్సి ఉంది. ప్రధానంగా సముద్ర నీరు కాలుష్యం లేకుండా ఉండాలి. బీచ్ నిర్వహణ పరిశుభ్రంగా ఉండాలి, చెత్తా, చెదారం, వ్యర్థాలు కనిపించకూ డదు. తాగునీరు, మరుగుదొడ్లు, పస్ట్ ఎయిడ్, గజ ఈతగాళ్లు వంటి సదు పాయాలు ఉండాలి. వీటితో పాటు పర్యాటకుల సంఖ్య కూడా అధికంగా ఉండాలి. వీటిన్నంటిని పరిగణలోకి తీసుకుని సర్టిఫికెట్ జారీ చేస్తారు.

చైతన్యరథం

## సింహాచలేశుడిని దర్శించుకున్న మంత్రి అచ్చెన్నాయుడు



విశాఖపట్నం (చైతన్యరథం): సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం సింహాచలం శ్రీవరాహ లక్ష్మీ నరసింహ స్వామిని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దంపతులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ వివాహ వార్షికోత్సవం సందర్భంగా స్వామి ప్రాంగణంలో వేదాశీర్వచనం అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పలువురు నాయకులు, కార్యకర్తలు శు భాకాంక్షలు తెలిపారు. కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా నిలిచి సాగిన పాతికేళ్ల దాంపత్య బంధం ఎంతో గొప్పదని వారు కొనియాడుతూ ఆత్మీయ సత్కారం అందించారు. తొలుత మంత్రి అచ్చెన్నాయుడు దంపతులను శాస్త్రోక్తంగా పూర్ణకుంభంతో ఆహ్వానించి గర్భాలయానికి తీసుకెళ్లారు. స్వామి దర్శనానంతరం కప్పస్తంభం వద్ద సంప్రదాయం ప్రకారం మొక్కులు చెల్లించారు. వైశాఖ మాసాన్ని పురస్కరించుకుని స్వామిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. తనకూ, తన భార్య విజయ మాధవికీ వివాహ వార్షికోత్సవ శు భాకాంక్షలు తెలిపిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టెంపుల్ టూరిజానికి ప్రాధాన్యం ఇస్తున్నామని, ఈ క్రమంలో ఆలయ అభివృద్ధి జరుగుతున్న తీరు ఆనందంగా ఉందన్నారు. ఇందుకు తార్కాణంగా ఇటీవల జరిగిన చందనోత్సవాన్ని ప్రస్తావించారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ పనుల పర్యవేక్షణకు అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకోండి




విశాఖపట్నం (చైతన్యరథం): ఇంజనీరింగ్ విభాగానికి చెందిన పనుల్లో పర్యవేక్షణకు అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, తద్వారా సమయం కలిసివస్తుందని, అలానే నాణ్యత మెరుగుపడుతుందని వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్ వ్యాఖ్యానించారు. సోమవారం వీఎంఆర్డీఏ ఛాంబర్‌లో కమిషనర్ తేజ్ భరత్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ... ఇంజినీరింగ్ సిబ్బంది మరింత మెరుగైన ప్రతిభని కనపరచాలని సూచించారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేయాలని ఆదేశించారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని అనకాపల్లి కొత్తూరు దగ్గర వీఎంఆర్డీఏ నిర్మిస్తున్న పార్క్‌ను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పార్క్‌లో పచ్చదనం, క్రీడా పరికరాలు ఏర్పాటు, వాకింగ్ ట్రాక్ నిర్మాణం వంటివి త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఇటీవల వీఎంఆర్డీఏ అందుబాటులోకి తీసుకువచ్చిన విస్టా టికెటింగ్ యాప్ వల్ల ఆదాయం మెరుగుపడిందని, దీనిపై విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. సమావేశంలో సెంట్రల్ పార్క్ ఆవరణలో నిర్మించ తలపెట్టిన యాంటి డ్రగ్ పార్క్ నిర్మాణంపై చర్చించారు. ఈ సమావేశంలో పర్యవేక్షక ఇంజినీర్ మధుసూదనరావు, శిరీష, కార్యనిర్వహక ఇంజనీర్లు దుర్గాప్రసాద్, రామరాజు, సుదీర్, సింగ్, ఉప కార్యనిర్వహక ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల విజయం పెదకూరపాడు నియోజకవర్గానికి గర్వకారణం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



పెదకూరపాడు (చైతన్యరథం): క్రోసూరు మండలం 88తాళ్లూరులో ఇటీవల విడుదలైన 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అభినందించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన మండలంలోని విద్యార్థులను శాలువాలతో సత్కరించి, మెమెంటోలు అందజేశారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి, వారి పిల్లల విజయానికి కారణమైన కృషిని ప్రశంసించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడం ఎంతో గర్వకారణమని అన్నారు. కష్టపడి చదివితే ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు. భవిష్యత్తులో ఇంకా ఉన్నత లక్ష్యాలను పెట్టుకుని ముందుకు సాగాలని విద్యార్థులకు ప్రోత్సాహం అందించారు. అలాగే విద్యార్థుల విజయానికి తోడ్పడిన ఉపాధ్యాయులను అభినందిస్తూ, వారి సేవలను కొనియాడారు. మంత్రి లోకేష్ గా కృషితో ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి విద్యార్థికి మెరుగైన అవకాశాలు కల్పించేందుకు కృషి కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పేదలకు ప్రభుత్వం ఆర్థిక చేయూతనిస్తోంది : ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి




విజయనగరం (చైతన్యరథం): అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ప్రభుత్వ ఆర్థిక చేయూతనిస్తోందని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి తెలిపారు. సోమవారం ఎల్. కోటలో బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందించారు. ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అండగా ఉంటుందని బాధితులకు ఆమె భరోసాను ఇచ్చారు. బొబ్బిలి కోటలో ఎమ్మెల్యే బేబీ నాయనా సీఎం సహాయనిధి చెక్కులను బాధితులకు అందించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేదల నాయకుడని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాష్ట్రాన్ని పాలిస్తున్నారని అన్నారు.

## ఇటు ఎండలు.. అటు పిడుగుల వర్షాలు... రాష్ట్రంలో బిన్నమైన వాతావరణం



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భిన్నమైన వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఓవైపు ఎండలు దంచికొడుతున్నాయి. రికార్డ్ స్థాయిలో టెంపరేచర్లు నమోదవుతున్నాయి. రాష్ట్రం నిప్పుల కొలిమిని తలపిస్తోంది. మరోవైపు పలు ప్రాంతాల్లో వానలు పడుతున్నాయి. పిడుగులతో కూడిన వర్షాలు బెంబేలెత్తిస్తున్నాయి. భిన్నమైన వాతావరణానికి సంబంధించి విపత్తుల నిర్వహణ సంస్థ అలర్ట్ ఇచ్చింది. ఈ తరహా వాతావరణం మరో 3 రోజులు ఉంటుందని తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో ఎండ తీవ్రత ఉంటుందని, మరికొన్ని చోట్ల పిడుగులతో వర్షాలు పడతాయని అంచనా వేసింది.

**మే 5న వానలు..**

ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాలు మన్యం, అల్లూరి, పోలవరం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరిలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం. పిడుగులు కూడిన వర్షాలు పడే ఛాన్స్. శ్రీకాకుళం, విజయనగరం, పశ్చిమగోదావరి, చిత్తూరు, తిరుపతిలో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం. పిడుగుల సమయంలో చెట్ల కింద నిలబడకండి. రైతులు, కూలీలు, పశుకాపరులు జాగ్రత్తలు తప్పనిసరి. ఎండ తీవ్రత కొనసాగుతుంది. పలు జిల్లాల్లో 41డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు ఉంటాయని తెలిపింది. అత్యధికంగా పెద్దపారుపూడి (కృష్ణా): 43.9, విజయవాడ (ఎన్టీఆర్): 43.1, దొర్నిపాడు (నంద్యాల): 42.9 ఇలా మొత్తం 74 మండలాల్లో ఎండ ప్రభావం తీవ్రంగా ఉంటుంటుందని అధికారులు తెలిపారు. మరోవైపు ఎండ, ఉక్కపోత నుంచి రక్షణ కోసం జాగ్రత్తలు తీసుకోవాలని, నీళ్లు ఎక్కువగా తాగాలి. మధ్యాహ్నం బయటకు వెళ్లడం తగ్గించాలని సూచించారు.

## మెరిట్ విద్యార్థులతో సహపంక్తి భోజనం చేసిన టీడీపీ నాయకుడు



చీపురుపల్లి (చైతన్యరథం): రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ సంకల్పానికి గురువుల కృషి తోడవ్వడంతో, ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధ్యమయ్యాయని టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు అన్నారు. చీపురుపల్లి నియోజవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఆయన చీపురుపల్లిలోని తన నివాసంలో విందు ఏర్పాటు చేశారు. వారితో సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో రామ్‌మల్లిక్‌నాయుడు మాట్లాడుతూ నారా లోకేశ్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా మంచి ఫలితాల కోసం సంకల్పం తీసుకున్నారన్నారు. దానికి అనుగుణంగా విద్యా రంగంలో మార్పులు చేశారన్నారు. మంత్రి సంకల్పానికి, ఉపాధ్యాయుల కృషి, విద్యార్థులు పట్టుదల, తల్లిదండ్రుల సహకారం తోడు కావడంతో, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పది ఫలితాల్లో రికార్డులు నెలకొల్పారన్నారు. అనంతరం, విద్యార్థులను, వారి తల్లిదండ్రులను రామ్‌మల్లిక్ అభినందించారు.

## సంక్షేమాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది



విజయనగరం (చైతన్యరథం): సంక్షేమం.. అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం బొండపల్లి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి ప్రారంభించారు. నెలివాడలో సుమారు రూ.66.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, కాలువలను ప్రారంభించారు. అనంతరం కెరటాం గ్రామంలో రూ.96 లక్షలతో నిర్మించిన రోడ్లు, కాలువలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు పనితీరుకు ప్రస్తుతం జరుగుతున్న అభివృద్దే కొలమానమని పేర్కొన్నారు. కేవలం సంక్షేమానికే పరిమితం కాకుండా, అన్ని రంగాలను అభివృద్ధి మార్గంలో నడిపిస్తున్నామని తెలిపారు. పల్లె పండుగలో భాగంగా పలు గ్రామాలకు రహదారులు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. ఒక్క గజపతినగరం నియోజకవర్గంలోనే సుమారు రూ.200 కోట్లు విలువైన అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికే దాదాపు రూ.90 కోట్లు వరకు ఖర్చు చేశామని మంత్రి పేర్కొన్నారు.

## అమరావతి అభివృద్ధి కోసం శ్రీరాజ శ్యామల మహాయజ్ఞం



కైకలూరు (చైతన్యరథం): అమరావతి రాజధాని అభివృద్ధి నిర్విరామంగా కొనసాగాలని కాంక్షిస్తూ ముదినేపల్లిలో అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి శ్రీ రాజ శ్యామల మహాయజ్ఞం నిర్వహించారు. అమరావతి ప్రపంచ స్థాయిలో మేటి రాజధానిగా నిలిచి రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలు కలగాలని కోరుతూ సోమవారం తన నివాసం వద్ద తండ్రి మనోజ్తో కలిసి యజ్ఞాది, పూజా కార్యక్రమాలు చేశారు. రాజధానికి చట్టబద్ధత కల్పిచడం, ఆంధ్రుల ఆత్మ గౌరవానికి ప్రతీక అని ఆమె పేర్కొన్నారు. భావితరాల కోసం అమరావతి అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న కృషి వర్ణనాతీతమన్నారు. రాజధాని అభివృద్ధికి అంబాసిడర్గా శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. రూ.116 విరాళం అందించి ప్రజా రాజధాని నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యువత, విద్యార్థులు, ప్రజల సహకారంతో ప్రజా రాజధాని కోసం రూ.100 కోట్ల విరాళాలు సేకరించడమే లక్ష్యమన్నారు.

జోన్ - 2
(కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు)
చైతన్యరథం

# గుంటూరు జిల్లా కీలక ప్రాజెక్టుకు రాష్ట్రం అనుమతి

●గుంటూరు ఛానల్ ఆధునికీకరణకు రూ.369.20 కోట్ల మంజూరు

● కేంద్ర మంత్రి పెమ్మసాని ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు



గుంటూరు: రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న గుంటూరు జిల్లా ప్రజల కల సాకారమయింది. 33 వేల ఎకరాల ఆయకట్టుకు, 33 గ్రామాల ప్రజలకు ఆసరాగా మారుతుంది. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ గారి గుంటూరు ఛానల్ ఆధునికీకరణ ప్రతిపాదనకు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వం రూ. 369.20 కోట్లను మంజూరు చేస్తున్నట్లుగా సోమవారం ప్రకటించింది. దీంతో నీటి సమృద్ధి పెరిగి తాగునీటి వ్యవస్థ వృద్ధి చెందుతూ వ్యవసాయానికి మరింత ఉపయోగపడబోతున్న నేపథ్యంలో గుంటూరు జిల్లా రైతాంగం ఆనందోత్సాహాలు వెలిబుచ్చుతున్నారు. గుంటూరు జిల్లాలో సాగునీటి వ్యవస్థను బలోపేతం చేసే దిశగా గుంటూరు ఛానెల్ ఆధునికీకరణ పనులకు రూ. 369.20 కోట్ల నిధుల విడుదలకు పరిపాలన అనుమతి లభించింది. కృష్ణా డెల్టా సిస్టమ్‌లో భాగంగా 0 నుండి 47 కి.మీ వరకు లీడింగ్ ఛానల్ మరియు డిస్ట్రిబ్యూటరీలతో కూడిన సమగ్ర అభివృద్ధి పనులకు ఈ నిధులు వినియోగించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం జి.ఓ.ఆర్.టి నం.217, తేదీ 04-05-2026 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ... ఈ ప్రాజెక్ట్ గుంటూరు జిల్లాలో సాగునీటి సరఫరాను మరింత బలోపేతం చేసి, రైతులకు స్థిరమైన నీటి సౌకర్యాలను పెంచుతుందని తెలిపారు. కాలువ ఆధునికీకరణతో నీటి వినియోగ సామర్థ్యం పెరిగి, వ్యవసాయ ఉత్పాదకతకు పెద్ద ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ గుంటూరు ఛానల్ ఆధునికీకరణ నిమిత్తం విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌తో పాటు పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు కూడా కృషి చేశారు. కృష్ణా డెల్టా ప్రాంతంలో నీటి నిర్వహణను మరింత సమర్థవంతంగా మార్చే ఈ ప్రాజెక్ట్, రైతుల జీవనోపాధిని మెరుగుపరచడంలో కీలకంగా మారుతుందని తెలిపారు. "రైతుకు నీరు అందితేనే అభివృద్ధి సాధ్యం... ఈ ప్రాజెక్ట్ ఆ దిశగా కీలక అడుగు" అని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును త్వరితగతిన ప్రారంభించేందుకు కృషి చేస్తామని తెలిపారు. గుంటూరు ప్రాంతానికి ఈ కీలక ప్రాజెక్ట్ మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి, విద్య మరియు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కి, జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సంబంధిత అధికారులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ కీలకం

: టీడీపీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు



కాకినాడ (చైతన్యరథం): ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి సత్వర పరిష్కారం చూపేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తెలిపారు. సోమవారం కాకినాడ స్మార్ట్ సిటీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన కార్పొరేషన్ అధికారులతో కలిసి పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వయంగా స్వీకరించారు. ఈ ప్రజా దర్బార్‌లో సుమారు 140 అర్జీలు అందగా, వాటిని వేగవంతంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆదేశించారు. వితంతు, దివ్యాంగుల పెన్షన్ కొరకు, ఇల్లు స్థలాలు కోసం, త్రాగునీటి సమస్యలు, వీధి దీపాల పనితీరు లోపాలు, డ్రైనేజీల శుభ్రత వంటి అనేక సమస్యలపై వివిధ డివిజన్ల నుంచి ప్రజలు భారీగా హాజరై తమ అర్జీలను సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబుకు అందజేశారు. తక్షణ పరిష్కారం సాధ్యమైన సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వనమాడి అధికారులను సూచించారు. ముఖ్యంగా త్రాగునీటి సరఫరా, విద్యుత్ సమస్యలు, వితంతు పెన్షన్ల వంటి అంశాలపై ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఇక నగరంలో డ్రైనేజీ వ్యవస్థ పరిరక్షణలో ప్రజల సహకారం అవసరమని ఆయన అన్నారు. కాలువలపై కాంక్రీట్ నిర్మాణాలు చేయడం, కాల్వలను ఆక్రమించుకునే నిర్మాణాలు చేయడం వల్ల డ్రైనేజీ శుభ్రపరిచే పనులు కష్టతరమవుతున్నాయని, డ్రైనేజీలను ప్రజలే సంరక్షించుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలపై అధికారులు ఫోన్ ద్వారా కూడా స్పందిస్తున్నారని, అవసరమైనప్పుడు నేరుగా సంప్రదించాలని, అలాగే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాస్, టీపీఆర్‌వో శైలజ, డీఈ మత్యరాజు, డిసిపి కృష్ణారావు, శానిటేషన్ సూపర్వైజర్లు నాయుడు, రాంబాబు, హౌసింగ్ ఏడీ, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ

● జగ్గయ్యపేటలో కార్యక్రమం చేపట్టిన ఎమ్మెల్యే రాజగోపాల్



జగ్గయ్యపేట (చైతన్యరథం): ఆస్తి అనేది ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధ హక్కు అని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య వ్యాఖ్యానించారు. సోమవారం పెనుగంచిప్రోలు మండలం, గుమ్మడిదుర్రు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే... అర్హులైన లబ్ధిదారులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ... ఆస్తి అనేది ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధ హక్కు అని పేర్కొన్నారు. గత ప్రభుత్వ కాలంలో వ్యక్తిగత ఫోటోలతో ముద్రించిన పాసుపుస్తకాలు ఇవ్వడం వల్ల అనేక సాంకేతిక, న్యాయ సంబంధిత సమస్యలు తలెత్తాయని, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రత్యేకంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఫోటోతో ముద్రించిన పుస్తకాల విషయంలో ప్రజల్లో గందరగోళం ఏర్పడిందని, భూమి రికార్డుల విషయంలో స్పష్టత లోపించిందని విమర్శించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారిక రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేస్తూ, భూ యజమానులకు న్యాయ పరిరక్షణ కల్పిస్తోందని తెలిపారు. రాజముద్ర ఉన్న పాసుపుస్తకాలు ప్రభుత్వ అధికారిక ధృవీకరణకు ప్రతీకగా నిలిచి, భవిష్యత్తులో ఎలాంటి వివాదాలకు తావులేకుండా చేస్తాయని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెనుగంచిప్రోలు ఎమ్మార్వో శాంతి లక్ష్మీ, పోలంపల్లి మునీరు ప్రాజెక్ట్ చైర్మన్ పొన్నం బాలాజీ, పొందూరి నాగేశ్వరరావు, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు యార్లగడ్డ విశ్వనాథం, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కంచేటి రాంబాబు మరియు రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్



దెందులూరు (చైతన్యరథం): దెందులూరు మండలం గాలాయ గూడెంలో "మీ భూమి – మీ హక్కు" రీ సర్వే పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాల్గొన్నారు. కూటమి నేతలతో కలిసి రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ... రీ సర్వే ద్వారా భూములపై స్పష్టమైన హక్కులు రైతులకు కల్పించడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రభుత్వ రాజముద్రతో ఇచ్చే పాస్ పుస్తకాలు రైతులకు భద్రత, నమ్మకం కలిగిస్తాయని తెలిపారు. గత వైసీపీ పాలనలో రైతుల ఆత్మాభిమానాన్ని దెబ్బతీస్తూ అహంకారంతో కూడిన విధానంతో తమ ఫోటోలను ప్రమరించి రైతులకు పాస్ పుస్తకాలు ఇవ్వడం వారి అహంకారానికి ప్రతీక అని, కూటమి ప్రభుత్వంలో రైతుల ఆత్మ అభిమానానికి ప్రాధాన్యతనిస్తూ స్పష్టమైన వివరాలతో కూడిన రాజముద్రతో కూడిన పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇవ్వడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వివాదాలకు ఆస్కారం లేకుండా పట్టాదారు పాస్ పుస్తకాలు

●రైతులకు అండగా కూటమి ప్రభుత్వం : మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్



మైలవరం (చైతన్యరథం): గత ప్రభుత్వం సృష్టించిన భూ వివాదాలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా పరిష్కరిస్తోందని, ఇందులో భాగంగా ఎటువంటి వివాదాలకు ఆస్కారం లేకుండా రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు వెల్లడించారు. రెడ్డిగూడెం మండలంలోని రుద్రవరం గ్రామంలో ప్రభుత్వ రాజముద్రతో రూపొందించిన 1196 పట్టాదారు పాసు పుస్తకాలను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు సోమవారం రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ... 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేస్తున్నామన్నారు. రెవెన్యూ శాఖలో కూటమి ప్రభుత్వం ఎన్నో మార్పులు, సంస్కరణలు తెచ్చిందన్నారు. భూ యజమానులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలు అందచేసినప్పుడు రైతులు ఎంతో సంతోషిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 21.23 లక్షల పాసు పుస్తకాల పంపిణీ పూర్తి చేశారన్నారు. 2027 మార్చి నాటికి రీసర్వే 2.0 ప్రక్రియ ముగించి 1.12 కోట్ల పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆటో మ్యూటేషన్ తరువాత పట్టాదారు పాస్ పుస్తకాన్ని నేరుగా రైతుల ఇంటికే పంపుతామన్నారు. భూమే ప్రాణంగా, జీవితంగా, భవిష్యత్‌గా భావించే రైతులకు భూ వివాదాలు లేకుండా చేసి, వారికి భద్రత, భరోసాను కల్పిస్తామన్నారు. రైతులకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తోందన్నారు. అన్నదాత సుఖీభవ' కింద మైలవరం నియోజకవర్గంలో సుమారు 30 వేల మంది రైతులకు మూడు విడతల్లో రూ.56.62 కోట్లు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్య భద్రత, సంక్షేమమే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం పనిచేస్తోంది

●సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన మంత్రి కందుల దుర్గేశ్



నిడదవోలు (చైతన్యరథం): ప్రజల ఆరోగ్య భద్రత, సంక్షేమమే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 54 మంది లబ్ధిదారులకు రూ.26.41 లక్షల విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 835 మంది లబ్ధిదారులకు రూ.5.93 కోట్ల మేర సీఎం రిలీఫ్ ఫండ్ అందజేసినట్లు మంత్రి వెల్లడించారు.

జోన్ - 3 (మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, బాపట్ల, నరసరావుపేట)

చైతన్యరథం

# ప్రజా సమస్యల పరిష్కారం కోసం నేడు చీఫ్ విప్ జీవి ప్రజాదర్బార్




వినుకొండ (చైతన్యరథం): వినుకొండ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికై మంగళవారం వినుకొండ నియోజకవర్గంలో నూజెండ్ల గ్రామంలో ఎంపీడీవో కార్యాలయంలో 'ప్రజాదర్బార్' నిర్వహిస్తున్నట్లు కార్యాలయ వర్గాలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపాయి. ప్రజా దర్బార్‌కు ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు ముఖ్య అతిధులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఉదయం 10.00 గంటల నుంచి 01:00 గంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని వెల్లడించారు. ఈ సందర్భంగా సమస్యలు ఉన్నవారు నేరుగా చీఫ్ విప్ జీవీని కలసి సమస్యలు వివరించవచ్చని ఆయన కార్యాలయం ప్రతినిధులు సూచించారు. నూజెండ్ల మండలంలో పాటు నియోజకవర్గంలోని 5మండలాల నుంచి ప్రజలు ప్రజాదర్బార్‌కు తరలివచ్చి ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరి వద్ద విజ్ఞాపన పత్రాలు చీఫ్ విప్ జీవి స్వయంగా స్వీకరించి సాధ్యమైనంత మేరకు తక్షణమే పరిష్కారాలు చూపిస్తారని పేర్కొన్నారు. మిగిలిన వాటికి వినతుల ద్వారా వచ్చే సమస్యలు ఇక్కడి నుంచే విభాగాల వారీగా విభజించి సంబంధిత శాఖలకు పంపి పరిష్కారానికి కృషి చేస్తారన్నారు.

# పొలిట్‌బ్యూరో సభ్యురాలిగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి నియామకం పట్ల అభినందనల వెల్లువ

### ●ఫిజియోథెరఫిస్ట్ ఫెడరేషన్ ప్రతినిధుల మర్యాదపూర్వక భేటీ



గుంటూరు (చైతన్యరథం): గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యురాలిగా నియమితులైన గళ్ళా మాధవిని ఆమె క్యాంపు కార్యాలయంలో పలువురు నాయకులు, ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలుసుకుని శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాళ్ళ వెంకటేష్ యాదవ్ ఎమ్మెల్యే గళ్ళా మాధవిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఫిజియోథెరఫిస్ట్ ఫెడరేషన్ - ఆంధ్రప్రదేశ్ సంఘ సభ్యులు సోమవారం ఎమ్మెల్యేని క్యాంపు కార్యాలయంలో కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు డా. బాపట్ల వెంకట హరికృష్ణ, కార్యదర్శి డా. సుభాని తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా ఫిజియోథెరఫీ రంగానికి ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఫిజియోథెరపీ విభాగాలను ఆధునీకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. వారి వినతులను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి... సంబంధిత అంశాలను పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైన పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డా.ఏడుకొండలు, డా.ఇమ్రాన్ ఖాన్, డా. రాజేంద్ర ప్రసాద్, డా.దయాకర్‌రావు, డా.నాగ జ్యోతి, హారిక ఫిజియోథెరపీ కాలేజీ ఫిజియోథెరపిస్టులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# మహిళలపే వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ విధానం



ఉయ్యూరు (చైతన్యరథం): మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చి దిద్దడానికి కూటమి ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా అనేక ప్రోత్సాహకాలను అందిస్తుందని మాజీ ఎమ్మెల్సీ వై.వి.బి రాజేంద్ర ప్రసాద్, పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వ్యాఖ్యానించారు. సోమవారం ఉయ్యూరు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో మాజీ కౌన్సిలర్ తెనాలి పద్మావతి ద్వారా నిర్మించనున్న PVS గ్రాండ్ ఫంక్షన్ హాల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ... చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా ప్రోత్సహించేందుకు అనేక పథకాలను ప్రవేశపెట్టి చిన్న వ్యాపారాలకు సబ్సిడీ రుణాలు ఇవ్వడం ద్వారా మహిళలు వ్యాపార వేత్తలుగా ఎదిగి ఆర్థికంగా బలంగా నిలబడే అవకాశం కలుగుతుందని అన్నారు. పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ... ఒక ప్రాంతంలో కొత్త వ్యాపారం ప్రారంభించడం ద్వారా ఆ చుట్టుపక్కల ప్రాంతాలు కూడా అభివృద్ధి చెంది జనసంచారం పెరిగి వ్యాపారాభివృద్ధి చెందుతుందని అన్నారు.కూటమి ప్రభుత్వం మహిళా పక్షపాతి అని అందుకనే చంద్రబాబు చట్టసభల్లో ముప్పైమూడు శాతం రిజర్వేషన్ల కోసం కృషి చేస్తున్నారని అన్నారు.

# రీ సర్వే ద్వారా భూములపై స్పష్టమైన హక్కులు : ఎమ్మెల్యే తంగిరాల



నందిగామ (చైతన్యరథం): రీ సర్వే ద్వారా భూములపై స్పష్టమైన హక్కులు రైతులకు కల్పించడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య వ్యాఖ్యానించారు. సోమవారం వీరులపాడు మండలం కొనతాలపల్లి మరియు అల్లూరు గ్రామాలలో "మీ భూమి - మీ హక్కు" కార్యక్రమం కింద రీ సర్వే అనంతరం ప్రభుత్వ రాజముద్రతో కూడిన కొత్త పాస్ పుస్తకాలను తంగిరాల సౌమ్య కూటమి నేతలతో కలిసి రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ... రీ సర్వే ద్వారా భూములపై స్పష్టమైన హక్కులు రైతులకు కల్పించడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ రాజముద్రతో ఇచ్చే పాస్ పుస్తకాలు రైతులకు భద్రత, నమ్మకం కలిగిస్తాయని పేర్కొన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. గత వైసీపీ పాలనపై విమర్శలు గుప్పిస్తూ, రైతు పాస్ పుస్తకాలపై జగన్ బొమ్మలు ముద్రించడం రాజకీయ ప్రయోజనాల కోసమేనని, అది రైతుల గౌరవానికి విరుద్ధమని అన్నారు. ఆ చర్యలు గత ప్రభుత్వ పిచ్చి పరాకాష్టకు ఉదాహరణగా నిలిచాయని వ్యాఖ్యానించారు.

# పేదల కష్టంలో అండగా ఎమ్మెల్యే నసీర్... నిర్వాసితులకు ఆర్థిక సాయం



గుంటూరు (చైతన్యరథం): మోతీలాల్ నగర్ నిర్వాసితులను నా సొంత కుటుంబ సభ్యులుగా భావించి అండగా నిలుస్తాననే మాటపై నిలబడతానని, ఏ కష్టమొచ్చినా తోడుగా ఉంటానని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. సోమవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో మోతీలాల్ నగర్ నిర్వాసితుల్లో 40 కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున రూ.20 లక్షల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో చిత్తశుద్ధితో వ్యవహరిస్తామని తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో, అభివృద్ధిలో భాగంగానే మోతీలాల్ నగర్ లో ఇళ్ల కూల్చివేత చేపట్టారని చెప్పారు. నిర్వాసితులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పూర్తి చేశాక ఖాళీ చేయించామని తెలిపారు. తొలుత వారికి కేటాయించిన కొర్నెపాడు ప్లాట్లలో ఇళ్ల కేటాయింపునకు చర్యలు తీసుకున్నామని, కానీ అక్కడ సాధ్యపడకపోవడంతో చౌడవరంలో ప్రత్యామ్నాయ ఏర్పాటు చేశామని తెలిపారు. మోతీలాల్ నగర్ వాసుల్లో అధికశాతం మంది కూలీలు కావడంతో ప్రయాణ ఖర్చులు అధికమవుతాయనే ఉద్దేశంతో గుంటూరులోనే అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారని చెప్పారు. మోతీలాల్ నిర్వాసితులకు తాను చెప్పిన విధంగా ఆర్థిక సాయం అందిస్తున్నానని, ఇదే కాకుండా ఎలాంటి అవసరం వచ్చినా ఆదుకునేందుకు ముందుంటానని భరోసా కల్పించారు. వైసీపీ నాయకులు పని గట్టుకుని దుష్ప్రచారం చేస్తే ప్రజలు సహించబోరని హెచ్చరించారు. గత పదేళ్లలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి ఆనవాళ్లు ఎక్కడా కనిపించ లేదని, తాము అధికారం చేపట్టిన కేవలం 18 నెలల కాలంలోనే వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. అభివృద్ధి అనే పదానికి అర్థం తెలియని వాళ్లు పేదల ఇళ్లపై రాజకీయం చేస్తుంటే ప్రజలు చీదరించుకుంటున్నారని మండిపడ్డారు.

# తూర్పులో ఇళ్ల పట్టాల సర్వే ప్రారంభం : ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్




విజయవాడ (చైతన్యరథం): విజయవాడ తూర్పు నియోజకవర్గంలో కొండ ప్రాంతాలు, ఆక్రమిత ప్రాంతాల్లో ఇళ్లు నిర్మాణం చేసుకున్నవారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేసేందుకు ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకుంటోందని, ఈ సర్వే సోమవారం నుంచి ప్రారంభమైనదని శాసనసభ్యులు గద్దె రామమోహన్ వెల్లడించారు. సోమవారం నాడు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యుని కార్యాలయంలో ఇళ్ల పట్టాల మంజూరుకు ముందస్తు సర్వేకు సంబంధించిన కరపత్రాన్ని శాసనసభ్యులు గద్దె రామమోహన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు గద్దె రామమోహన్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో మూడు నెలల్లో విజయవాడ కొండ మరియు అక్రమిత ప్రాంతాల్లోని వారికి ఇళ్ల పట్టాలు మంజూరుకు చర్యలు తీసుకొనవలసినదిగా కలెక్టరు గారిని ఆదేశించారని తెలిపారు. పట్టాల మంజూరుకు అవసరమైతే క్లాసిఫికేషన్లో మార్పులు చేసి ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వివరించారు. ముఖ్యమంత్రి ఆదేశానుసారం ఎన్.టి.ఆర్. జిల్లా కలెక్టరు సర్వే కొరకు ప్రభుత్వ అధికారులను నియమించారని, వారి ప్రక్రియ సోమవారం నుండి ప్రారంభమైనదని వెల్లడించారు. సర్వే టీము ఇంటికి వచ్చినపుడు వారికి సరైన సమాచారాన్ని అందించి, వారు కోరిన పత్రాల జెరాక్సులను సమర్పించాలని సూచించారు. తమ స్థలానికి చెందిన పట్టాలు, స్థలం చేతులు మారిన వివరాల డాక్యుమెంట్లు, ఇంటి పన్ను రసీదు, నీటి పన్ను రసీదు, కరెంటు బిల్లు, ఇంటి ఫోటో, కుటుంబ సభ్యులందరి ఆధార్ కార్డులు, రేషన్ కార్డుల జిరాక్సు కాపీలను సిద్ధం చేసుకోవాలని గద్దె రామమోహన్ తెలిపారు.

# పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాలి : దేవినేని ఉమామహేశ్వరరావు



మంగళగిరి (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి క్రమశిక్షణతో పనిచేస్తేనే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన యూనిట్ ఇంచార్జ్ మొదటి బ్యాచ్ క్యాడర్ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని నేతలు, కార్యకర్తలకు మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా దేవినేని ఉమా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలను ప్రజలకు స్పష్టంగా వివరించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. ప్రజలతో నిత్యం మమేకమై వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టడంలో కార్యాచరణతో ముందుకు సాగాలని, వాస్తవాలను ఆధారాలతో ప్రజల ముందుకు తీసుకురావాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియాను సమర్థంగా వినియోగిస్తూ పార్టీ విధానాలను విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. క్యాడర్ శిక్షణ కార్యక్రమాలు పార్టీ బలోపేతానికి కీలకమని పేర్కొంటూ, ప్రతి నాయకుడు శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామ స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ పట్ల నిబద్ధత, ప్రజల పట్ల సేవాభావం ఉంటే విజయాలు సాధ్యమవుతాయని ఆయన నొక్కిచెప్పారు.

# వైసీపీకి ఆ పదకొండు కూడా రావు

## పురపాలక మంత్రి నారాయణ ఎద్దేవా



నెల్లూరు (చైతన్యరథం): నగరం 3వ డివిజన్ పరిధిలోని దస్తగిరి నగర్‌లో 1.43 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు,డ్రైనేజీ పనులకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ శంకుస్థాపన చేశారు. మంత్రికి స్థానిక ప్రజలు, నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గతంలో ఆక్రమణల కారణంగా 40 అడుగుల రోడ్డు కేవలం 12, 15 అడుగులకే పరిమితమైందని, అయితే స్థానికులతో చర్చించి 20 అడుగుల వెడల్పుతో పనులు ప్రారంభించామని తెలిపారు. గత ప్రభుత్వం వదిలి వెళ్లిన 10 లక్షల కోట్ల రూపాయల అప్పులను తీరుస్తూనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని, ఈ పనులను కేవలం 3 నెలల కాలంలోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు .2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశానికి వచ్చిన పరిశ్రమల్లో 25 శాతం ఆంధ్రప్రదేశ్‌కే రావడం శు పరిణామమన్నారు. దీని ద్వారా యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. రాజకీయ విమర్శలపై మీడియా ప్రశ్నలకు స్పందిస్తూ మహానాడు ఎక్కడపెట్టాలో చెప్పటానికి వాళ్లెవరని వైసీపీ నేతలను ప్రశ్నించారు. వాళ్ళ తీరు మారకపోతే వచ్చే ఎన్నికల్లో వైసీపీకి 11 సీట్లు కూడా రావన్నారు . గతంలో తాను నెల్లూరులో చేసిన 5,300 కోట్ల అభివృద్ధి రికార్డును ఈసారి అధిగమిస్తానని ,ప్రజల సహకారంతో నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ నెల్లూరు నగరాభివృద్ధిపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, మేయర్ దేవరకొండ సుజాత అశోక్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, నగర అధ్యక్షుడు మామిడాల మధు, టీడీపీ ముఖ్యనేతలు సంక్రాంతి కల్యాణ్, కొమ్మారి విజయమ్మ, కాకర్ల గోవర్ధన్, రవణయ్య నాయుడు సుధీర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



# రేపు టీడీపీ కొత్త భవనానికి శంకుస్థాపన

## ఒంగోలు పార్లమెంటు టీడీపీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి

ఒంగోలు (చైతన్యరథం): రాం నగర్ 2వ లైన్‌లోని పార్టీ కార్యాలయంలో ఒంగోలు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి, ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల మీడియాతో మాట్లాడారు. పార్లమెంటు అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 6వ తేదీ బుధవారం ఒంగోలు భాగ్యనగర్ నాలుగో లైన్ లోని ఏసీబీ కార్యాలయం సమీపంలో ఒంగోలు పార్లమెంట్ టిడిపి కార్యాలయం నూతన భవనానికి శంకుస్థాపన ఉదయం 10:31ని.లకు జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ వివిధ పదవుల్లో ఉన్న పార్టీ నాయకులు అందరూ, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, గ్రామ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్, యూనిట్, బూతు ఇన్చార్జిలు, కుటుంబ సాధికార సభ్యులు, వివిధ నామినేటెడ్ పదవుల్లో ఉన్న పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ పార్లమెంటు అధ్యక్షులు ఉగ్రనరసింహ రెడ్డి ఆధ్వర్యంలో నూతన పార్టీ కార్యాలయ భవనానికి శంకుస్థాపన జరుగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ కమిటీ ప్రధాన కార్యదర్శి కొఠారి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షురాలు షేక్ ఆరీఫా, కార్యనిర్వాహక కార్యదర్శులు గార్లపాటి శ్రీనివాసరావు, కసుకుర్తి అంకరాజు, కార్యదర్శి తంజావూరి శ్రీనివాసమూర్తి తదితర నాయకులు పాల్గొన్నారు.

# మానవతా మూర్తి ముఖ్యమంత్రి చంద్రబాబు

## కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి



కావలి (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ సోమవారం జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆశీస్సులతో ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి చేతుల మీదుగా 40 మంది లబ్ధిదారులకు మొత్తం 37 లక్షల 76 వేల 317 రూపాయల విలువైన చెక్కులు అందజేశారు. అత్యవసర పరిస్థితుల్లో చికిత్స కోసం ఎల్ఓసీ కింద 1 లక్ష 10 వేల 343 రూపాయల సహాయాన్ని కూడా మంజూరు చేశారు. ఇప్పటి వరకు 25 మందికి 76 లక్షల రూపాయల ఎల్ఓసీ ఆర్థిక సహాయం అందించగా, గతంలో 1607 మందికి పైగా లబ్ధిదారులకు మొత్తం 9 కోట్ల 17 లక్షల 10 వేల 527 రూపాయల ఆర్థికసహాయం అందించినట్లు తెలిపారు. అవసరంలో ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# తప్పు చేసి శ్రీవారి వద్ద తప్పించుకోలేరు

## టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి నరసింహ యాదవ్



తిరుపతి (చైతన్యరథం): పార్టీ స్థాపించినప్పటి నుంచి ఎన్టీఆర్ అభిమానిగా, కార్యకర్త నుంచి పని చేస్తున్న తనను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, నారా లోకేష్‌కు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి నరసింహ యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నాటి ఎన్టీఆర్ నుంచి నేడు నారా లోకేష్ వరకు మూడు తరాలవారితో పనిచేయడం అదృష్టం అని పేర్కొన్నారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పటి నుంచి పార్టీ లో 44 సంవత్సరాలు సుదీర్ఘంగా పనిచేశానని ఏనాడు పదవుల కోసం పాకులాడలేదని పేర్కొన్నారు. ఎన్డీఏ కూటమి, ప్రధాని నరేంద్ర మోడీ చేస్తున్న కృషికి ఐదు రాష్ట్రాల ఫలితాలే నిదర్శనమని చెప్పారు. భూమున కరుణాకర్ రెడ్డి పత్రికా సమావేశంలో ఏకసభ్య కమిషన్ను హేళన చేస్తూ మాట్లాడటాన్ని ఖండిస్తున్నామన్నారు.

# మహిళా బిల్లును అడ్డుకున్నందుకే అధోగతి

## దర్శి టీడీపీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



దర్శి (చైతన్యరథం): మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించిన రాజకీయ పార్టీలకు నేడు ప్రజలు బుద్ధి చెప్పారని దర్శి టీడీపీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అభిప్రాయపడ్డారు. డబల్ ఇంజన్ సర్కార్ తోనే అభివృద్ధి సాధ్యమని నమ్మి ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి మద్దతుగా నిలిచి అందించిన విజయం ఎన్నికల్లో దేశాభివృద్ధికి ఒక మలుపుగా చెప్పవచ్చున్నారు. కాంగ్రెస్ ఘోరంగా ఓడిపోయిందని కాంగ్రెస్ కూటమి పక్షాలు కూడా కూలిపోయాయని ఆమె అన్నారు. అస్సాం, బెంగాల్, కేరళలో కాంగ్రెస్ లెఫ్ట్ పార్టీలకు, తమిళనాడులో డీఎంకేకు ఎన్నికలు చెంపపెట్టుగా మారాయి అన్నారు. ప్రజాదరణ పొందిన పార్టీలకు ప్రజలు పట్టం కట్టారు అన్నారు. భారతదేశంలో అభివృద్ధి సంక్షేమం సమానత్వం మైనార్టీల హక్కుల పరిరక్షణ బీజేపీ ఎన్డీఏ కూటమితోనే సాధ్యమని ప్రజలు విశ్వసించారని అందుకే బెంగాల్లో మూడుసార్లు సీఎంగా ఉన్న మమతా బెనర్జీని ఓడించి బీజేపీ పట్టం కట్టారని ఆమె అన్నారు. మహిళ బిల్లును వ్యతిరేకించడం నియోజకవర్గాల పునర్విభజన బిల్లును వ్యతిరేకించిన రాజకీయ పక్షాలకు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం జరిగిందన్నారు. ఎన్డీఏ డబల్ ఇంజన్ సర్కారుకు జరిగిన ఎన్నికలు మరింత బలోపేతం చేసి భారతదేశ సర్వతోముఖాభివృద్ధి బాటలు వేయడం జరిగిందని నరేంద్ర మోడీ భారతదేశం, ప్రపంచంలోనే గర్వించే విధంగా ముందుకు తీసుకెళ్తారని ఆమె విశ్వసించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్, ఐటీ విద్యాశాఖమాత్యులు నారా లోకేష్ సారధ్యంలో ఆంధ్ర రాష్ట్రంలో ఎన్డీఏ భాగస్వామి పక్షమైన టిడిపి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమంతో స్వర్ణాంధ్రగా పరుగులు తీస్తుందని అదే స్పూర్తితో ముందుకు వెళ్లాలని లక్ష్మి పిలుపునిచ్చారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

## పుతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీ మోహన్

పూతలపట్టు (చైతన్యరథం): ఐరాల మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో పుతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీ మోహన్ ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ నిర్వహించడం జరిగింది. ఐరాల మండలంలోని వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన ప్రజల సమస్యలను నేరుగా విన్న ఎమ్మెల్యే, వారి నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. భూ సమస్యలు, సంక్షేమ పథకాలు, స్థానిక సమస్యలపై వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని అక్కడే ఉన్న అధికారులకు ఎమ్మెల్యే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజల చెంతకే పాలనను తీసుకెళ్లి, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయడమే మన లక్ష్యం అన్నారు.



# నిత్యావసరాలు సక్రమంగా పంపిణీ చేయాలి

## అధికారులకు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆదేశం



పుట్టపర్తి (చైతన్యరథం): స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాల సాధనలో భాగంగా నియోజకవర్గ అభివృద్ధిపై పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఆర్డీవో సువర్ణ, ఆరు మండలాల తహసిల్దార్లు, ఎంపీడీవోలు, పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, పబ్లిక్ హెల్త్ డీఈ నరసింహమూర్తి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో స్మశాన వాటికల కోసం తగిన స్థలాలను గుర్తించాలని, బంగారు కుటుంబాలను గుర్తించి నిజమైన పేదలకు సంక్షేమ పథకాలు చేరేలా చూడాలని సూచించారు. రేషన్ దుకాణాల ద్వారా పేదలకు నిత్యావసర సరుకులు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నియోజకవర్గ అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా వారు అధికారులకు సూచించారు.

# ఘనంగా ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు పుట్టిన రోజు వేడుకలు



మడకశిర (చైతన్యరథం): సత్యసాయి జిల్లా అధ్యక్షుడు, మడకశిర ఎమ్మెల్యే టీటీడీ బోర్డు సభ్యుడు ఎమ్మెస్ రాజుకు జన్మదిన సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సామకోటి ఆదినారాయణ అనంతపురంలోని వారి నివాసం వద్ద భారీ ఎత్తున బాణాసంచా కాల్చి క్రేన్‌తో గజమాల వేశారు. అదే విధంగా పూల వర్షంతో ఘన స్వాగతం పలకడం జరిగింది. సామకోటి ఆదినారాయణ మాట్లాడుతూ యువ నాయకుడు నారా లోకేష్ బాబు స్ఫూర్తితో నడుస్తున్న వ్యక్తి మీా రాజన్న రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్య సాయి జిల్లాలో గెలుపే దిశగా విజయం సాధిస్తామని, తెలుగుదేశం పార్టీని అఖండ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరంతో పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు జరిగింది.

# పది విద్యార్థులకు సైకిళ్ల వితరణ

## ఎమ్మెల్యే పరిటాల వెల్లడి


రాప్తాడు (చైతన్యరథం): నియోజకవర్గంలో ఇన్ఫిన్ స్వచ్ఛంద సంస్థ వారు ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు 50 శాతం సబ్సిడీతో సైకళ్లను పంపిణీ చేయడానికి అంగీకరించడం జరిగింది. బ్బాయిల సైకిల్ విలువ 7వేల 5వందల రూపాయలు కాగా అందులో 50శాతం అనగా 3వేల 750 రూపాయలు విద్యార్థి చెల్లించాల్సి ఉంటుంది. అలాగే అమ్మాయిల సైకిల్ విలువ 8వేల రూపాయలు కాగా అందులో 50శాతం అనగా 4వేల రూపాయలు విద్యార్థి చెల్లించాల్సి ఉంటుంది. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి వినియోగించుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.



# దివ్యాంగులకు ఉచితంగా 70 మోటార్ సైకిళ్ల పంపిణీ




కర్నూలు (చైతన్యరథం): కలెక్టర్ కార్యాలయంలో 70 మంది దివ్యాంగుల లబ్ధిదారులకు ఉచితంగా మూడు చక్రాల స్కూటీ వాహనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంస్థ చైర్మన్ గడుపూటి నారాయణస్వామి, జాయింట్ కలెక్టర్ నూరుల్, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వరులు, కర్నూల్ నగర టీడీపీ అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ, కర్నూల్ జిల్లా ఏడి శ్రీమతి ఫాతిమా గారు , జిల్లా హ్యాండిక్యాప్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శ్రీ కే.కృష్ణుడు, టీడీపీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ కె.ఎల్లప్ప, విభిన్న ప్రతిభావంతులు రాష్ట్ర అధ్యక్షుడు బోయ రామాంజనేయులు, విభిన్న ప్రతిభావంతుల జనసేన జిల్లా అధ్యక్షులు నాగరాజు, దివ్యాంగ ఉద్యోగ సంఘాల నాయకులు భాషా, లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



రాప్తాడు నియోజకవర్గం, చెన్నేకొత్తపల్లి మండలకేద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన "మీభూమి - మీహక్కు" కార్యక్రమంలో భాగంగా రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ కార్యక్రమంలో రైతులు, అధికారులు, కూటమి నాయకులతో కలసి పాల్గొన్న రాప్తాడు శాసన సభ్యురాలు పరిటాల సునీత

# మహానాడుకు ముస్తాబవుతున్న నెల్లూరు

## కిసాన్ సెజ్‌లో శరవేగంగా భూమిపూజ ఏర్పాట్లు

## క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి నారాయణ

నెల్లూరు(చైతన్యరథం): జిల్లా కొడవలూరు మండలం లోని కిసాన్ సెజ్‌లో ప్రతిష్టాత్మక మహానాడు భూమిపూజకు ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. ఈ పనులను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సోమవారం పరిశీలించారు. సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ సత్యనారాయణ రాజుతో చర్చించి పలు సూచనలు చేశారు.మూడు రోజులపాటు పార్టీ అధినేత,రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మూడురోజుల పాటు జిల్లాలో ఉండనుండటంతో యంత్రాంగం అప్రమత్తమై భద్రత సర్వం సిద్ధం చేస్తోంది.ఈ పర్యవేక్షణలో రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, వాటర్ వేస్ చైర్మన్ జెడ్ శివప్రసాద్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనురాధ తదితర నేతలతో కలిసి తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.





మార్కాపురం శాసనసభ్యుడు కందుల నారాయణరెడ్డి సతీమణి వసంత లక్ష్మి కొనకనమిట్ల మండలంలో వివిధ గ్రామాలకు చెందిన ఏడు మందికి సీఎం సహాయనిధి చెక్కులు అందించారు.



చెన్నేకొత్తపల్లి మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో, చెన్నెకొత్తపల్లి మండలానికి చెందిన 5మంది లబ్ధిదారులకు 2లక్షల 90వేల రూపాయలు విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ జరిగింది

# ఆంధ్రప్రదేశ్ గ్రోత్ ఇంజన్ విశాఖపట్నం




- రాష్ట్రంలో పెట్టుబడులకు ఇదే మంచి తరుణం
- పరిశ్రమల ఏర్పాటుచేసి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం వహించండి
- ప్రవాసాంధ్రులకు విశాఖ ఎంపీ శ్రీభరత్ పిలుపు

మిల్పిటాస్ (కాలిఫోర్నియా): శరవేగంగా అభివృద్ధి సాధిస్తున్న విశాఖ రీజియన్ లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా విశాఖ ఎంపీ ముతుకుమిల్లి శ్రీభరత్ ప్రవాసాంధ్రులకు పిలుపునిచ్చారు. అమెరికా పర్యటనకు వెళ్లిన శ్రీభరత్ కాలిఫోర్నియాలోని మిల్పిటాస్ లో ఉత్తర అమెరికా ప్రత్యేక ప్రతినిధి కోమటి జయరాం ఆధ్వర్యాన నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ కు గ్రోత్ ఇంజన్ విశాఖపట్నం, సీఎం చంద్రబాబు గారి సారథ్యంలో ట్రిలియన్ డాలర్ ఎకానమీ దిశగా వేగంగా ముందుకు సాగుతోందని అన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలతో పాటు ప్రస్తుతం ఏపీలో పరిశ్రమదారులకు దేశంలోనే అత్యుత్తమ ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. మంత్రి లోకేష్ చొరవతో టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రధాన సంస్థలు తమ కార్యకలాపాలు ప్రారంభించాయి, గూగుల్, ఆర్సెలర్ మిట్టల్ వంటి ప్రధాన సంస్థలు ఇప్పటికే పనులు ప్రారంభించాయి, జులై మొదటివారంలో భోగాపురం ఎయిర్పోర్టు ప్రారంభం కాబోతోంది, ప్రవాసాంధ్ర పెట్టుబడిదారులకు ఇదే మంచి తరుణమని అన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా వస్తున్న పెట్టుబడుల్లో 25శాతానికి పైగా ఏపీకి వస్తున్నాయని చెప్పారు. పరిశ్రమలకు అన్నివిధాలా అనుకూలతలు కలిగిన విశాఖలో పెట్టుబడులు పెట్టి, రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం వహించాల్సిందిగా ఎంపీ శ్రీభరత్ విజ్ఞప్తి చేశారు. ప్రవాసాంధ్రులకు అన్నివిధాల సహాయ, సహకారాలు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుఎస్ఏ ఎన్ఆర్ఐ టిడిపి నాయకులు వెంకట్ కోగంటి, శ్రీకాంత్ దొడ్డపనేని, భక్త భల్లా, సుధీర్ ఉన్నం, హరి సన్నిధి, విజయ్ ఆసూరి, శశి దొప్పలపూడి తదితరులు పాల్గొన్నారు.







# సింగపూర్‌లో అలరించిన స్వరలయ

## ఘనంగా సింగపూర్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ఏడవ వార్షికోత్సవం

సింగపూర్: స్వరలయ ఆర్ట్స్ సింగపూర్ ఫైన్ ఆర్ట్స్ అకాడెమీ వారు తమసంస్థ సప్తమ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. సురవరం ప్రతాప రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ఆచార్య వెలుదండ నిత్యానందరావు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఈ కార్యక్రమం ప్రొఫెసర్ బి.వి.ఎస్.చౌదరి, శ్రీమతి రాజ్యలక్ష్మి చౌదరి సమక్షంలో సింగపూర్ శివకృష్ణ దేవాలయంవారి ఫంక్షన్ హాలు వేదికగా జరిగింది. స్వరలయ సంస్థ విద్యార్థుల సంగీత, కూచిపూడి నృత్య ప్రదర్శనలతో ఆహూతులను అలరించారు. కుమారి శ్రీవిద్య పంతువరాళి రాగంలో "ఎన్నగాను రామభజన" త్యాగరాజ కీర్తనను హృద్యంగా గానం చేసి ప్రేక్షకుల శుభకామనలు అందుకున్నారు. స్వరలయ వ్యవస్థాపక అధ్యక్షురాలు, గురు శేషుకుమారి సంగీత ప్రదర్శనలో ఆలపించిన త్యాగరాజ కీర్తన "ప్రక్కల నిలబడి", ఒక "మీరా భజన్", విద్యార్థులతో కలిసి చేసిన జానపద గీతం ప్రేక్షకుల నుండి విశేష ప్రశంసలు అందుకున్నాయి.



తరువాత తెలుగు విశ్వవిద్యాలయం గ్రేడ్, యూనివర్సిటీ కోర్సులలో ఉత్తీర్ణులైన సంగీత విద్యార్థులకు విసి నిత్యానందరావు అర్హతాపత్రాలు, ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీమతి శేషుకుమారి సంగీత ప్రస్థానాన్ని ప్రశంసించారు. చదివినది ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ అయినా చిన్నతనంనుంచీ సంగీతం పట్ల ఉన్న ఆసక్తి, అనురక్తి కర్నాటక సంగీత రీతులను, లోతులను కొలిచేలా, సంగీతకళను భావితరాలకి అందించేలా ఆమెను నడిపిస్తున్నాయని అన్నారు. స్వరలయ విద్యార్థులు భవిష్యత్తులో కర్నాటక సంగీతరంగంలో తమదైన విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

హార్మనీ & హ్యూస్ అధ్యక్షురాలు శ్రీమతి శ్యామల ప్రసంగిస్తూ 2025లో తిరుపతిలో అన్నమాచార్య 500వ జయంతి ఉత్సవాలలో చేసిన సంగీత కచేరీ, శ్రీమతి శేషుకుమారి వంశీ-సీల్వెల్ ఫౌండేషన్ వారి మంగళంపల్లి బాలమురళీకృష్ణ అవార్డ్ అందుకోవడం స్వరలయ సంస్థ సాధించిన కొత్త మైలురాళ్ళని కొనియాడారు. గురు శ్రీమతి శేషు కుమారిని"సింగపూర్ గాన కోకిల"గా అభివర్ణిస్తూ, ఆమె శిష్యులు ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

గాత్ర సంగీత విద్యార్థి కుమారి మనోజ్ఞ మాట్లాడుతూ కర్నాటక గాత్ర సంగీతాన్ని ఒక O-level ఆప్షనల్ సబ్జెక్టుగా తీసుకుని పరీక్షలు వ్రాసేందుకు మీజు (సింగపూర్ విద్యాశాఖ) తాను అనుమతి సాధించగలగటం విశేషమనీ, ఇది తన గురువు ఇచ్చిన స్ఫూర్తి, మార్గదర్శకత్వం వల్లనే సాధ్యమైందని అన్నారు. సంగీతం ఒక సబ్జెక్టుగా తీసుకోవడంతో ఇటు సంగీతంలో కృషి, అటు చదువుకునే సమయాన్ని సమర్ధవంతంగా వాడుకోవడం వీలవుతోందని చెప్పారు.

ఈ సంవత్సరం స్వరలయ ఆర్ట్స్ తన కార్యకలాపాలను విస్తరించి, గురు శ్రీమతి కృష్ణ శృతి గారి మార్గదర్శకత్వంలో కూచిపూడి నృత్యాన్ని ప్రవేశపెట్టినట్లు శ్రీమతి శేషుకుమారి వివరించారు. ఈ వేడుకలో మరో ప్రత్యేకఆకర్షణగా, గురు శ్రీమతి శేషుకుమారి తాళం, రాగం నేర్పించేందుకు వినూత్నమైన సంగీత ఆటలను ప్రవేశపెట్టారు. ఇవి ప్రత్యక్షంగా వేదికపై నిర్వహించబడి, సంగీత శిక్షణలో ఒక కొత్త పోకడను పరిచయం చేశాయి. యూ.టీ.ఐ.ఏ.ఈ.సీ చైర్మన్ శ్రీ రాయ్ మరియు ట్రెజరర్ వి.ఆదేశ్‌బాబు, కళ, శ్రీ శివ కృష్ణ ఆలయ చైర్మన్, మేనేజర్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

శ్రీసాంస్కృతిక కళాసారధి అధ్యక్షులు కవుటూరి రత్నకుమార్, కాకతీయ సబ్బు ,సింగపూర్ తెలుగు వనితలు సమూహం నుండి శ్రీక్రాంతి, జయ, దీపు, రేఖ, రాణి,గాయత్రి వంటి అతిథుల సమక్షంలో ఈ కార్యక్రమం ఎంతోఘనంగా జరిగింది. పిల్లల ఉత్సాహభరితమైన ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించి, వేడుకను విజయవంతంగా ముగించాయి. సౌజన్య చక్కటి వ్యాఖ్యానంతో కార్యక్రమాన్ని రక్తి కట్టించారు. స్వరలయ ఆర్ట్స్ స్వరలయ ఆర్ట్స్ సింగపూర్‌లో భారతీయ సాంప్రదాయ సంగీతం, నృత్య సంప్రదాయా లను ప్రోత్సహిస్తూ, అభివృద్ధి చేస్తూ ముందుకు సాగుతోంది.

# వికసిత్ భారత్ వైపు మోదీ విజయపరంపర



ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు మించి పశ్చిమ బెంగాల్ లో భాజపా అఖండ విజయం దిశగా దూసుకెళ్తోంది. ఈ క్రమంలో ఆ పార్టీ తమ 'ఎక్స్' ఖాతాలో ప్రత్యేక పోస్ట్ చేసింది. కాషాయం బెంగాల్‌ను చేరిందని, ఇక భారత్ అంతా 'మోదీమయం' అని రాసుకొచ్చింది. భాజపా, దాని మిత్రపక్షాలు అధికారం కలిగిన రాష్ట్రాలతో కూడిన ప్రత్యేక భారత మ్యాప్‌ను పంచుకుంది. "దేశ కేంద్రం (దిల్లీ) నుంచి బెంగాల్ వరకు.. ఇది కేవలం విస్తరణ మాత్రమే కాదు. ప్రగతిపథంలో సాగేందుకు దేశ ప్రజలు మాపై చూపించిన విశ్వాసానికి ప్రతీక ఇది. ఉత్తరాది నుంచి ఈశాన్యం వరకు మార్పు కొనసాగుతోంది. ఇప్పుడీ ప్రయాణంలో పశ్చిమ బెంగాల్ అనే అతిపెద్ద అధ్యాయం చేరింది. మనమంతా కలిసి 2047లోగా వికసిత్ భారత్‌ను నిర్మిద్దాం" అని భాజపా తన పోస్ట్లో రాసుకొచ్చింది. ప్రస్తుతం వెలువడుతున్న ఫలితాల్లో పశ్చిమ బెంగాల్‌తో పాటు అస్సాం, పుదుచ్చేరిలో భాజపా స్పష్టమైన ఆధిక్యంలో కొనసాగుతోంది. దీన్ని బట్టి చూస్తే... తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఝార్ఖండ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్, మిజోరంలో మినహా మిగతా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో భాజపా స్వయంగా లేదా మిత్రపక్షంతో కలిసి అధికారంలో ఉంది.



# కేరళలో ఖాతా తెరిచిన భాజపా

## నేమో, చాతన్నూర్, కాళకూటం అసెంబ్లీ నియోజకవర్గాల కైవశం

కేరళలో పదేళ్ల తర్వాత భాజపా ఖాతా తెరచింది. నేమో, చాతన్నూర్, కాళకూటం అసెంబ్లీ నియోజకవర్గాలను కైవసం చేసుకుంది. తమకు ఒక్క సీటు కూడా రాదని కాంగ్రెస్, సీపీఎంలు చేసిన వ్యాఖ్యలకు ఈ ఫలితాలే సమాధానమని కాషాయ పార్టీ కేరళ అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ అన్నారు. కేంద్ర మంత్రి జార్జ్ కురియన్ తాను పోటీ చేసిన కంజిరప్పల్లిలో మూడో స్థానంలో నిలిచారు.నేమోం స్థానంలో రాజీవ్ చంద్రశేఖర్ తన సమీప అభ్యర్థిపై 4,978 ఓట్ల తేడాతో గెలుపొందారు. చాతన్నూర్ లో బీబీ గోపకుమార్ 4,398 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. కాళకూటంలో కేంద్ర మాజీ మంత్రి వి.మురళీధరన్ 428 ఓట్ల తేడాతో గట్టెక్కారు. కేరళ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి భాజపా తొలిసారి 2016లో ఓ సీటు సాధించింది. నేమోం నియోజకవర్గం నుంచి సీనియర్ నేత రాజగోపాల్ గెలిచారు. 2021లో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా రాలేదు. కేరళలో మొత్తం 140 స్థానాలు ఉండగా.. తాజా ఫలితాల్లో 102 స్థానాల్లో విజయంతో యూడీఎఫ్ సెంచరీ కొట్టినట్లయ్యింది. 2021 ఎన్నికల్లో 62 స్థానాల్లో గెలిచిన ఎల్డీఎఫ్.. ఈ సారి 35కే పరిమితమైంది. ధర్మదం నుంచి పోటీ చేసిన సీఎం పినరయి విజయ్ 19,247 ఓట్ల తేడాతో గెలుపొందారు.

# ఎప్పటికీ గుర్తుండిపోయే ఎన్నికలివి

## తాజా ఎన్నికల ఫలితాలపై ప్రధాని మోదీ స్పందన



పశ్చిమ బెంగాల్లో లో కమలం వికసించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా విజయంపై ఆయన ఈమేరకు స్పందించారు. 2026 ఎన్నికలు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. మరోవైపు.. అస్సాం ప్రజలు మరోసారి ఎన్డీయేను ఆశీర్వదించారని పేర్కొన్నారు. తమిళనాడులో టీవీకే అద్భుతమైన ఫలితాలు సాధించిందన్నారు. తమిళనాడు పురోగతికి, అక్కడి ప్రజల సంక్షేమానికి కేంద్రం పాటుపడుతూనే ఉంటుందని చెప్పారు."బెంగాల్ ఎన్నికల్లో ప్రజాశక్తిదే పైచేయి అయ్యింది. భాజపా సుపరిపాలన రాజకీయాలు ఘన విజయం సాధించాయి. ప్రజలు అద్భుతమైన తీర్పు ఇచ్చారు. వారికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. వారి కలలను, ఆశయాలను నెరవేర్చడానికి సాధ్యమైనంత మేర కృషి చేస్తాం. సమాజంలోని అన్ని వర్గాలకూ అవకాశాలు, గౌరవాన్ని కల్పించే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. అస్సాంలో సాధించిన గెలుపు.. అభివృద్ధికి, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి మేం చేస్తున్న ప్రయత్నాలకు లభిస్తున్న మద్దతును చాటిచెబుతోంది" అని ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.. కార్యకర్తల కృషి లేకపోతే బెంగాల్లో ఈ చరిత్రాత్మక విజయం సాధ్యమయ్యేది కాదని ప్రధాని మోదీ అన్నారు. ఏళ్ల తరబడి వారు క్షేత్రస్థాయిలో శ్రమించారని, ఎన్నో ప్రతికూలతలను అధిగమించారని.. వారే తమ పార్టీకి అసలైన బలమని చెప్పారు. కేరళలో విజయంపై యూడీఎఫ్కు అభినందనలు తెలిపారు. వికసిత్ కేరళ కోసం కేంద్రం తరపున సహకారం కొనసాగిస్తామన్నారు. పుదుచ్చేరిలో ఎన్.రంగసామి సర్కారు పనితీరు ఆధారంగా ఓటర్లు ఎన్డీయేకు మరోసారి అధికారాన్ని కట్టబెట్టారని పేర్కొంటూ.. కృతజ్ఞతలు తెలిపారు.

## 'మిస్టర్ ఇండియా 2026' పోటీల్లో

# నేషనల్ ఫైనలిస్ట్‌గా తెలుగు యువకుడు



తమిళనాడు నుంచి 'మిస్టర్ ఇండియా 2026' పోటీల్లో నేషనల్ ఫైనలిస్ట్‌గా ప్రధాన్ రాఘవ నిలిచారు. ఆయన తన మూలాలు తెలుగు నేలపై ఉన్నాయని గర్వంగా చెబుతున్నారు. వారిది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కడప జిల్లా ఈటుమారిపురం గ్రామం. తండ్రి రాఘవ వెంకట సత్యనారాయణ ఉద్యోగ రీత్యా 1965లో తమిళనాడుకు రావడంతో వారి కుటుంబం ఇక్కడే స్థిరపడింది. ప్రధాన్ రాఘవకు తల్లి శిరీష. సోదరుడు సాయికీర్తి (క్రికెటర్) ఉన్నారు. ప్రధాన్ ప్రస్తుతం చెన్నై లయోలా కళాశాలలో ఎంబీఏ చివరి ఏడాది చదువుతున్నారు. ఈయనకు చిన్నతనం నుంచి క్రీడలంటే ఇష్టం. ఖేలో ఇండియా టెన్నిస్ పోటీల్లో యూనివర్సిటీ చాంపియన్‌గా నిలిచారు.



# అంచనాలను అధిగమించి... అందలాన్ని అందుకుని!

సినీ నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ సంచలనం సృష్టించారు. తమిళ రాజకీయాల్లో అసాధ్యమనుకున్నది. సుసాధ్యం చేసి చూపించారు. రాజకీయ పార్టీని ఏర్పాటు చేసిన కేవలం రెండేళ్ల రెండు మాసాల వ్యవధించగా.. తిరుచ్చి ఈస్ట్‌లోనూ అదే పార్టీ అభ్యర్థి ఇనిగో ఇరుదయరాజ్‌పై గెలుపొంది సత్తా చాటారు.

**అంచనాల్ని పటాపంచలు చేస్తూ..**

ఎగ్జిట్ పోల్స్ అంచనాలను పటాపంచలు చేస్తూ టీవీకే పార్టీ అనూహ్య ఫలితాలతో అలోనే చరిత్ర లిఖించారు. టీవీకే ఏర్పాటైన తర్వాత తొలిసారి జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలతో 'విజిల్ వేయించి మెజార్టీ స్థానాలు గెలుచుకొని యావత్ దేశం దృష్టిని ఆకర్షించారు. తద్వారా అటు సినిమాల్లోనే కాదు.. ఇటు పాలిటిక్స్‌లోనూ సూపర్ హిట్' కొట్టారు. చెన్నై జిల్లాలోని పెరంబూర్, తిరుచ్చి జిల్లాలోని తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గాల నుంచి బరిలో దిగిన జోసెఫ్ విజయ్ చంద్రశేఖర్.. తన ప్రత్యర్థులను చిత్తుగా ఓడించారు. పెరంబూర్లో డీఎంకే అభ్యర్థి ఆర్డీ శేఖర్‌పై భారీ మెజార్టీతో విజయం సాధించగా.. తిరుచ్చి ఈస్ట్‌లోనూ అదే పార్టీ అభ్యర్థి ఇనిగో ఇరుదయరాజ్‌పై గెలుపొంది సత్తా చాటారు.

**అంచనాల్ని పటాపంచలు చేస్తూ..**

ఎగ్జిట్ పోల్స్ అంచనాలను పటాపంచలు చేస్తూ టీవీకే పార్టీ అనూహ్య ఫలితాలతో అందరినీ ఆశ్చర్యపరిచింది. కొన్ని ఎగ్జిట్‌పోల్స్, కొందరు రాజకీయ విశ్లేషకులు మాత్రం విజయ్ ప్రభావం అంతగా ఏమీ ఉండకపోవచ్చని.. ఓట్లు చీలుస్తారని, ఒకవేళ హంగ్ వస్తే ఆయన కింగ్మేకర్ అవుతారంటూ రకరకాల అంచనాలు వెలువరించారు. కానీ, వాటన్నింటినీ తారుమారు చేస్తూ అనూహ్యంగా టీవీకే అత్యధిక స్థానాలు గెలుచుకోవడం, తొలి ప్రయత్నంలోనే ప్రజలు జేజేలు పలకడంతో ఆయన కింగ్ అవతరించడం ఇప్పుడు దేశమంతా హాట్ టాపిక్‌గా మారింది. ఈ అపూర్వ విజయంతో మంచి జోష్‌లో ఉన్న టీవీకే శ్రేణులు, నేతలు ప్రభుత్వ ఏర్పాటు దిశగా ముమ్మర కసరత్తు చేస్తున్నారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే విజయ్ మే 7న సీఎంగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉన్నట్లు వార్తలొస్తున్నాయి.

## 7న సీఎంగా విజయ్ ప్రమాణం!

**తన కారు డ్రైవర్ కొడుకుకు సీటిచ్చి..**

విజయ్ దాదాపుగా సామాన్యులకే సీట్లు కేటాయించడం ద్వారా తనదైన మార్కు చూపించారు. రాజకీయ వారసత్వానికి భిన్నంగా ఆయన క్షేత్రస్థాయి కార్యకర్తలకే సీట్లు ఇచ్చి ప్రత్యేకతను చాటారు. తన వద్ద దాదాపు 30 ఏళ్లుగా కారు డ్రైవర్‌గా పనిచేసి, ప్రస్తుతం సహాయకుడిగా కొనసాగుతున్న రాజేంద్రన్ కుమారుడు శబరినాథన్‌ను చైన్నైలోని విరుగంబాక్కం నియోజకవర్గం నుంచి విజయ్ బరిలో దించారు. ఈ సీటును అతడికి విజయ్ ప్రకటించిన సమయంలో రాజేంద్రన్, శబరినాథన్లు భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకోగా.. విజయ్ వారిని ఓదార్చారు. ప్రస్తుత ఎన్నికల ఫలితాల్లో శబరినాథన్ డీఎంకే అభ్యర్థిపై ఆధిక్యంతో స్పష్టమైన విజయం దిశగా దూసుకెళ్తుండటం విశేషం.

**ఆటోడ్రైవర్ అపూర్వ విజయం..**

అలాగే, రోయపురం నియోజకవర్గంలో ఓ ఆటో డ్రైవర్కు విజయ్ సీటు ఇచ్చారు. ఈ స్థానం నుంచి బరిలో నిలిచిన ఆటో డ్రైవర్ కె. విజయ్ రాము శక్తిమంతమైన రాజకీయ వారసత్వం కలిగిన వ్యక్తులనే ఓడించి అద్భుత విజయం సాధించారు. ఐదు సార్లు ఎమ్మెల్యే డాక్టర్ జయకుమార్ (అన్నాడీఎంకే), మాజీ మంత్రి రెహ్మాన్ ఖాన్ తనయుడు సుబైర్ ఖాన్లను ఓడించి సరికొత్త రికార్డు నెలకొల్పారు. విజయ్ ధాముకు మొత్తంగా 59,091 ఓట్లు రాగా.. తన సమీప ప్రత్యర్థి, డీఎంకే అభ్యర్థిపై 14,249 ఓట్ల మెజార్టీతో గెలుపొందడం విశేషం.

# ఒప్పందానికి వస్తారా!?

- **యుద్ధం ముగింపునకు మూడంచెల ప్రణాళిక**
- **14 పాయింట్లతో అమెరికాకు ఇరాన్ సమర్పణ**
- **దిగ్బంధనం ఎత్తివేత.. హర్మూజ్‌ను తెరవడం తొలిదశలోనే..**
- **తాను ఒప్పుకోలేనివి అడుగుతున్నారన్న డొనాల్డ్ ట్రంప్**

పశ్చిమాసియాలో యుద్ధం ముగింపు దిశగా దౌత్య ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా అమెరికాకు పాకిస్థాన్ ద్వారా ఇరాన్ కొత్త ప్రణాళికను సమర్పించింది. ఇది సజావుగా అమలైతే 30 రోజుల్లో యుద్ధం ముగుస్తుంది. 14 పాయింట్ల ఈ ప్రణాళికలో మొత్తం మూడంచెలుంటాయి. తొలి అంచెలో– హర్మూజ్ జలసంధిని క్రమంగా తెరుస్తారు. ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనాన్ని అమెరికా ఎత్తివేస్తుంది. అదే సమయంలో సముద్రంలో మందుపాతరల తొలగింపు ప్రక్రియ టెహ్రాన్ నేతృత్వంలో జరుగుతుంది. రెండో అంచెలో– నిర్దిష్ట కాల పరిమితి తర్వాత యురేనియం శుద్ధిని (3.6శాతం వరకే) ఇరాన్ తిరిగి ప్రారంభిస్తుంది. అది తమ గడ్డపై అణు మౌలిక వసతుల ధ్వంసానికి అంగీకరించదు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేయకూడదు. టెహ్రాన్ దాడులకు దిగకూడదు. జప్తు చేసిన టెహ్రాన్ ఆస్తులను విడుదల చేయాలి. చివరిదైన మూడో అంచెలో– పొరుగున ఉన్న అరబ్ దేశాలతో టెహ్రాన్ వ్యూహాత్మక చర్చలు జరుపుతుంది. పశ్చిమాసియా ప్రాంతీయ భద్రతకు ప్రత్యేక





వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడంపై దృష్టి పెడతారు. భవిష్యత్తులో మళ్లీ దాడులకు దిగబోమని ఇరాన్‌కు అమెరికా హామీ ఇవ్వడంవంటి అంశాలూ కొత్త ప్రణాళికలో ఉన్నాయి. వాషింగ్టన్ ప్రతిపాదించిన 9 పాయింట్ల ప్రణాళికకు ప్రతిగా టెహ్రాన్ దీన్ని రూపొందించింది.

### భారీ ట్యాంకర్‌పై దాడి

హర్మూజ్ సమీపంలో ఓ భారీ ట్యాంకర్‌పై ఆదివారం చిన్న బోట్లు దాడి చేశాయని బ్రిటన్ సైన్యానికి చెందిన యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైం ట్రేడ్ ఆపరేషన్స్ సెంటర్ తెలిపింది. సిరిక్ (ఇరాన్) తీరంలో ఈ ఘటన చోటుచేసుకుందని వెల్లడించింది. అయితే ట్యాంకర్‌లోని సిబ్బంది అంతా సురక్షితంగానే ఉన్నారని పేర్కొంది. దాడి ఎవరు చేశారనేది తెలియరాలేదు.

### వేరే నౌకలు వెళ్లొచ్చు: ఇరాన్


హర్మూజ్‌పై తమ నియంత్రణ కొనసాగుతోందని ఇరాన్ అధికారులు పునరుద్ఘాటించారు. అమెరికా, ఇజ్రాయెల్‌కు చెందినవి వినా ఇతర దేశాల నౌకలు తమకు టోల్ చెల్లించి.. జలసంధిలో ప్రయాణించొచ్చని పేర్కొన్నారు. హర్మూజ్‌లో టోల్ వసూళ్లతో ఇరాన్ ఇప్పటివరకూ 13 లక్షల డాలర్లకంటే తక్కువే సంపాదించిందని, చమురు ద్వారా దానికి వచ్చే రోజువారీ ఆదాయంతో పోలిస్తే అది చాలా తక్కువని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఎద్దేవా చేశారు. ఇరాన్ కరెన్సీ విలువ మరింత పతనమైంది. మారకపు విలువ ఒక డాలరుకు 18.40 లక్షల రియాళ్లుగా ఆదివారం నమోదైంది.

### భారత్‌కు వస్తూ.. హర్మూజ్ దాటిన ఎల్పీజీ ట్యాంకర్

భారత్‌కు 46,313 టన్నుల ద్రవీకృత పెట్రోలియం వాయువును (ఎల్పీజీ) మోసుకొస్తున్న ఓ ట్యాంకర్ శనివారం హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటింది. మార్షల్ ఐలాండ్స్ పతాకంతో ఉన్న ఈ ట్యాంకర్ పేరు 'ఎంటీ సర్వ్ శక్తి'. ఇది ఈనెల 13న విశాఖపట్నం తీరానికి చేరుకోనుంది.

### ఇరాన్ ఇంకా మూల్యం చెల్లించుకోలేదు: ట్రంప్

ఇరాన్ తాజా ప్రణాళికపై ఇప్పటికీ తాను సంతృప్తిగా లేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. తాను అంగీకరించలేనివి ఆ దేశ నేతలు అడుగుతుండటమే అందుకు కారణమని చెప్పారు. '47 ఏళ్లుగా మానవాళికి, ప్రపంచానికి కలుగజేసిన నష్టానికి సరిపడా మూల్యాన్ని ఇంకా ఇరాన్ చెల్లించుకోలేదు' అని వ్యాఖ్యానించారు. అయితే ఇరాన్‌పై భారీస్థాయి దాడులు చేపట్టకుండా ఉండేందుకే తాను మొగ్గుచూపుతానని విలేకర్లతో మాట్లాడుతూ తెలిపారు.



## మానసరోవర్ మార్గంపై నేపాల్ అభ్యంతరం

**- నేపాల్ వాదనను తిరస్కరించిన భారత్**

లిపులేఖ్ పాస్ ద్వారా కైలాశ్ మానసరోవర్ యాత్రను నిర్వహించాలన్న భారత ప్రణాళికలపై నేపాల్ అభ్యంతరం వ్యక్తం చేసింది. లిపులేఖ్ తమ భూభాగమని పేర్కొంది. తమను సంప్రదించకుండా ఆ మార్గంలో యాత్రకు ప్రణాళికలు రూపొందించడమేంటని ప్రశ్నించింది. నేపాల్ విదేశాంగ శాఖ ఆదివారం ఈమేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. లిపులేఖ్, లింపియాధురా, కాలాపానీ తమ భూభాగాలేనని అందులో పేర్కొంది. లిపులేఖ్ ద్వారా యాత్ర ప్రణాళికలను రూపొందించినందుకు చైనాకూ తమ అభ్యంతరం తెలియజేశామంది. మరోవైపు– నేపాల్ అభ్యంతరాన్ని భారత్ తిరస్కరించింది. ఉత్తరాఖండ్‌లోని లిపులేఖ్ పాస్ గుండా కైలాశ్ మానసరోవర్ యాత్ర దశాబ్దాలుగా సాగుతోందని గుర్తుచేసింది. భూభాగాల విషయంలో ఏకపక్షంగా ప్రకటనలు చేయడం ఎంతమాత్రమూ అంగీకార యోగ్యం కాదంటూ హితవు పలికింది.

## తెరపైకి 'ప్రాజెక్టు ఫ్రీడమ్'

**హర్మూజ్ జలసంధిపై ట్రంప్ కొత్త ప్లాన్**



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతోన్న వేళ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. హర్మూజ్ జలసంధిలో చిక్కుకున్న విదేశీ నౌకలను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చడానికి 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'ను ప్రకటించారు. ఈమేరకు ఆయన ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. ఈ యుద్ధంలో భాగంకాని చాలా దేశాలకు చెందిన నౌకలు ఈ జలసంధిలో చిక్కుకుపోయాయని ట్రంప్ తెలిపారు. వాటిని విడిపించుకోవడం కోసం ఆయా దేశాలు అమెరికా సాయాన్ని కోరాయన్నారు. వారి అభ్యర్థన మేరకు హర్మూజ్ నుంచి నౌకలు సురక్షితంగా బయటపడేందుకు తాము సాయం చేస్తామన్నారు. ఇందుకోసం ఆయా నౌకలకు అమెరికా బలగాలు మార్గనిర్దేశం చేస్తాయన్నారు. దీనికి 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'గా పేరు పెట్టారు. ఇది సోమవారం ఉదయం (పశ్చిమాసియా కాలమానం ప్రకారం) నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఈ ప్రక్రియను ఒక మానవతా చర్యగా ట్రంప్ అభివర్ణించారు. చాలా నౌకల్లోని సిబ్బంది ఆహారం, నిత్యావసరాల నిల్వలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. తాము తలపెట్టిన ఈ మానవతా ప్రక్రియకు ఎలాంటి ఆటంకం కలిగినా.. దాన్ని బలప్రయోగంతో ఎదుర్కొంటామని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా తమ ప్రతినిధులు ఇరాన్‌తో సానుకూలమైన చర్చలు జరుపుతున్నారన్నారు. ఈ చర్చలు అందరికీ మంచి ఫలితాలిస్తాయని తాను భావిస్తున్నట్టు ట్రంప్ పేర్కొన్నారు.

## ఖలిస్థాన్ తీవ్రవాదులతో జాతీయ భద్రతకు ముప్పు

**- కెనడా నిఘా ఏజెన్సీ నివేదిక**




ఒట్టావా: ఖలిస్థాన్ వేర్పాటువాదుల విషయంలో కెనడా కీలక నిర్ణయం తీసుకుంది. ఖలిస్థాన్ వేర్పాటువాదులు తమ దేశ జాతీయ భద్రతకు ముప్పుగా కెనడా సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీస్ ప్రకటించింది. తమ హింసాత్మక తీవ్రవాద అజెండాను కెనడాలో ప్రచారం చేయడానికి వేర్పాటువాదుల బృందం వివిధ సంస్థలను వాడుకుంటున్నట్టు పేర్కొంది. ఆదివారం ఈమేరకు '2025 పబ్లిక్ రిపోర్ట్'ను విడుదల చేసింది. కెనడా కేంద్రంగా ఖలిస్థాన్ వేర్పాటువాదుల హింసాత్మక కార్యకలాపాలు ఈ దేశానికి, కెనడా ప్రయోజనాలకు ముప్పుగా నివేదిక పేర్కొన్నది. 'కెనడా పౌరులతో సంబంధాలు కొనసాగిస్తున్న సీబీకేఈ.. తీవ్రవాద అజెండా ప్రచారానికి వారిని ఉపయోగించుకుంటున్నది. అమాయక పౌరుల నుంచి నిధులు సేకరించి, వాటిని హింసాత్మక కార్యకలాపాల వైపు మళ్లిస్తున్నది' అని నివేదిక తెలిపింది. నివేదికను కెనడా ప్రభుత్వ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకొచ్చింది. జస్టిన్ ట్రూడో తర్వాత కెనడా ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మార్క్ కార్నీ.. భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపర్చేందుకు ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే.

## నైజీరియాలో ఘోరం

**రే..ప్ ఫెస్ట్ పేరిట అకృత్యాలు.. మహిళలపై దాడులు**

ఆఫ్రికా దేశమైన నైజీరియాలో దారుణం చోటుచేసుకుంది. ఫెర్టిలిటీ కోసం ఒరాముడు కమ్యూనిటీ జరుపుకొనే అల్యాడు అనే వేడుకలో కొందరు దుండగులు అకృత్యాలకు పాల్పడ్డారు. దీన్ని రే..ప్ ఫెస్టివల్ అంటూ మహిళలపై దారుణాలకు పాల్పడ్డారు. నైజీరియాలోని డెల్టా స్టేట్‌లో గత మార్చిలో ఘటన చోటుచేసుకుంది. అంతర్జాతీయ మీడియా వెల్లడించిన వివరాల ప్రకారం.. కొందరు వ్యక్తులు రే..ప్ ఫెస్టివల్ పేరిట దారుణాలకు తెగబడ్డారు. స్థానిక యూనివర్సిటీకి చెందిన విద్యార్థినులతోపాటు మరికొందరు మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడ్డారు. వీధులు, బహిరంగ ప్రదేశాల్లో ఉన్న మహిళల్ని వేధించారు. వారి దుస్తులు లాగి లైంగిక దాడికి పాల్పడ్డారు. కొందరిని నగ్నంగా చేశారు. అనేక హింసాత్మక ఘటనలకు పాల్పడ్డారు. పెద్ద వయసు వారితోపాటు యువకులు కూడా దారుణానికి పాల్పడిన వారిలో ఉన్నారు. చాలామంది గుమిగూడి, గట్టిగా అరుస్తూ దాడులు జరిపారు. ఇదంతా బహిరంగంగా, వీధుల్లో జరగడం విశేషం. కొంతమంది మహిళలపై దాడి జరగడంతో వారు ఆస్పత్రుల్లో చేరి, చికిత్స తీసుకున్నారు. దీనికి సంబంధించిన దృశ్యాలు ఇటీవల వైరల్‌గా మారాయి. దీంతో ఈ ఘటన షాక్‌కు గురి చేసింది. ఒక బాధిత మహిళ తను వారినుంచి ఎదుర్కొన్న భయానక అనుభవం గురించి సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. తమను కొందరు వ్యక్తులు చుట్టుముట్టి, దుస్తులు విప్పేసి లైంగిక దాడికి పాల్పడ్డారని ఆమె తెలిపారు. ఇప్పటికీ దీనికి సంబంధించి తాను మానసికంగా, శారీరకంగా బాధపడుతున్నట్టు పేర్కొన్నారు. ఈ ఘటనపై డెల్టా స్టేట్ పోలీసులు మాట్లాడుతూ.. ఈ నేరానికి పాల్పడిన కొందరు



దుండగుల్ని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మరికొందరు నిందితుల్ని గుర్తిస్తామన్నారు. నిందితులు అందరినీ గుర్తించి అరెస్టు చేస్తామన్నారు.

చైతన్యరథం

# గెలుపు దిశగా ముంబై

- రోహిత్‌శర్మ రీ ఎంట్రీలో అదుర్స్
- లక్నో 228 భారీ స్కోరు చేసినా..
- ఛేదనలో అదరగొడుతున్న ఎంఐ



వాంఖడే వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరుగుతోన్న మ్యాచ్‌లో లఖ్‌న వూ సూపర్ జెయింట్స్ భారీ స్కోర్ చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఎల్ఎస్‌జీ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 228 పరుగులు చేసింది. ముంబైకి 229 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. ఆ తర్వాత బ్యాటింగ్ ఆరంభించిన ముంబై జట్టులో ఓపెనర్లు రికెల్టన్, రోహిత్‌శర్మ విధ్వంసం సృష్టించి పరుగుల వరద పారించారు. అర్ధసెంచరీలతో ఆకట్టుకున్నారు. తొలి వికెట్‌కు 10.4 ఓవర్లలోనే 175 పరుగులు జోడించారు. రికెల్టన్ 32 బంతుల్లో 83 పరుగులు చేసి అవుటయ్యాడు. రోహిత్‌శర్మ 42 బంతుల్లో 84 పరుగులు చేసి 14వ ఓవర్‌లో 177 పరుగుల వద్ద రెండో వికెట్‌గా ఆవుటయ్యాడు. ఇంకా విజయానికి 36 బంతుల్లో 52 పరుగులు మాత్రమే కావాల్సి ఉండగా చేతిలో ఎనిమిది వికెట్లు ఉన్నాయి.

**లక్నో బ్యాటింగ్‌లో పూరన్ సత్తా**

అంతకుముందు బ్యాటింగ్‌లో లఖ్‌నవూ స్టార్ బ్యాటర్ నికోలస్ పూరన్ (63) ఎట్టకేలకు ఫామ్ అందుకున్నాడు. కేవలం 16 బంతు ల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు మొత్తంగా 21 బంతుల్లో 8 సిక్స్‌లు, 1 ఫోర్‌తో 63 పరుగులు చేసి ఔటయ్యాడు.





ముంబై బౌలర్లు ఈ మ్యాచ్‌లోనూ ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు. మిచెల్ మార్ష్(44; 25 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), హిమ్మత్ సింగ్(40; 31 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఐడెన్ మార్క్రమ్(31; 25 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) రాణించారు. జోస్ ఇంగ్లిష్(13), రిషబ్ పంత్ (15), రఘువంశీ(11) విఫలమయ్యారు. ముంబై బౌలర్లలో కార్బిన్ బాష్ 2, ఘజన్‌ఫర్ 1, రఘు శర్మ 1, విల్ జాక్స్ 1 వికెట్ పడగొట్టారు.

## మాడ్రిడ్ కింగ్ సినర్

**- ఫైనల్లో జర్మనీపై విజయం**



మాడ్రిడ్: ప్రపంచ టెన్నిస్ నెంబర్‌వన్ ఆటగాడు జానిక్ సినర్ మాడ్రిడ్ ఓపెన్‌లో చాంపియన్‌గా నిలిచాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో టాప్‌సీడ్ సినర్ (ఇటలీ) 6-1, 6-2తో జ్వెరెవ్ (జర్మనీ)ని చిత్తుచేసి ఇక్కడ తొలిసారి టైటిల్ నెగ్గాడు. దీంతో సినర్.. వరుసగా ఐదో మాస్టర్స్ 1000 ఈవెంట్ గెలిచిన తొలి ఆటగాడిగా రికార్డుకెక్కాడు.

## విమర్శలకు సుందర్ చెక్ పెట్టాడు: అశ్విన్

ఐపీఎల్ 2026లో గుజరాత్ టైటాన్స్ వరుస విజయాలతో దూసుకెళు తోంది. అద్భుత ప్రదర్శనలతో అగ్రస్థానంలో ఉన్న జట్లను జట్లను ఓడించి ఔరా అనిపించింది. ఆదివారం పంజాబ్ కింగ్స్‌పై 4 వికెట్ల తేడాతో గెలుపొం దింది. 19.5వ బంతికి వాషింగ్టన్ సుందర్ సిక్సర్ బాది జట్టును గెలిపించాడు. దీంతో గుజరాత్.. పదింట్లో ఆరు మ్యాచులు గెలిచి పాయింట్ల పట్టిక లో ఐదో స్థానానికి ఎగబాకింది. అయితే ఈ మ్యాచ్‌లో వాషింగ్టన్ సుందర్



ఐదో స్థానంలో క్రీజులోకి వచ్చి 23 బంతుల్లో 40 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అతడి అద్భుత ప్రదర్శనతో జట్టు ప్లే ఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచాడు. ఈ నేపథ్యంలో సుందర్ ఆటతీరును టీమిండియా మాజీ ప్లేయర్ రవిచంద్రన్ అశ్విన్ ప్రశంసించాడు. 'గుజరాత్ టైటాన్స్ అద్భుత ప్రదర్శనలు చేస్తోంది. టాప్‌లో ఉన్న రెండు జట్లను వెనువెంటనే ఓడించడం అంత సులువైన విషయం కాదు. ఆ విమర్శలకు, సందేహాలకు తన నాక్‌తో సుందర్ చెక్ పెట్టాడు.

# ఇంగ్లండ్‌కు స్టార్ ఓపెనర్ ఫిల్ సాల్ట్

**- ఆర్సీబీకి బిగ్‌షాక్**

ఐపీఎల్ 2026లో అద్భుత ప్రదర్శనలో రాణిస్తున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు కీలక సమయంలో బిగ్ షాక్ తగిలింది. గాయం కారణంగా గత మూడు మ్యాచ్‌ల నుంచి ఆటకు దూరంగా ఉన్న స్టార్ ఓపెనర్ ఫిల్ సాల్ట్.. తాజాగా ఇంగ్లండ్‌కు వెళ్లాడు. గాయానికి సంబంధించిన టెస్టు కోసం తన స్వదేశానికి చేరుకున్నాడు. స్కానింగ్ తీసిన అనంతరం పరిస్థితిని బట్టి ఆర్సీబీ జట్టుతో చేరనున్నట్లు తెలుస్తోంది. శస్త్రచికిత్స అవసర మైతే మాత్రం ఈ లీగ్ నుంచి వైదొలిగినట్లే. ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్ సందర్భంగా సాల్ట్ వేలికి గాయమైన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఫిల్ సాల్ట్ స్థానంలో జాకబ్ బెథెల్ ఓపెనర్‌గా వస్తున్న సంగతి తెలిసిందే. ఫిల్ సాల్ట్ ఓపెనర్‌గా దూకుడైన ఆటతీరుతో పరుగులు చేస్తాడు. ఈ



సీజన్‌లో ఆరు మ్యాచ్‌లు ఆడి 202 పరుగులు చేశాడు. విరాట్ కోహ్లీతో కలిసి ఆర్సీబీ విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ఇప్పుడు ప్లే ఆఫ్స్ బెర్తుల కోసం తీవ్రమైన పోటీ ఉన్న సమయంలో ఆర్సీబీ కీలక ప్లేయర్ సాల్ట్ లేకపోవడం పెద్ద ఎదురుదెబ్బేనని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సాల్ట్ స్థానంలో ఆడుతున్న బెథెల్.. పెద్దగా ప్రభావం చూపించడం లేదు. గత మూడు మ్యాచుల్లో 39 పరుగులు మాత్రమే చేశాడు. ఇదిలా ఉండగా, ఈ సీజన్‌లో తొమ్మిది మ్యాచ్‌లు ఆడిన ఆర్సీబీ ఆరింట్లో గెలిచి పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతోంది. తన తదుపరి మ్యాచ్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో మే 7న తలపడనుంది.



## ఓడిపోయే మ్యాచ్ గెలిచాం అందుకు కారణం అతడే: శుభమన్‌గిల్

ఐపీఎల్ 2026లో భాగంగా నిన్న (ఆదివారం) అహ్మదాబాద్ వేదికగా ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ 4 వికెట్ల తేడాతో పంజాబ్ కింగ్స్‌ను ఓడించింది. ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్.. వాషింగ్టన్ సుందర్‌పై ప్రశంసల జల్లు కురిపించాడు. వాషింగ్టన్ అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శనతోనే విజయం సాధించామని అన్నాడు. పంజాబ్ కింగ్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 163 పరుగులు చేసింది. అనంతరం గుజరాత్ టైటాన్స్ 19.5 ఓవర్లలో 6 వికెట్లకు 167 పరుగులు చేసి గెలుపొందింది. గుజరాత్‌కు ఇది వరుసగా మూడో విజయం కాగా.. పంజాబ్ కింగ్స్‌కు రెండో పరాజయం.

# నేనూ బ్రిజ్‌భూషణ్ బాధితురాలినే

**- రెజ్లర్ వినేశ్ ఫొగట్ సంచలనం**

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు, బీజేపీ నేత బ్రిజ్‌భూషణ్ సింగ్ తనను లైంగికంగా వేధించాడని ఒలింపియన్ వినేశ్ ఫొగట్ వెల్లడించింది. ఈమేరకు వీడియో ద్వారా ఆమె ఈ సంచలన విషయాన్ని బయటపెట్టింది. గతంలో బ్రిజ్‌భూషణ్ లైంగిక వేధింపులపై ఆరుగురు మహిళా రెజ్లర్లు ఫిర్యాదు చేయగా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ కేసుపై కోర్టులో విచారణ జరుగుతోంది. ఆ ఆరుగురు రెజ్లర్లలో తానూ ఒకరినని వినేశ్ తెలిపింది. 'బాధితుల గౌరవానికి, మర్యాదకు సంబంధించిన విషయం కనుక వారి పేర్లు వెల్లడించకూడదని సుప్రీంకోర్టు మార్గదర్శకాలు చెబుతున్నాయి. కానీ కొన్ని పరిస్థితుల రీత్యా ఈ విషయాన్ని చెబుతున్నా. ఫిర్యాదు చేసిన రెజ్లర్లలో నేను కూడా ఉన్నా. మా వాంగ్మూలాల సేకరణ జరుగుతోంది' అని వినేశ్ ఆ వీడియోలో వివరించింది. బ్రిజ్‌భూషణ్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 2023లో రెజ్లర్లు చేసిన ఆందోళనలో వినేశ్ ప్రముఖ పాత్ర పోషించింది.

జాతీయ సీనియర్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌ను ఈనెల 10 నుంచి 12 వరకు ఉత్తరప్రదేశ్‌లోని గోండాలో డబ్ల్యూఎఫ్ఐ నిర్వహిస్తోంది. సెప్టెంబరులో ఆసియా క్రీడలు జరుగుతుండడంతో ఈ టోర్నీకి ప్రాధాన్యమేర్పడింది. ఇక..పారిస్ ఒలింపిక్స్ అనంతరం 18 నెలల తర్వాత మళ్లీ రెజ్లింగ్ బరిలో దిగుతున్న వినేశ్ ఈ టోర్నీలో 57 కిలోల విభాగంలో తలపడుతోంది. గోండా బ్రిజ్‌భూషణ్ స్వస్థలం. పైగా..టోర్నీని ఓ ప్రైవేటు కాలేజీలో నిర్వహిస్తున్నారు. ఆ కాలేజీ



కూడా బ్రిజ్‌భూషణ్‌దేనని వినేశ్ వెల్లడించింది. అందు వల్ల ఈ టోర్నీ నిష్పక్షపాతకంగా జరిగే అవకాశం లేదన్న వినేశ్.. ఈ పోటీలలో తనకు, తన బృందానికి ఏదైనా జరిగితే అందుకు కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యతని ఆ వీడియోలో తెలిపింది. బ్రిజ్‌భూషణ్ వైదొలగినా అనుచరుడైన ప్రస్తుత అధ్యక్షుడు సంజయ్ సింగ్ ద్వారా పరోక్షంగా పెత్తనం చెలాయిస్తున్నాడని వినేశ్ ఆరోపించింది.

చైతన్య రథం
సినిమా
మంగళవారం 5 మే 2026 X

# యూనివర్స్ గిఫ్ట్ బేబీ..!



నటి త్రిషకు సోషల్ మీడియా వేదికగా పుట్టినరోజు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. అభిమానులు, సెలబ్రిటీలు ఆమెతో దిగిన ఫొటోలను పంచుకుంటూ విషెస్ తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో నటి వరలక్ష్మి శరత్‌కుమార్ పెట్టిన స్టోరీ అందరినీ ఆకట్టుకుంటోంది. 'హ్యాపీ బర్త్ డే బేబీ.. బహుశా నీకు ఇది బెస్ట్ బర్త్. లవ్ యూ..' అని వరలక్ష్మి తన ఇన్‌స్టా స్టోరీలో విషెస్ చెప్పారు. ఈ పోస్టును త్రిష రీషేర్ చేశారు. నటి మంచు లక్ష్మి కూడా త్రిషకు శుభాకాంక్షలు తెలిపారు. ఎక్స్‌లో పోస్ట్ పెట్టిన ఆమె.. యూనివర్స్ బెస్ట్ గిఫ్ట్ ఇచ్చిందని పేర్కొన్నారు. "ఎప్పుడూ అందంగా, హుందాగా ఉండే త్రిషకు పుట్టినరోజు శుభాకాంక్షలు. సెలబ్రేట్ చేసుకోవడానికి ఇంతకు మించినరోజు ఏముంటుంది. ఈ భారీ విజయంతో యూనివర్స్ మీకు బెస్ట్ గిఫ్ట్ ఇవ్వాలని నిర్ణయించుకుంది. డబుల్ సెలబ్రేషన్స్ చేసుకోండి. ఈ రోజును అద్భుతంగా ఎంజాయ్ చెయ్ డార్లింగ్' అంటూ హార్ట్ ఎమోజీలను జోడిస్తూ మంచు లక్ష్మి శుభాకాంక్షలు తెలిపారు. ఇక నేడు తన పుట్టినరోజు సందర్భంగా త్రిష తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం టీవీకే అధినేత విజయ్ ఇంటికి వెళ్లి సెలబ్రేషన్స్‌లో పాల్గొన్నారు. మరోవైపు ఆమె పుట్టినరోజు సందర్భంగా విశ్వంభర, కరుప్పు మూవీ టీమ్స్ ప్రత్యేక పోస్టర్‌లు విడుదల చేశాయి.

## సినిమాను తలపించే విజయం మీది..




తొలిసారి ఎన్నికల బరిలోకి దిగిన టీవీకే సత్తా చాటుతూ గెలుపు దిశగా పరుగులు తీస్తోంది. దీంతో ఆ పార్టీ అధినేత, అగ్ర కథానాయకుడు విజయ్‌కి సోషల్ మీడియాలో శుభాకాంక్షలు ప్రారంభమయ్యాయి. సెలబ్రిటీలు విజయ్‌ను ప్రశంసిస్తూ పోస్టులు పెడుతున్నారు. ఈ విజయం సినిమాను తలపిస్తోందంటూ నాని శుభాకాంక్షలు తెలిపారు. "మొదట అందరూ ఈ పార్టీ గెలుస్తుందా? అని సందేహించారు. కానీ, ప్రజలు దానికే పట్టంకట్టారు. మన రాష్ట్రంలోనూ గతంలో ఇలాంటి విజయమే నమోదైంది. ఇప్పుడు మన పక్క రాష్ట్రంలో ఇదే తరహాలో విజయ్ విజిల్ మోగించారు. అంచనాలను తలకిందులు చేస్తూ విజయం సాధించిన ఈ ఎన్నికల ఫలితాలు సినిమాను తలపిస్తున్నాయి. బహుశా ఇదేనేమో రాజకీయం అంటే. స్పష్టమైన మెజారిటీతో విజయ్‌ని తమిళ ప్రజలు గెలిపించారు. వారి నిర్ణయంతో రాష్ట్రం అభివృద్ధి దిశగా పరుగులు తీయాలని కోరుకుంటున్నా" – నాని

"ప్రజలు తమ తీర్పును స్పష్టంగా చెప్పారు. దశాబ్దాలుగా ఎంతోమంది ప్రయత్నించారు. కానీ, ప్రజలు ఎవరిని కోరుకుంటారో విజయం వారినే వరిస్తుందని మరోసారి రుజువైంది. తమిళ ప్రజలు మార్పు కోసం ఎదురుచూస్తున్నారు." –వరలక్ష్మి శరత్ కుమార్

"కంగ్రాట్స్ విజయ్. ఇది చారిత్రాత్మక విజయం. గతంలో ఇలాంటి గెలుపు లేదు. భవిష్యత్తులో రాదు" – జీవి ప్రకాశ్ కుమార్

"అభినందనలు విజయ్. మీపై ప్రజలకున్న నమ్మకాన్ని చూస్తుంటే ఆనందంగా ఉంది. మరింత బలంగా ముందుకు సాగండి" – టైగర్ ష్రాఫ్

"మన భారతీయ సినిమాకు చెందిన విజయ్ విజయం చూస్తుంటే గర్వంగా ఉంది. ఇది ఒక చారిత్రాత్మక విజయం"
– నిఖిల్

## 'తప్పుగా అర్థం చేసుకున్నారు'



నటి జాన్వీకపూర్ తన తాజా ఇంటర్వ్యూలో మద్యం అలవాటు గురించి చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఆమె ఖండించారు. మద్యానికి సంబంధించి తాను చేసిన వ్యాఖ్యలను కొన్ని మీడియా సంస్థలు తప్పుగా చిత్రీకరించడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌లో ఆమె మాట్లాడుతూ.. తన జీవితంలో ఎదురైన ఒక బాధాకరమైన సంఘటన తర్వాత మద్యం అలవాటైందని, దానినుంచి బయటకు రావడానికి చాలా కష్టపడ్డానని పేర్కొన్నారు. అయితే, దీనిపై వస్తున్న కథనాలు తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని ఆమె టీమ్ పేర్కొంది. మద్యం వ్యసనంపై అవగాహన కల్పించే 'ఆఫ్ ది రాక్స్' 'అమహా' సంస్థలు నిర్వహించిన పాడకాస్ట్‌లో జాన్వీ మాట్లాడారు. ఆ మాటలను తప్పుగా వక్రీకరించారని సదరు సంస్థలు నోట్ విడుదల చేశాయి. "జాన్వీకపూర్, ఈ కార్యక్రమానికి సంబంధించిన కంటెంట్‌ను కొన్ని మీడియా సంస్థలు తప్పుగా ప్రచారం చేయడం మా దృష్టికి వచ్చింది. ఇది చాలా ఆందోళన కలిగించే విషయం. జాన్వీకపూర్ ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగా భాగమయ్యారు. ఆమె పంచుకున్న వ్యక్తిగత అనుభవాల వెనక ఉన్న అసలు ఉద్దేశాన్ని,సందర్భాన్ని పక్కదోవ పట్టించేలా ప్రచారం చేయడం సరికాదు"అని పేర్కొన్నాయి.ఈనోట్‌ను జాన్వీకపూర్ తన సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ.. వాస్తవాలను తెలుసుకోకుండా వార్తలను వైరల్ చేయవద్దని కోరారు.



## ఆలియా.. మళ్లీ బిజీ

బాలీవుడ్ హీరోయిన్ అలియా భట్ 'ఆల్ఫా' సినిమాతో రెండేళ్ల తర్వాత ప్రేక్షకుల్ని అలరించడానికి రెడీ అవుతుంది. ఈ సినిమాతోపాటు అలియా మరో సినిమా కూడా చేస్తోంది. రణ్‌బీర్ కపూర్, విక్కీ కౌశల్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న 'లవ్ అండ్ వార్' సినిమాలో కూడా అలియా నటిస్తోంది. మొత్తానికి వరుస చిత్రాలతో బిజీగా ఉన్న అలియా, ఇప్పుడు 'తుంబాడ్–2'లో కూడా నటిస్తున్నట్టు తెలుస్తోంది. హారర్ మైథలాజికల్‌గా ఆదేశ్ ప్రసాద్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో సోహమ్ షా, నవాజుద్దీన్ సిద్ధిఖీ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. తాజాగా ఇప్పుడు ఈ సినిమాలో అలియా భట్ కూడా నటించబోతుంది. చిత్రబృందం అలియాని ఖరారు చేసిందని తెలిసింది. కాగా "తుంబాడ్–2' చిత్రంలో అలియా భట్ ఒక ప్రత్యేకమైన పాత్రలో కనిపించనుందని.. నిజానికి ఆమె పాత్ర చిన్నదే అయినా.. సినిమాపై ఆమె కీలకమైన ప్రభావం చూపించబోతుందట. ప్రధానంగా ఆమె పాత్ర సెకండ్ హాఫ్‌లో వస్తోందట. మొత్తమ్మీద అలియా భట్ మళ్లీ సినిమాల్లో ఫుల్ బిజీ అవుతుంది.

## అందుకే.. తప్పుకున్నాడట

తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్, కమల్ హాసన్ కలిసి ఓ సినిమా చేస్తే.. చూడాలని ఎంతో మంది అభిమానులు దశాబ్దాలుగా ఆశ పడుతున్నారు. వారందరి ఆశకి 'తలైవార్ 173' (వర్కింగ్ టైటిల్)తో గతేడాదే మంచి తీపి కబురు అందింది. పైగా ఈ సినిమాకి సుందర్.సి దర్శకత్వం వహిస్తారని అప్పట్లోనే వెల్లడించారు. కానీ, ఏమైందో ఏమో.. ఈ ప్రకటన వచ్చిన కొన్ని రోజులకే



సుందర్.సి ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారు. సడెన్‌గా సుందర్.సి ఎందుకు తప్పుకున్నారో అప్పుడు ఎవరికీ అర్థం కాలేదు. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో సుందర్.సి మాట్లాడుతూ.. 'రజనీ –కమల్'తో ఓ సినిమా చేయడం అంటే.. అది అద్భుతం. కానీ, అది మామూలు విషయం కూడా కాదు. చాలా ఒత్తిడి ఉంటుంది. నేను ఆ ఒత్తిడిని తట్టుకోలేకపోయాను. నిజం చెప్పాలంటే.. గత 16 ఏళ్లుగా నాకు నచ్చినట్లుగా, ప్రేక్షకులకు ఏం కావాలో అదే తీస్తూ వస్తున్నాను. కానీ ఇంత భారీ ప్రాజెక్టును హ్యాండిల్ చేసే క్రమంలో నా ఆలోచనలను ఇతరులకు వివరించి ఒప్పించలేను అనిపించింది. నాకు కథను అద్భుతంగా నెరేట్ చేయడం రాదు. ఆ ఇద్దరు లెజెండ్స్‌కు నేను పూర్తి న్యాయం చేయలేనని.. ఆ సినిమా నుంచి తప్పుకున్నాను' అని సుందర్.సి తెలిపారు.

## యానిమల్ డేట్‌పై స్పిరిట్ కన్ను

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నప్పటికీ, వివిధ కారణాలవల్ల ఆయన చిత్రాల చిత్రీకరణలో జాప్యం జరుగుతోంది. ప్రస్తుతం ప్రభాస్ 'ఫౌజీ' షూటింగ్‌లో నిమగ్నమై ఉండటంతో, సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రాబోతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'స్పిరిట్' షూటింగ్‌కు తాత్కాలికంగా విరామం లభించింది. ప్రభాస్ ఒకే నెలలో పలు సినిమాలకు డేట్స్ కేటాయించడం, మధ్యలో విదేశీ ప్రయాణాలు వంటి కారణాలతో షెడ్యూల్స్ మారుతూ వస్తున్నాయి. మరోవైపు, అమితాబ్‌బచ్చన్ వంటి దిగ్గజ నటులతో 'కల్కి 2898 ఏడి' సీక్వెల్ కోసం కూడా ప్రభాస్ డేట్స్ కేటాయించాల్సి ఉంది. దీనివల్ల 'స్పిరిట్' తొలుత అనుకున్న మార్చి 2027 నాటికి విడుదల కావడం కష్టమనిపిస్తోంది. ఈ జాప్యాన్ని పరిగణనలోకి తీసుకున్న దర్శకుడు సందీప్ వంగా, ఈ చిత్రాన్ని డిసెంబర్ 1న విడుదల చేయాలని యోచిస్తున్నారు. గతంలో సందీప్ దర్శకత్వంలో వచ్చిన 'యానిమల్' సినిమా కూడా ఇదే తేదీన విడుదలై భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. ఈ భారీ బడ్జెట్ చిత్రంలో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తుండగా, తృప్తి డిమ్రి కథానాయికగా నటిస్తోంది. టి–సిరీస్, శ్రీ భద్రకాళి పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలున్నాయి. షూటింగ్ ఆలస్యమైనప్పటికీ, అవుట్‌పుట్ విషయంలో రాజీ పడకూడదనే ఉద్దేశంతో చిత్ర బృందం పక్కా ప్రణాళికతో ముందుకెళ్తోంది.

